


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 150

శనివారం 20-8-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

Creating World Class Professionals





EXCELLENCE 25 YEARS ESTD 1998 | NBA NATIONAL BOARD OF ACCREDITATION Tier 1 | ACCREDITED WITH GRADE A+ NAAC | nirf 251-300 Rank Band in 2022

- AUTONOMOUS INSTITUTION
- RANKED IN INDIA'S TOP 300 ENGINEERING COLLEGES BY THE MINISTRY OF EDUCATION, GOI (NIRF 2022, 251-300 BAND)
- ACCREDITED BY NAAC WITH A+ GRADE (UNDER CYCLE-2)
- ACCREDITED BY NBA UNDER TIER-1
- MICROSOFT ED-VANTAGE PLANTINUM PARTNER
- JNTUK APPROVED RESEARCH CENTERS IN CSE, ECE, MECH. DEPARTMENTS
- 100% PLACEMENTS GUARANTEED ASSISTANCE
- COMPULSORY INTERNSHIP & MOOCS IN R 20 CURRICULUM
- OFFERING B.TECH WITH MINORS & HONORS.


1000+ PLACEMENTS IN AY 2021-22 FROM 80+ COMPANIES



Sri. Mittapalli Venkata Koteswara Rao
Chairman,
Exec Council MBR JNTUK

"Our efforts at NEC are rightly appreciated and we are elated with joy & pride to get recognised with A+ in NAAC & 251-300 Rank Band in NIRF. Join us & we ensure the best possible learning experience for you!"

Chakravarthi Mittapalli,
B.E., M.S.(USA), Exec-MBA (ISB)
Vice-Chairman & Managing Director



Company	With the package of (LPA)	Placed students
wipro	₹ 3.75-6.7	218
DXC TECHNOLOGY	₹ 4.0	79
Capgemini	₹ 4.0	69
TATA CONSULTANCY SERVICES	₹ 3.6-7	61
Infosys	₹ 3.6	53
Tech Mahindra	₹ 3.25	46
Mphasis The Next Applied	₹ 4.0	36
ZenSar	₹ 4.0	32
Mindtree	₹ 4.0	23
HCL	₹ 4.25	20
TuringMinds	₹ 6.2	15
apps associates	₹ 5.5	14
FIS	₹ 8.65	05
infor	₹ 6.5	08
Cognizant	₹ 5.4	06

Highest Package is 10 LPA | **Average package is 4.6 LPA**

COURSES

B.TECH
- CSE • CSE(AI) • CSE (AI & ML)
- CSE (Cyber Security)
- CSE (Data Science) • ECE • IT
- EEE • ME • Civil

MBA (Dual Specialization)
MCA (2 Years Programme)

M.TECH
- CSE
- Digital Systems and Computer Electronics
- Digital Electronics and Communication Systems
- Power and Industrial Drives
- Thermal Engineering
- Machine Design
- Structural Engineering

NEC NARASARAOPETA ENGINEERING COLLEGE (AUTONOMOUS)

Kotappakonda Road, NARASARAOPETA - 522601, Guntur Dt., Andhra Pradesh.
Ph: +91 - 8143414849 / 810-630-6313 Fax:+8647-239902
e-mail: info@nrtec.in | www.nrtec.in /nrtenggcollege

EAPCET & ECET CODE: **NSPE**

TOP 4th Private Engineering College in AP - as per TOI Education Survey -2022

TOTAL GROUP PLACEMENTS IN AY 2021-22 **1543**

GROUP OF INSTITUTIONS


NARASARAOPETA INSTITUTE OF TECHNOLOGY
NARASARAOPETA, Ph: 08647-239920
www.nrtit.ac.in
EAPCET & ECET CODE: NITN
Placed Students - 180

NARASARAOPETA INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
NARASARAOPETA, Ph: + 91 98481 51522, 98490 34838 | www.nips.edu.in
EAPCET & ECET CODE: NSPP
Placed Students - 41

SRI MITTAPALLI COLLEGE OF ENGINEERING
NH-5, GUNTUR.
Ph: +91 90004 47117, 92477 45046
www.smce.ac.in
EAPCET & ECET CODE: MPLG
Placed Students - 152

SRI MITTAPALLI INSTITUTE OF TECHNOLOGY FOR WOMEN
NH-5, GUNTUR.
Ph: +91 9000 447 117
www.smitw.ac.in
EAPCET & ECET CODE: MPLW
Placed Students - 117

Vibrant 9966547998


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 150

శనివారం 20-8-2022



సిరీస్‌పై భారత్ గురి


నేడు జింబాబ్వేతో రెండో వన్డేలో తలపడనున్న టీమిండియా - 13లో



వారాంతాన లాభాల స్వీకరణ

ఇరు సూచీలకు వరుసగా అయిదో వారమూ లాభాల ముగింపు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సిసోడియాపై సీబీ'ఐ'

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ ఉదంతం కేంద్రానికి, ఆప్‌కి మధ్య అగ్గి రాజేసింది. ఉపముఖ్యమంత్రి సిసోడియా ఇంటిపై సీబీఐ దాడులు చేసింది.

వివరాలు 6లో



కాకరేపిన కథనం

దేశ రాజధాని ఢిల్లీ విద్యా విధానాన్ని ప్రశంసిస్తూ న్యూయార్క్ టైమ్స్ ప్రముఖంగా ప్రచురించిన కథనం కాకరేపింది.

వివరాలు 6లో



7 కోట్ల గృహాలకు కుళాయి

జల్ జీవన్ మిషన్‌లో భాగంగా మూడేళ్లలో 7 కోట్ల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చినట్లు ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో



ఆదాయం పెంచేందుకు..

దేశంలో లిక్కర్ ఆదాయం పెంచుకునేందుకు మద్యం అలవాటు చేసుకోవాలని జపాన్ సర్కార్ యువతకు పిలుపునిచ్చింది.

వివరాలు 6లో

ఏది నిజం?



బాబు తప్పులకు బాజాలెందుకు?

- పోలవరాన్ని ఐదేళ్ల పాలనలో దారుణంగా దెబ్బతీసిన చంద్రబాబు
- ఏటీఎంలా వాడుకున్నారని సాక్షాత్తూ ప్రధానమంత్రే చెప్పిన తీరు.. బాబు పనులు చేసిన తీరును తప్పుబట్టిన ఇంజినీర్లు, నిపుణులు
- అదే విషయాన్ని మొదటి నుంచీ పదే పదే చెబుతున్న ప్రభుత్వం
- దాన్ని కప్పిపుచ్చడానికి రోజుకో అబద్ధపు ప్రచారాన్ని ఎత్తుకుంటున్న రామోజీ
- కేంద్ర సంస్థలపైకి రాష్ట్ర ప్రభుత్వం నెపం నెట్టేస్తోందంటూ విచిత్రమైన వాదన

- వివరాలు 4లో

గ్రామ, వార్డు సచివాలయాలకు..

రూ.3,000 కోట్లు

నిధుల వినియోగంపై ప్రణాళిక శాఖ మార్గదర్శకాలు జారీ

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఆర్థిక పరమైన పనులకు వినియోగం
- ఒక్కో సచివాలయ పరిధిలో రూ.20 లక్షల విలువైన పనులు
- అత్యధిక ప్రభావం చూపే ఆస్తుల కల్పన పనులే చేపట్టాలి
- ఎమ్మెల్యే రెండు రోజుల పర్యటనలో పనులు, వాటిని చేపట్టే ఏజెన్సీ గుర్తింపు
- తాగునీరు, రోడ్లు, డ్రైయిన్లు, విద్యుత్, కల్వర్టులు, ఇతర సివిల్ పనులు..
- కనీసం రూ.లక్ష, గరిష్టంగా రూ.20 లక్షల పనులకు అనుమతి
- ప్రతి నెలా ఎమ్మెల్యే కచ్చితంగా 6 సచివాలయాలు సందర్శించాలి
- ఈ నెల 18వ తేదీ వరకు 3,055 గ్రామ, వార్డు సచివాలయాల సందర్శన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలకు అత్యంత అవసరమైన ఆర్థిక పరమైన పనులను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.3,000.80 కోట్లు మంజూరు చేసింది. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఏడాది మే 11వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాలను సందర్శిస్తున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు స్థానిక ప్రజలకు అవసరమైన, అత్యధిక ప్రభావం చూపే పనులను మంజూరు చేయడానికి ఒక్కో గ్రామ, వార్డు సచివాలయానికి 20 లక్షల రూపాయల చొప్పున 15,004 గ్రామ, వార్డు సచివాలయాలకు ప్రభుత్వం రూ.3,000.80 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో ఎలాంటి పనులు మంజూరు చేయాలనే దానిపై రాష్ట్ర ప్రణాళికా శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. అత్యధిక ప్రభావం చూపే ఆస్తుల కల్పన పనులనే చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కనిష్టంగా ఒక్కో సచివాలయ పరిధిలో రూ.లక్ష, గరిష్టంగా రూ.20 లక్షల పనులనే అనుమతించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. స్థానిక ఎమ్మెల్యే నేతృత్వంలో నోడల్ అధికారులుగా వ్యవహరించే మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్‌లు పనులను గుర్తించాలని చెప్పింది.

సచివాలయాల సందర్శన తప్పనిసరి

- ప్రతి నెలా ఎమ్మెల్యే కచ్చితంగా ఆరు సచివాలయాలను సందర్శించాలి. ప్రతి సచివాలయాన్ని 2 రోజుల పాటు సందర్శించాలి. ఎమ్మెల్యే సందర్శన షెడ్యూల్‌ను పది రోజుల ముందుగానే

మిగతా 2వ పేజీలో ▶

శ్రీవారి సేవలో సీజేఐ

కుటుంబ సమేతంగా దర్శించుకున్న జస్టిస్ ఎన్వీ రమణ

నేడు విజయవాడకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

- విజయవాడ కోర్టు భవన సముదాయానికి ప్రారంభోత్సవం
- గవర్నర్, సీఎంతో కలిసి ప్రభుత్వ అధికారిక విందుకు హాజరు

3లో



తిరుమల శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు

- 'నారాయణ' ధన దాహం..

ఫీజుల కోసం.. ప్రాణం 'టీసీ'!

- రాయితీ ఇచ్చినా.. చెల్లించాలంటూ విద్యార్థిపై ఒత్తిడి.. పాస్ సర్టిఫికెట్, టీసీ ఇవ్వకుండా వేధింపులు
- పక్షం రోజులుగా ప్రాథేయపడినా కనికరించని యాజమాన్యం
- విధిలేని పరిస్థితుల్లో ఒంటిపై పెట్రోల్ పోసుకున్న విద్యార్థి నేత.. పక్కనే ఉన్న దీపంపై పడటంతో వ్యాపించిన మంటలు
- ముగ్గురికి తీవ్రగాయాలు.. డీఆర్‌డీవో అపోలో ఆస్పత్రికి తరలింపు.. హైదరాబాద్‌లో కాలేజీ ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన

10లో



గాయపడిన విద్యార్థి నాయకుడు సందీప్‌కు సెలైన్ బాటిల్ పెట్టి ఆస్పత్రి తీసుకెళ్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

మంకీపాక్స్ నిర్ధారణ కిట్ విడుదల



మంకీపాక్స్‌ను నిర్ధారించే కిట్ అందుబాటులోకి వచ్చింది. విశాఖ మెడ్ టెక్ జోన్‌లోని ట్రాన్సాసియా బయో-మెడికల్స్ ఆర్టీపీసీఆర్ విధానంలో ఈ కిట్‌ను అభివృద్ధి చేసింది. స్వదేశంలో తయారైన మొట్టమొదటి మంకీపాక్స్ నిర్ధారణ కిట్ ఇదే.

వివరాలు 14లో ▸

షెడ్యూల్డ్ బ్యాంకుల్లోనే దేవుడి సొమ్ము డిపాజిట్



దేవదాయ శాఖ పరిధిలో పలు ఆలయాల పేరిట ఉండే మిగులు నిధులను షెడ్యూల్డ్ బ్యాంకుల్లోనే డిపాజిట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అత్యధిక వడ్డీ ఇచ్చే బ్యాంకుల్లోనే స్వల్పకాలానికి డిపాజిట్ చేయాలంది.

వివరాలు 2లో ▸

ఇదం జగత్




అవున్సార్! ఉక్రెయిన్ యుద్ధంతో తీవ్ర ప్రాణ నష్టం జరిగింది!!

పోరబడిన 'ప్రాప్తి'

ఏపీ డిస్కమ్‌లు రూ.412 కోట్లు బకాయిలు ఉన్నట్లు చూపిన కేంద్ర విద్యుత్ పోర్టల్

- ఆ సమాచారం ఆధారంగానే ఎనర్జీ ఎక్స్ఛేంజ్‌లో కొనుగోళ్లు, అమ్మకాలపై నిషేధం
- వాస్తవానికి ఈ నెల 5నే తొలి వాయిదా రూ.1,407 కోట్లు చెల్లించిన ఏపీ.. రెండో వాయిదాకు సెప్టెంబరు 5 వరకూ గడువు
- ఇదే విషయాన్ని కేంద్రం దృష్టికి తెచ్చిన రాష్ట్ర ఇంధన శాఖ
- బకాయిల కారణంగా నిషేధానికి గురైన రాష్ట్రాల జాబితా నుంచి ఏపీ పేరు తొలగింపు
- గురు, శుక్ర వారాల్లో రాష్ట్రంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా



సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఎక్స్)లో విద్యుత్ కొనుగోలు, విక్రయాలు నిర్వహించకుండా నిషేధం విధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. కేంద్ర విద్యుత్ శాఖకు చెందిన 'ప్రాప్తి' వెబ్ పోర్టల్ సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుని దేశవ్యాప్తంగా ఏపీ సహా 13 రాష్ట్రాల్లోని 29 డిస్కమ్‌లపై గురువారం కేంద్రం నియంత్రణ విధించిన సంగతి తెలిసిందే. బకాయిలను ఏపీ డిస్కమ్‌లు సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ ప్రాప్తి పోర్టల్‌లో

మిగతా 2వ పేజీలో ▶

ఎరువులు పుష్కలం

ఇప్పటివరకు 8.54 లక్షల టన్నుల విక్రయాలు



- అందుబాటులో ఇంకా 7.70 లక్షల టన్నులు
- ఆగస్టు నెలకు అవసరమైనవి 6.11లక్షల టన్నులే
- ఆర్బీకేల్లోనూ అందుబాటులో ఎరువులు
- డీఏపీ, ఎస్ఎస్‌పీ ఎరువుల ధరల్లో స్వల్ప పెరుగుదల
- కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీకి మించి విక్రయించినా లైసెన్సులు రద్దు.. క్రిమినల్ కేసులు నమోదు
- టోల్ ఫ్రీ నెం.155251కు ఫోన్‌చేస్తే చర్యలు
- ఎరువుల కొరత, ధరల పెరుగుదలపై దుష్ప్రచారం సరికాదు : వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఖరీఫ్ సాగు ఊపందుకుంది. సాగు లక్ష్యంలో ఇప్పటికే 68 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. ఈ దశలోనే ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీంతో.. గతంలో ఎన్నడూలేని విధంగా డిమాండ్‌కు మించి ఎరువుల నిల్వలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచడమే కాకుండా ఆర్బీకేల ద్వారా పంపిణీ చేస్తోంది. కృత్రిమ కొరత సృష్టించాలని ప్రయత్నిస్తే సహించే ప్రశ్నేలేదని హెచ్చరించింది. కృత్రిమ కొరతను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. విస్తృత తనిఖీలు చేస్తోంది. ఆర్బీకే లేదా టోల్ ఫ్రీ నెం.155251కు ఫోన్‌చేస్తే డీలర్ల భరతం పడతామని ప్రభుత్వం భరోసా ఇస్తోంది.

రాష్ట్రంలో 7.70 లక్షల టన్నుల నిల్వలు

ఖరీఫ్ సీజన్‌కు రాష్ట్రవ్యాప్తంగా 19.02 లక్షల టన్నుల ఎరువులు అవసరం. రబీలో మిగిలిన ఎరువులు, ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు కేంద్రం కేటాయించిన ఎరువులతో కలిపి మొత్తం 16.24 లక్షల టన్నులు అందుబాటులో ఉంచారు. వీటిలో ఇప్పటి వరకు 8.54 లక్షల టన్నుల అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం 7.70 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 3.44 లక్షల టన్నుల యూరియా, 2.83 లక్షల టన్నుల కాంప్లెక్స్, 65,265 టన్నుల డీఏపీ, 40,688 టన్నుల

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా

కర్తవ్య దీక్షే జీవన సూత్రం

సీఎం వైఎస్ జగన్ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: కర్తవ్య దీక్షను జీవన సూత్రంగా తెలిపిన గీతాచార్యుడు శ్రీకృష్ణుడు అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రేమ, స్నేహం, ధర్మాచరణ ఆయన బోధించిన పాఠాలని చెప్పారు. రాష్ట్ర ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు అంటూ శుక్రవారం ఆయన ట్వీట్ చేశారు.

మండలిలో ఇద్దరు విప్‌ల నియామకం



జంగా కృష్ణమూర్తి, డొక్కా మాణిక్య వరప్రసాద్

సాక్షి, అమరావతి: శాసన మండలిలో ఇద్దరు విప్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మండలిలో ప్రభుత్వ విప్‌లుగా ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను నియమిస్తూ సాధారణ పరిపాలన (రాజకీయ) శాఖ ముఖ్యకార్యదర్శి ముత్యాల రాజు ఉత్తర్వులిచ్చారు. ఈ నియామకాలు వెంటనే అమల్లోకి వచ్చాయని స్పష్టం చేశారు.

తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్తగా డొక్కా


సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యుడు డొక్కా మాణిక్య వరప్రసాదరావును తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్తగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

23న కృష్ణా బోర్డు ఆర్ఎంసీ భేటీ

సాక్షి, అమరావతి: కృష్ణా నదీ జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య తరచుగా వివాదానికి కారణమవుతోన్న అంశాలను పరిష్కరించడానికి విధి విధానాలను రూపొందించడానికి కృష్ణా బోర్డు చైర్మన్ ఎంపీ సింగ్ ఏర్పాటు చేసిన ఆర్ఎంసీ (రిజర్వాయర్స్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఈ నెల 23న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో సమావేశమవుతోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో ఏ ప్రాజెక్టుకు ఎప్పుడు నీటిని విడుదల చేయాలనే అంశంపై నియమావళి (రూల్ కర్వ్), విద్యుదుత్పత్తి, వరద జలాల మళ్లింపుపై విధి విధానాలను రూపొందించి ముసాయిదా నివేదిక ఇవ్వడానికి ఏర్పాటు చేసిన ఆర్ఎంసీ ఇప్పటికే నాలుగు సార్లు సమావేశమైంది. ఈనెల 23న ఐదో సారి సమావేశమవుతోంది. ఈ సమావేశంలో ముసాయిదా నివేదికను ఖరారు చేసి.. కృష్ణా బోర్డుకు పంపనుంది. బోర్డు ఆమోద ముద్ర వేశాక.. ఆ నివేదిక మేరకు ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లను బోర్డు నిర్వహించనుంది. ఇక 2022–23 సంవత్సరంలో కృష్ణా జలాల లభ్యత, వాటాలు, వినియోగంపై చర్చించడానికి బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే అధ్యక్షతన ఈనెల 23న మధ్యాహ్నం 3.30 గంటలకు త్రిసభ్య కమిటీ సమావేశమవుతోంది. ఈ సమావేశాలకు హాజరు కావాలని రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు కృష్ణా బోర్డు శుక్రవారం లేఖలు రాసింది.

తీరం దాటిన వాయుగుండం

- బాలాసోర్, సాగర్ ఐలండ్‌ల నడుమ తీరాన్ని దాటి ఛత్తీస్‌గఢ్ వైపు పయనం
- పలు ప్రాంతాల్లో నేడు, రేపు వర్షాలు



తీవ్ర వాయుగుండం ఉపగ్రహ ఛాయా చిత్రం

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శుక్రవారం మధ్యాహ్నానికి తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇది వాయవ్య దిశగా పయనించి ఒడిశా – పశ్చిమ బెంగాల్ మధ్య బాలాసోర్, సాగర్ ఐలండ్‌ల నడుమ దిఘాకు సమీపంలో శుక్రవారం రాత్రి 8 గంటలకు తీరాన్ని దాటింది. అనంతరం పశ్చిమ వాయవ్య దిశలో కదులుతూ ఒడిశా, జార్ఖండ్ మీదుగా ఛత్తీస్‌గఢ్ వైపు పయనిస్తోందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. శనివారంనాటికి క్రమంగా బలహీన పడుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో ఉత్తర కోస్తాలో కొన్ని చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. మరోవైపు తీరం వెంబడి గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. సముద్రం అలజడిగా ఉన్నందున శనివారం మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం సూచించింది.

వీకెండ్ ఎంజాయ్



దేశంలో పెరిగిన వారాంతపు పర్యటనలు

- రానున్న 12 నెలల్లో 86 శాతం మంది టూర్ షెడ్యూల్ ఖరారు
- 78% మంది ఒత్తిడి నుంచి ఉపశమనం కోసమే పర్యటనలకు...
- ఆసియన్ పసిఫిక్ ట్రావెల్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో వారాంతపు పర్యాటకం విస్తరిస్తోంది. ఉద్యోగులు, వ్యాపారులు నెలల ముందుగానే వారాంతపు సెలవులను ఆస్వాదించేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. సుమారు 86 శాతం మంది భారతీయులు రానున్న 12 నెలల్లో కచ్చితంగా ఏదో ఒక పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని ఆసియన్ పసిఫిక్ ట్రావెల్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్ నివేదిక వెల్లడించింది. ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు 78 శాతం మంది ప్రయాణాలకు మొగ్గు చూపుతున్నట్టు పేర్కొంది.

పర్యాటక పండుగ సీజన్ మొదలు..

ఈ నెలలో వారాంతపు సెలవులు ఎక్కువగా రావడంతో పర్యాటక పండుగ సీజన్ ప్రారంభమైందని టూర్ ఆపరేటర్లు చెబుతున్నారు. ఈ నెల నుంచే వీకెండ్ ప్రయాణాలు ఊపందుకున్నాయి. దీంతో ట్రావెల్ బుకింగ్ సంస్థలు గెట్ అవే డీల్స్‌ను అందిస్తున్నాయి. తదుపరి ట్రిప్‌లో దాదాపు 10 శాతం పైనే రాయితీలను ప్రకటిస్తున్నాయి. మరోవైపు వారాంతపు సెలవుల్లో హోటళ్లు, రిసార్టులు దాదాపు నిండిపోవడంతో పర్యాటకులు హాస్టళ్లు, హోం స్టేలను ప్రత్యామ్నాయంగా తమ జాబితాలో చేర్చుకుంటున్నారు.

ప్రదేశాల ఎంపికకు ప్రాధాన్యం..

పర్యాటకులు గమ్యస్థానాల ఎంపికకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు వంటి మెట్రో నగరాలతోపాటు మహారాష్ట్రలోని లోనావాలా, పూణే, కొచ్చి ప్రాంతాలను విశ్రాంత విడిది కేంద్రాలుగా ఇష్టపడుతున్నారు. తిరుపతి, షిర్డీ, రిషికేశ్, వారణాసికి ఆధ్యాత్మిక యాత్రలు చేస్తున్నారు. భారతీయ సంస్కృతిని పరిచయం చేసుకునేలా జయపూర్, ఉదయపూర్, ఆగ్రా చుట్టి వస్తున్నారు. పుదుచ్చేరి, గోవా బీచ్‌లు, ఊటీ, మున్నార్, కొడైకెనాల్ వంటి హిల్‌స్టేషన్లు పాశ్చాత్య అనుభవాలను అందిస్తుండటంతో యువత ఎక్కువగా అటువైపు క్యూ కడుతున్నారు. మరోవైపు అంతర్జాతీయ పర్యటనల్లో భారతీయ ప్రయాణికులు ఎక్కువగా యూకే, యూఎస్ఏ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, మలేషియాతో పాటు తక్కువ సమయంలో వెళ్లి వచ్చేలా థాయ్‌లాండ్, ఇండోనేషియా, టర్కీ, వియత్నాం, యూఏఈలను ఎంపిక చేసుకుంటున్నారు.

రోప్‌వేలతో పర్యాటకానికి కొత్త కళ

- రాష్ట్రంలో కొత్తగా రెండు చోట్ల రోప్‌వేలు
- విజయవాడ కనకదుర్గ ఆలయం, శ్రీశైలం వద్ద ఏర్పాటు
- మరికొన్ని ప్రాంతాలకూ డీపీఆర్‌లు
- ఎన్‌హెచ్ఏఐకు చెందిన నోడల్ ఏజెన్సీతో ఏపీటీడీసీ ఒప్పందం



అవగాహన ఒప్పందం కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ సీఈవో ప్రకాశ్‌గౌర్, ఏపీటీడీసీ ఎండీ కె.కన్నబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రోప్‌వే ప్రాజెక్టులతో పర్యాటక రంగం ప్రత్యేకతను సంతరించుకుంటుందని ఏపీటీఏ సీఈవో, ఏపీటీడీసీ ఎండీ కె.కన్నబాబు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పర్వతమాల పథకం కింద నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఆధ్వర్యంలో రోప్‌వేల నిర్మాణం చేపడుతుందన్నారు. రాష్ట్రంలో రోప్‌వేల అభివృద్ధిపై ఎన్‌హెచ్ఏఐ నోడల్ ఏజెన్సీ నేషనల్ హైవేస్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎల్ఎంఎల్)తో ఏపీటీడీసీ శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి 26 ప్రతిపాదనలు పంపగా తొలి విడత విజయవాడ కనకదుర్గ దేవాలయం (పాద కొండ నుంచి ఆలయ ప్రాంగణం వరకు), తెలంగాణలోని ఈగలపెంట నుంచి కృష్ణా నది మీదుగా శ్రీశైలం వరకు రోప్‌వేల నిర్మాణానికి అనుమతులు లభించాయని చెప్పారు. గండికోట, శ్రీకాళహస్తి, కటికి జలపాతం, లంబసింగి, అన్నవరం, గగన్ మహల్ నుంచి పెనుకొండ కోట వరకు రోప్‌వేల ఏర్పాటుకు డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ సీఈవో ప్రకాశ్‌గౌర్, ఏపీటీడీసీ ఈడీ మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక వడ్డీ ఇచ్చే షెడ్యూల్డ్ బ్యాంకుల్లోనే డిపాజిట్

- దేవుడి సొమ్ముపై ప్రభుత్వం ఆదేశాలు
- స్వల్పకాలానికి డిపాజిట్లు చేయాలని సూచన
- మొత్తం 3,633 ఆలయాలకు రూ. 3,222.70 కోట్లు డిపాజిట్లు
- అత్యధికంగా దుర్గగుడి పేరిట రూ. 276 కోట్లు
- 256 ఆలయాలకు రూ. కోటి, ఆపైన డిపాజిట్లు

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలో వివిధ ఆలయాల పేరిట ఉండే మిగులు నిధులను షెడ్యూల్డ్ బ్యాంకుల్లోనే డిపాజిట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అత్యధిక వడ్డీ ఇచ్చే బ్యాంకులలోనే స్వల్పకాలానికి డిపాజిట్ చేయాలని ఆదేశించింది. కొత్తగా చేసే డిపాజిట్లు, పాత వాటిని తిరిగి డిపాజిట్ చేసే సమయంలో క్రిసిల్, ఫిక్కీ, ఐసీఆర్ఏ వంటి దిగ్గజ ఆర్థిక సంస్థల ద్వారా 'ఏఏఏ' లేదా 'ఏఏ' రేటింగ్ పొందిన షెడ్యూల్డ్ బ్యాంకుల్లో ఏవి అత్యధిక వడ్డీ ఇస్తాయో ఆన్‌లైన్ ద్వారా ఈ–కొటేషన్‌లు తీసుకోవాలని సూచించింది. అతి తక్కువ వ్యవధికి అత్యధిక వడ్డీ ఇవ్వడానికి ముందుకొచ్చే బ్యాంకుల్లోనే ఆ డబ్బు డిపాజిట్ చేయాలని సూచించింది. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రతి వంద గుళ్లలో ఏడింటిలోనే మిగులు నిధులు

దేవదాయ శాఖ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా చిన్నా పెద్దా అన్నీ కలిపి 24,699 ఆలయాలు, సత్రాలు, మఠాలు ఉన్నాయి. వీటిలో 5,365 ఆలయాలు ఈవోల ఆధ్వర్యంలో, మిగిలినవి స్థానిక పూజారుల పర్యవేక్షణలో ఉన్నాయి. 3,633 ఆలయాలు, సత్రాలు, మఠాలు పేరిట మాత్రమే మొత్తం రూ. 3,222.70 కోట్లు మిగులు నిధులు ఉన్నాయి. అంటే ఏడు శాతం ఆలయాలకే మిగులు నిధులు ఉన్నాయి. అత్యధికంగా విజయవాడ దుర్గ గుడి పేరిట రూ.276.73 కోట్లు ఉన్నాయి. రెండో స్థానంలో శ్రీకాళహస్తి ఆలయానికి రూ. 266.60 కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. అత్యల్పంగా తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామంలోని శ్రీమల్లేశ్వరస్వామి ఆలయం పేరిట బ్యాంకులో 458 రూపాయలు ఉన్నాయి. వంద కోట్లకు పైబడిన డిపాజిట్లు ఉన్న ఆలయాలు, సత్రాలు 7 ఉన్నాయి. రూ.10 కోట్లకు పైగా నిధులు ఉన్నవి 41 ఆలయాలు ఉన్నట్టు దేవదాయ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రూ. కోటికి పైబడి 256 ఉండగా, రూ.లక్షకు పైబడి 2,873 ఆలయాలు, సత్రాలు ఉన్నాయి. ఈ నిధులను అత్యధిక వడ్డీ ఇచ్చే షెడ్యూల్డ్ బ్యాంకులలో మాత్రమే డిపాజిట్లు చేయాలని దేవదాయ శాఖ ఈవోలను ఆదేశించింది.

ఎరువులు పుష్కలం

▶ మొదటి పేజీ తరువాయి

ఎంఓపీ, 37,268 టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువుల నిల్వలున్నాయి. ఆగస్టు నెలకు అవసరమైన ఎరువులు 6.11లక్షల టన్నులు. ఈ మొత్తం కేంద్ర కేటాయింపుల ద్వారా రావాల్సి ఉంది. మరోవైపు.. ఆర్బీకేల్లో 1.69 లక్షల టన్నులు నిల్వచేయగా, 94,676 టన్నుల అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం 74,373 టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నాయి.

సమృద్ధిగా డీఏపీ ఎరువులు

ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా వినియోగించే డీఏపీ ఎరువులు సమృద్ధిగా ఉన్నాయి. ఖరీఫ్–2021లో 1.26 లక్షల టన్నుల డీఏపీ వినియోగించగా, ప్రస్తుత సీజన్‌కు 2.25 లక్షల టన్నులను కేంద్రం కేటాయించింది. ఇప్పటివరకు 1.90 లక్షల టన్నులను అందుబాటులో ఉంచగా, 1.25 లక్షల టన్నుల అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం 65,265 టన్నుల డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఆర్బీకేల్లో కూడా 36,474 టన్నుల డీఏపీ ఎరువులు అందుబాటులో ఉంచగా, ఇప్పటివరకు 19 వేల టన్నుల విక్రయాలు జరిగాయి. ప్రస్తుతం 17,465 టన్నులు అందుబాటులో ఉన్నాయి.

కృత్రిమ కొరత సృష్టిస్తే కొరడా

ఇక గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది డీఏపీ, ఎస్ఎస్‌పీ మినహా మిగిలిన ఎరువుల ధరల్లో ఎలాంటి మార్పులేదు. పోషక ఆధారిత రాయితీ, అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ముడిసరుకుల ధరల కారణంగా బస్తా డీఏపీకి రూ.150లు, ఎస్ఎస్‌పీపై రూ.125లు మేర కంపెనీలు పెంచాయి. వీటి ధరల నిర్ణయంలో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏమాత్రం ఉండదు. మరోవైపు..



భవిష్యత్‌లో ఎరువుల ధరలు పెరుగుతాయనే ఆలోచనతో కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎరువుల సరఫరా, పంపిణీని పర్యవేక్షించేందుకు ప్రతీ జిల్లాకు ఓ సీనియర్ అధికారికి బాధ్యతలను అప్పగించింది. జిల్లా స్థాయిలో తనిఖీ బృందాలను ఏర్పాటుచేసింది. ఎరువుల దుకాణాలతో పాటు స్టాక్ పాయింట్లను విస్తృతంగా తనిఖీచేస్తోంది.

అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలు.. (టన్నుల్లో)

ఎరువు	ఆగస్టు నెల డిమాండ్	అందుబాటులో ఉన్న ఎరువులు	ఆగస్టుకు రావాల్సిన కేటాయింపులు
యూరియా	2,53,696	3,43,970	2,53,700
డీఏపీ	81,374	65,265	81,370
ఎంఓపీ	34,023	40,688	34,020
ఎస్ఎస్‌పీ	25,548	37,268	25,548
కాంప్లెక్స్	2,16,658	2,82,815	2,16,660

ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు



ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. డిమాండ్‌కు మించి ఎరువులు అందుబాటులో ఉంచాం. ఏ ఒక్కరూ ఎమ్మార్పీకి మించి చెల్లించొద్దు. విధిగా రశీదు తీసుకోండి. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే సమీప ఆర్బీకే లేదా స్థానిక వ్యవసాయాధికారికి సమాచారమివ్వండి. లేదంటే టోల్ ఫ్రీ నెం.155251కు ఫిర్యాదు చేయండి. వారి లైసెన్సులు రద్దుచేయడమే కాక.. క్రిమినల్ కేసులూ పెడతాం. ఇక ఎరువుల కొరత, ధరల పెరుగుదలపై దుష్ప్రచారం సరికాదు. – చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

గ్రామ, వార్డు సచివాలయాలకు.. రూ.3,000 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

నోడల్ అధికారులకు తెలియజేయాలి. గ్రామ, వార్డు సచివాలయాల సందర్శనలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు మండల, మున్సిపల్ స్థాయి అధికారులు పాల్గొనాలి.

- సచివాలయ సందర్శన రెండు రోజుల్లో ఎమ్మెల్యేతో కూడిన అధికారుల బృందం అత్యధిక ప్రభావం చూపే పనులను గుర్తించాలి. ప్రజల వినతుల ఆధారంగా లేదా స్థానిక ప్రజల అవసరాల ఆధారంగా అత్యధిక ప్రభావం చూపే పనులు గుర్తించాలి. పారిశుద్ధ్యం, నిర్వహణ, మరమ్మతులు వంటి సాధారణ పనులను సంబంధిత సచివాలయాలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలి. ఆస్తుల కల్పనకు సంబంధించి గుర్తించిన అత్యధిక ప్రభావం చూపే పనులను నోడల్ బృందం తనిఖీ చేయాలి.
- రెండో రోజు పర్యటన ముగిసేలోగా అత్యధిక ప్రభావం చూపే ఏ పనులు చేపట్టాలో ఖరారు చేయాలి. నోడల్ అధికారి మిగతా సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి రూ.20 లక్షల లోపు పనులను ఖరారు చేయడంతో పాటు తీర్మానం చేయాలి. నోడల్ అధికారి ఆ పనులకు ఏజెన్సీని కూడా గుర్తించి లైన్ ఎస్టిమేట్స్ కూడా పూర్తి చేయాలి.
- ఖరారు చేసిన పనుల జాబితాను గడప గడపకు మన ప్రభుత్వం పోర్టల్‌లో నోడల్ అధికారి అప్‌లోడ్ చేయాలి. పనులకు సంబంధించిన తీర్మానం, లైన్ ఎస్టిమేట్ డాక్యుమెంట్‌తో పాటు సమస్య ఫొటోను నిర్దిష్ట ఫార్మాట్‌లో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. పనుల పురోగతిని కూడా ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ ఉండాలి. మొత్తం ఈ పనుల ప్రక్రియను, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పర్యవేక్షిస్తుంది.

చేపట్టాల్సిన పనులు ఇలా..

- **తాగునీటి సరఫరా పనులు :** తాగునీటి సరఫరా ప్రాజెక్టుల నిర్మాణం, నిర్మాణాల స్థాయి పెంపు, తాగు నీటి సరఫరా పైపు లైన్లు, ట్యాంక్‌లు.
- **రహదారుల పనులు:** సిమెంట్ కాంక్రీట్ రహదారుల నిర్మాణం, సిమెంట్ కాంక్రీట్ రహదారుల స్థాయి పెంపు, తారు రోడ్ల నిర్మాణం, తారు రోడ్ల స్థాయి పెంపు.
- **డ్రైన్స్:** ఓపెన్ డ్రైనేజీ నిర్మాణం, వరద నీటి డ్రైన్స్ నిర్మాణం.
- **విద్యుత్:** కొత్త ఎలక్ట్రికల్ లైన్, పోల్, కమ్యూనిటీకి అవసరమైన కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్.
- **కల్వర్టులు:** కల్వర్టుల నిర్మాణం, కమ్యూనిటీ కోసం డ్రైనేజీలను దాటే నిర్మాణాలు.
- **ఇతర సివిల్ పనులు:** కమ్యూనిటీ షెల్టర్ భవనాలు, కమ్యూనిటీ భవనాలకు ప్రహరీ గోడల నిర్మాణం, కమ్యూనిటీకి సంబంధించి వరద నివారణ, రిటైనింగ్ వాల్ నిర్మాణాలు.

మూడు కేటగిరీలుగా సమస్యల పరిష్కారం



మంత్రులు, ఎమ్మెల్యేల గ్రామ, వార్డు సచివాలయాల సందర్శన సందర్భంగా ప్రజల నుంచి వచ్చే వినతులను మూడు కేటగిరీలుగా.. పథకాలకు సంబంధించి, పథకేతరాలకు సంబంధించి, అత్యధిక ప్రభావం చూపే పనులుగా వర్గీకరించాం. వాటిని సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిధుల సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. – అజయ్ జైన్, ప్రత్యేక సీఎస్, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ

3,055 గ్రామ, వార్డు సచివాలయాల సందర్శన

ఈ ఏడాది మే 11వ తేదీన ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 175 నియోజకవర్గాల్లోని 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్శనలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం వారికి అందించిన పథకాల వివరాలను వివరించడంతో పాటు ఏమైనా సమస్యలుంటే అడిగి తెలుసుకుంటున్నారు. ఇలా ఈ నెల 18వ తేదీ వరకు మంత్రులు, ఎమ్మెల్యేలు 3,055 గ్రామ, వార్డు సచివాలయాల సందర్శన పూర్తి చేశారు. ఇప్పటి వరకు అత్యధిక ప్రభావం చూపే 4,174 పనులను గుర్తించారు.

సీఎం జగన్‌ను ఘనంగా సన్మానిస్తాం

- సెప్టెంబరు చివరలో లేదా అక్టోబరులో సచివాలయ ఉద్యోగులతో భారీ సభ
- అధికారంలోకి వచ్చిన వెంటనే 1.34 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన సీఎం జగన్
- జూన్ 30 నాటికే అర్హత ఉన్న ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేశారు
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి



సాక్షి, అమరావతి: సెప్టెంబర్ చివర లేదా అక్టోబర్‌లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు విజయవాడలో భారీ సభ నిర్వహించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఘనంగా సన్మానించాలని నిర్ణయించినట్టు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి చెప్పారు. శుక్రవారం విజయవాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేయడం, నాలుగు నెలల్లో 1.34 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను మంజూరు చేయడంతో పాటు వాటిని భర్తీ కూడా చేశారని చెప్పారు. అప్పట్లో ఉద్యోగాలు పొందిన వారిలో అర్హులైన ఉద్యోగులందరి సర్వీసును ఈ ఏడాది జూన్ 30 నాటికి పర్మినెంట్ కూడా చేశారని వివరించారు. తాజాగా సచివాలయాల ఉద్యోగుల బదిలీల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు సీఎం జగన్‌కి మానస పుత్రిక లాంటివని, ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందిస్తున్నారని చెప్పారు. మనందరికీ మంచి చేసే ప్రభుత్వం ఉందని, ఇలాంటి ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు అందరం సక్రమంగా పని చేద్దామన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వంపై కొన్ని మీడియా సంస్థలు అదే పనిగా బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని వెంకట్రామిరెడ్డి తప్పుపట్టారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కొన్ని వ్యవస్థలు సైతం కంట్రోల్ చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. గతంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ హోదాలో నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఎలా వ్యవహరించారో చూశామన్నారు. కడపలో సచివాలయ ఉద్యోగిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజన్‌రెడ్డి కోరారు. సచివాలయాల ఉద్యగులను ప్రభుత్వం పర్మినెంట్ చేయదని కొందరు చేసిన తప్పుడు ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ సీఎం అందరినీ పర్మినెంట్ చేశారని సంఘం ప్రధాన కార్యదర్శి బి.అంకమరావు చెప్పారు. ఉద్యోగులతో మంచిగా ఉండే సీఎం ఉండటం మన అదృష్టమని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఆర్ఆర్ కిషోర్ భార్గవ్ సుతేజ్, వివర్తి నిఖిల్‌కృష్ణ, సుధాకర్, రామకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

పొరబడిన 'ప్రాప్తి'

▶ మొదటి పేజీ తరువాయి


బకాయిదారుల జాబితాలో చేర్చటాన్ని రాష్ట్ర ఇంధన శాఖ కేంద్రం దృష్టికి తెచ్చింది. దీంతో పొరపాటును గుర్తించిన కేంద్రం నిషేధిత రాష్ట్రాల జాబితా నుంచి ఏపీని తొలగిస్తూ విద్యుత్ కొనుగోళ్లు, విక్రయాలను యథావిధిగా నిర్వహించేందుకు అనుమతించాలని ఐఈఎక్స్‌ను ఆదేశించింది.

తొలి వాయిదా చెల్లించాం.. రెండో దానికి టైముంది

కేంద్ర విద్యుత్ శాఖ ఈ ఏడాది జూన్ 3న లేట్ పేమెంట్ సర్‌చార్జ్ (ఎల్‌పీఎస్) స్కీం కింద బకాయిల వసూలుకు సర్‌చార్జ్ రూల్స్ 2022 రూపొందించింది. విద్యుత్ ఉత్పాదక సంస్థలు, ఇంటర్–స్టేట్ ట్రాన్స్ మిషన్ లైసెన్సీలు, ఎలక్ట్రిసిటీ ట్రేడింగ్ లైసెన్సీల బకాయిలకు ఈ నియమాలు వర్తిస్తాయి. వీటి ప్రకారం ఉత్పత్తి సంస్థల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌కు సంబంధించిన బిల్లులను 45 రోజుల్లోగా డిస్కమ్‌లు చెల్లించాలి. లేదంటే విద్యుత్ క్రయ విక్రయాలపై నిషేధం విధిస్తారు. ఈ నేపథ్యంలో ఎల్‌పీఎస్ పథకం కింద మే 30 వరకు బకాయిలన్నీ ఏపీ డిస్కమ్‌లు చెల్లిస్తున్నాయి. పథకం పరిధిలోకి వచ్చిన బకాయిలు రూ.17,074.90 కోట్లు కాగా ఈ మొత్తాన్నీ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)ల ద్వారా 12 వాయిదాలలో చెల్లించేందుకు ఏపీ అంగీకరించింది. మొదటి విడతగా ఈ నెల 5న రూ.1,407 కోట్లను చెల్లించింది. రెండో విడత వాయిదా చెల్లించేందుకు సెప్టెంబర్ 5 వరకు గడువు ఉంది.

నిరంతరాయంగా సరఫరా..

నిషేధం విధించే సమయానికి రాష్ట్రంలో డిమాండ్ 211.22 మిలియన్ యూనిట్లు ఉండగా ఆ మేరకు సరిపడా విద్యుత్‌ను ఎటువంటి అంతరాయాలు లేకుండా వినియోగదారులకు అందించారు. ఏపీ జెన్‌కో థర్మల్ నుంచి 55.94 మిలియన్ యూనిట్లు, ఏపీ జెన్‌కో హైడల్ నుంచి 23.46 మి.యూ, సెంట్రల్ గ్యాస్ స్టేషన్ల నుంచి 44.07 మి.యూ, ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ నుంచి 21.20 మి.యూ, పవన విద్యుత్ 31.87 మి.యూ, సౌర విద్యుత్ 22.27 మిలియన్ యూనిట్లు చొప్పున సమకూరగా ఎనర్జీ ఎక్స్ఛేంజ్ ద్వారా 11.96 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను యూనిట్‌కు రూ.7.69 చొప్పున చెల్లించి రూ.9.52 కోట్లతో కొనుగోలు చేశారు. మన రాష్ట్రం నుంచి ఎక్స్ఛేంజ్‌లో 0.41 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను విక్రయించారు. శుక్రవారం 208 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందని అంచనా వేసి ఆ మేరకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఇంధన శాఖ వెల్లడించింది. బిహార్‌లో 6.18 మి.యూ, ఉత్తర్‌ప్రదేశ్‌లో 3.49 మి.యూ, జార్ఖండ్‌లో 2.06 మి.యూ, మధ్యప్రదేశ్‌లో 1.39 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత ఏర్పడినప్పటికీ మన రాష్ట్రంలో ఎలాంటి లోటు లేకుండా విద్యుత్ సరఫరా చేసినట్లు తెలిపింది.



ప్రాప్తి వెబ్ పోర్టల్

యథావిధిగా ట్రేడింగ్



ఏపీ డిస్కమ్‌లు విద్యుదుత్పత్తి దారులకు రూ.412.69 కోట్లు బకాయి ఉన్నట్లు ప్రాప్తి పోర్టల్‌లో పొరపాటుగా చూపడం వల్ల ఆ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ విద్యుత్ మార్కెట్లకు స్వల్పకాలిక అనుమతిని నియంత్రించింది. వాస్తవానికి ఈ బకాయిలను ఏపీ డిస్కమ్‌లు ఇప్పటికే చెల్లించాయి. ఈ విషయాన్ని ప్రాప్తి పోర్టల్ దృష్టికి తెచ్చాం. అంతేకాకుండా కొన్ని బకాయిలు ఎల్‌పీఎస్ పథకం కింద ఇప్పటికే చెల్లించేశాం. అయినప్పటికీ బకాయిలున్నట్లు చూపడంపై పోర్టల్ అధికారులకు సమాచారం అందించాం. దీంతో యాక్సెస్ పరిమితిని తొలగించారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఏపీ డిస్కమ్‌లు ఎనర్జీ ఎక్స్ఛేంజీలో ట్రేడింగ్ కార్యకలాపాలను యథావిధిగా కొనసాగిస్తున్నాయి. –కె.విజయానంద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

సెప్టెంబర్ నుంచి స్కిల్ హబ్స్

సాక్షి, అమరావతి: నైపుణ్య శిక్షణ ద్వారా పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను అందించడం, స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్కిల్ హబ్స్ వచ్చే నెలలో అందుబాటులోకి రానున్నాయి. రూ. 21 కోట్ల వ్యయంతో 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో తొలి దశలో 66 కేంద్రాల నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. వీటిని సెప్టెంబర్ రెండో వారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి రంగం సిద్ధం చేసినట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో ఎం.సత్యనారాయణ చెప్పారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ కళాశాలల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాల కోసం ప్రత్యేకంగా తరగతి గదులు, ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే స్కిల్ ఇండియా రిజిస్ట్రేషన్, శిక్షకులు, కోర్సులు, ల్యాబ్‌లు, విద్యార్థుల ఎంపిక వంటివి దాదాపు పూర్తయినట్లు తెలిపారు. డిసెంబర్ నాటికి మిగిలిన 109 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్స్‌ను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో స్కిల్ హబ్స్ అందుబాటులోకి వస్తే ఏటా 42,000 మందికి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఏడాదికి కనీసం రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు.

క్లుప్తంగా

తాటిచెర్ల-జంగాలపల్లి డబ్లింగ్ పనులు పూర్తి

గుత్తి-ధర్మవరం ప్రాజెక్టులో కీలక పురోగతి

సాక్షి, అమరావతి : ధర్మవరం-గుత్తి లైన్ డబ్లింగ్, విద్యుద్దీకరణ ప్రాజెక్టులో దక్షిణ మధ్య రైల్వే కీలక పురోగతి సాధించింది. ఈ మార్గంలో కీలకమైన తాటిచెర్ల-జంగాలపల్లి డబ్లింగ్- విద్యుద్దీకరణ పనులను తాజాగా పూర్తి చేసింది. 18.8 కి.మీ. మేర ఈ పనులు పూర్తి కావడంతో ఈ మార్గంలో గంటకు 110 కిలో మీటర్ల వేగంతో రైళ్లు నడిపేందుకు మార్గం సుగమమైంది. తెలుగు రాష్ట్రాలను కర్ణాటకతో అనుసంధానించే గుత్తి-ధర్మవరం డబ్లింగ్, విద్యుద్దీకరణ ప్రాజెక్టు అత్యంత ప్రధానమైంది. మొత్తం 90 కి.మీ. ఈ ప్రాజెక్టును రూ.636.38 కోట్లతో రైల్ ఇండియా టెక్నికల్, ఎకనామిక్ సర్వీస్ చేపట్టింది. ప్రస్తుతం తాటిచెర్ల-జంగాలపల్లి మార్గంతో కలిపి ఇప్పటి వరకు మొత్తం మీద 79 కి.మీ. డబ్లింగ్-విద్యుద్దీకరణ ప్రాజెక్టు పూర్తి చేశారు. దాంతో చిగిచెర్ల నుంచి గుత్తి వరకు 79 కి.మీ. మేర డబ్లింగ్ లైనులో రైళ్లు నిర్వహించేందుకు అవకాశం కలిగింది. మిగిలిన 11 కి.మీ. పనులను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే భావిస్తోంది. మరోవైపు ధర్మవరం-బెంగళూరు డబ్లింగ్-విద్యుద్దీకరణ పనులు వేగం పుంజుకున్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి ధర్మవరం-బెంగళూరు డబ్లింగ్, విద్యుద్దీకరణ ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామని రైల్వే అధికారులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి బెంగళూరుకు రైలు ప్రయాణం మరింత సౌకర్యవంతం కానుండటంతోపాటు ఈ మార్గంలో గూడ్సు రైళ్ల ద్వారా సరుకు రవాణా సులభతరమవుతుందని భావిస్తున్నారు.

రాష్ట్రంలో రౌడీయిజం పరాకాష్టకు చేరింది

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నేతల రౌడీయిజం పరాకాష్టకు చేరిందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే గుదిబండ వెంకటరెడ్డి సోదరుడి కుమారుడు గోవర్ధన్‌రెడ్డి, ఆయన అనుచరులు శుక్రవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. నెల్లూరులో ఇసుక మాఫియాను ప్రశ్నించిన కిషన్ శవమై తేలాడని ఆరోపించారు. ఏలూరు జిల్లాలో ఎంపీటీసీని వేధించి తప్పుడు కేసులు పెడితే సెల్ఫీ వీడియో తీసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడన్నారు. పల్నాడులో ముగ్గురాయి వ్యాపారం కోసం వైఎస్సార్‌సీపీ నేతలు బహిరంగంగా ఘర్షణలకు దిగారని అన్నారు. ఉయ్యూరులో జెడ్పీటీసీ పూర్ణిమ గౌరవప్రద మహిళగా ఉండలేనంటూ పదవికి రాజీనామా చేశారని చెప్పారు. అనంతపురంలో ద్రాక్ష తోటలో పనిచేసేందుకు వచ్చిన ముగ్గురు కూలీలు ప్రభుత్వ మద్యం దుకాణంలో కొన్న నాసిరకం మద్యం తాగి మరణించారన్నారు. మరో వైపు ఎంపీ గోరంట్ల మాధవ్ వివాదానికి కులం రంగు పులిమారన్నారు.

పోలవరం ముంపు బాధితుల్ని ఆదుకోవాలి

సీపీఎం డిమాండ్

సాక్షి, అమరావతి : పోలవరం ముంపు బాధితులను తక్షణం ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశాలు విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన తొలిరోజు సమావేశంలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ బేబి హాజరై మాట్లాడారు. పోలవరం ముంపు బాధితుల్ని ఆదుకోవాలని, నిర్వాసితులకు పునరావాసం, ముంపు ప్రాంతాల్లో సహాయం, మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం కోరింది.

'అరకు కాఫీ'కి అవార్డు

జాతీయ సదస్సులో మరోసారి మొదటి బహుమతి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చర్యలతో కాఫీ ప్రాజెక్టుకు మరింత ఊతం



జాతీయ అవార్డును అందుకుంటున్న ట్రైకార్ బృందం

సాక్షి, అమరావతి/పాడేరు : అరకు కాఫీ జాతీయ స్థాయి వేదికపై మరోసారి అదుర్స్ అనిపించింది. ప్రతిష్టాత్మక సదస్సులో ప్రథమ బహుమతిని సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ సాగును ప్రోత్సహిస్తూ చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని చాటింది. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ గుర్తింపు పొందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయో-సోషల్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు కోల్‌కతాలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించింది. 'పర్యావరణాన్ని పరిరక్షిస్తూ జీవనోపాధి పెంపొందించడం-స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని మహిళా సాధికారతకు ఊతమివ్వడం' అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో 14 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని తమ ప్రాంతాల్లో గిరిజనుల ఆర్థికాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, డైరెక్టర్లు పి.చిన్నప్పదొర, ఎం.రామకృష్ణ, ఎస్.ఈశ్వరమ్మ, జనరల్ మేనేజర్ సీఏ మణికుమార్ ఆంధ్రాలో గిరిజనుల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తున్న కాఫీ ప్రాజెక్టుపై సమగ్రంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏజెన్సీ ఏరియాలోని 2,27,021 ఎకరాల్లో కాఫీ పంట సాగు చేస్తున్నారని, ఏటా గిరిజన రైతులకు కచ్చితమైన ఆదాయం లభిస్తోందని, బెంగళూరు మార్కెట్‌లో నాణ్యమైన కాఫీ గింజలుగా ప్రసిద్ధి చెందడం వంటి అంశాలను వివరించారు. దీంతో మన కాఫీ ప్రాజెక్ట్‌కు ప్రథమ స్థానం లభించింది.

ఉన్నతాధికారుల అభినందనలు

జాతీయ స్థాయి అవార్డును సాధించిన ఏపీ ట్రైకార్ బృందానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, సంచాలకులు ఎం.జాహ్నవి, ట్రైకార్ ఎండీ రవీంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ అవార్డు పొందడం ద్వారా జాతీయ స్థాయిలో అరకు కాఫీ మరోసారి గొప్ప గుర్తింపు పొందిందని ట్రైకార్ జీఎం మణికుమార్ తెలిపారు.

అనుకూల వాతావరణం... ప్రభుత్వ సహకారమే కారణం

రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో వాతావరణం, వృక్ష సంపదతో ఏర్పడే సహజసిద్ధమైన నీడ, నేల స్వభావం కాఫీ సాగుకు అత్యంత అనుకూలం. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ-పాడేరు) పరిధిలో 2024-25 నాటికి దశల వారీగా కాఫీ సాగు విస్తరణను పెంచుతూ రూ.526.160 కోట్లతో ప్రత్యేక కాఫీ ప్రాజెక్ట్ అమలుకు శ్రీకారం చుట్టింది. కాఫీ సాగుకు అవసరమైన విత్తనాలు, యంత్రాలు, బోర్ల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, మెయిన్ రోడ్డు నుంచి అంతర్గత అప్రోచ్ రోడ్ల నిర్మాణం, పల్పింగ్ యూనిట్ల ఏర్పాటు, కాఫీ గింజల సేకరణ, మార్కెటింగ్ వంటి చర్యలను చేపట్టింది. ప్రభుత్వ తోడ్పాటు వల్ల అరకు కాఫీకి దేశ విదేశాల్లో గుర్తింపు లభిస్తోంది. యూరప్, పారిస్ సహా అంతర్జాతీయంగా బ్రాండ్ ఇమేజ్ సొంతం చేసుకుంది.

బంజరు భూములు సాగుకు సిద్ధం

- భూములు చదును చేస్తున్న ఏపీ ఆగ్రోస్
- ఈ ఏడాది 5,000 ఎకరాల్లో చదును చేయడం లక్ష్యం

సాక్షి, అమరావతి : ఏపీ ఆగ్రోస్ ఆధ్వర్యంలో అర్బన్ ప్రాంతాల్లో భూమి చదును పనులు కొనసాగుతున్నాయి. పనికిరాని బంజరు భూములను సాగుకు యోగ్యంగా మార్చేందుకు ఏపీ ఆగ్రోస్ కృషి చేస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన భూములను అభివృద్ధి చేయడంతో పాటు వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు వీలుగా పాండ్స్, చేపల చెరువులను తవ్వుతోంది. గడిచిన ఐదేళ్లలో 23,417 ఎకరాల బంజరు భూములను సాగుకు యోగ్యంగా తీర్చిదిద్దింది. ఈ ఏడాది ఐదు వేల ఎకరాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటికే 966 ఎకరాలను అభివృద్ధి చేసింది. ఇందుకోసం 20 భారీ యంత్రాలను సంస్థ వినియోగిస్తోంది. మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలో జగనన్న కాలనీల కోసం కేటాయించిన స్థలాల్లోనూ భూమి చదును పనులను చేపడుతున్నట్టు ఏపీ ఆగ్రోస్ ఎండీ కృష్ణమూర్తి చెప్పారు.

ఏపీకి రుణాలు దొరక్కుండా చూడాలి

టీడీపీ నేత యనమల రామకృష్ణుడు

సాక్షి, అమరావతి : ఏపీ ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో అప్పులు, కార్పొరేట్ రుణాలు సేకరించకుండా కేంద్రం అడ్డుకోవాలని టీడీపీ నాయకుడు యనమల రామకృష్ణుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా దెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక సంక్షోభం, వ్యవస్థల విధ్వంసం కారణంగా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. ఏపీలో ఆర్థిక అత్యవసర పరిస్థితి విధించడం మినహా కేంద్రానికి మరో మార్గం కనిపించడం లేదని తెలిపారు

రాష్ట్రంలో బీజేపీ బలోపేతం

వచ్చే ఎన్నికల్లో జనసేనతో కలిసి పనిచేస్తాం : సోము వీర్రాజు

నందిగామ : రాష్ట్రంలో బీజేపీ రోజురోజుకు బలోపేతమవుతోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో ఆ పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర రాజధానిగా అమరావతికే బీజేపీ కట్టుబడి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేనతో కలిసి పని చేస్తామని చెప్పారు.

గాంధీ తత్వం.. యువతరానికి అవసరం

అప్పుడు, ఇప్పుడు ఆయన ఆలోచనలు అనుసరణీయం

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ
- 'సత్యశోధన మహాత్ముని ఆత్మకథ' పునఃముద్రణ పుస్తకావిష్కరణ
- ఎమ్మెల్యే భూమన అభినందనీయుడని ప్రశంసలు



'సత్యశోధన మహాత్ముని ఆత్మకథ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ, భూమన, ధర్మారెడ్డి



జస్టిస్ ఎన్వీ రమణకు స్వామివారి ప్రసాదం అందిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

తిరుపతి తుడా : మహాత్మా గాంధీజీ తత్వం నేటి యువ తరానికి ఎంతో అవసరం అని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ నూతలపాటి వెంకటరమణ అన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే కాకుండా, వాస్తవానికి ఇప్పుడే ఆయన ఆలోచనలు అనుసరణీయమని వ్యాఖ్యానించారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సొంతంగా పునఃముద్రించిన మహాత్మా గాంధీ స్వయంగా రాసిన ఆత్మకథ 'సత్యశోధన' పుస్తకాన్ని తిరుపతిలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మహాత్మా గాంధీ వారసులుగా మనం గర్వించాలి. చాలా వరకు ఆత్మకథలు వక్రీకరణలు, అతిశయోక్తులతో ఉంటాయి. గాంధీజీ మాత్రం ఉన్నది ఉన్నట్టుగా ఆత్మకథలో రాశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఇది ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం' అని చెప్పారు. ఓ సామాన్యుడు మహాత్మునిగా మారిన ఆదర్శ జీవిత కథే ఈ పుస్తకమని అభిప్రాయపడ్డారు. గాంధీజీ స్వాతంత్ర్యం తేవడమే కాకుండా నైతికతను నేర్పారని అన్నారు. స్వాతంత్ర్యానికి ముందే తిరుపతి పట్టణంలో గాంధీజీ రెండుసార్లు పర్యటించారని గుర్తుచేశారు. ప్రపంచంలో ఎంతో మంది నేతలకు గాంధీజీ అహింస, శాంతి మార్గాలే స్ఫూర్తినిచ్చాయని చెప్పారు.

ఇంకా అనేక విషయాలు వెలుగు చూడాలి

మానవుడు మహాత్మునిగా మారిన గాంధీ చరిత్రను వాస్తవానికి అనుగుణంగా భవిష్యత్ తరాలకు అందించాలనే తపనతో సత్యశోధన పుస్తకాన్ని భూమన కరుణాకరరెడ్డి పునఃముద్రించడం గొప్ప విషయమని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ అభినందించారు. విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులు, ఇతర కారణాలతో నేటి యువతరం గాంధీజీని మరిచిపోయే పరిస్థితి వచ్చిందని, అందుకే గాంధీజీకి సంబంధించిన అనేక అంశాలను ప్రచురించాల్సిన బాధ్యతను కూడా కరుణాకర్‌రెడ్డిపై పెడుతున్నానని చెప్పారు. క్రమశిక్షణ కలిగిన వ్యక్తి, మేధావి అయిన భూమన అధికార పార్టీ ఎమ్మెల్యే అయినప్పటికీ ఏ విషయంలో అయినా తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా, సూటిగా చెబుతారని ప్రశంసించారు. తన వద్దకు పలుమార్లు వచ్చిన భూమన.. సాహిత్యం, భాష, దేశంలోని అనేక సమస్యలు, వాటి పరిష్కారాలు, దేశ ఆర్థిక అంశాల గురించి చర్చించారన్నారు. తనకు ఫేవర్ చేయాలని ఏనాడూ కోరలేదని చెప్పారు. చేసిన తప్పును అందరి సమక్షంలో ఒప్పుకోవడం చిన్న విషయం కాదన్నారు.

గాంధీ జీవితం.. స్ఫూర్తిదాయకం

ఆధ్యాత్మికతను నైతికతతో జయించి, రాజకీయాలు నడిపిన గొప్ప వ్యక్తి గాంధీజీ అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. విప్లవ రాజకీయాల నుంచి వచ్చిన తనకు గాంధీ ఆత్మకథను తొలుత సర్దార్ గౌతు లచ్చన్న అందించారని తెలిపారు. గాంధీ జీవితం నేటి తరానికి మరింత ఎక్కువ అవసరమని, తనకెంతో స్ఫూర్తి నిచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, చిత్తూరు కలెక్టర్ హరినారాయణ్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా, తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, తిరుపతి మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ, పలువురు న్యాయమూర్తులు, తిరుపతి ప్రముఖులు, కవులు, మేధావులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు సీజే

తిరుమల : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కుటుంబ సమేతంగా శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేద ఆశీర్వచనం అనంతరం జస్టిస్ ఎన్వీ రమణ దంపతులకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయన్, టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, సీవీఎస్వో నరసింహ కిషోర్, ఆలయ డిప్యూటీ ఈవో రమేష్ బాబు వారి వెంట ఉన్నారు. అంతకు ముందు ఆలయం ఎదుట టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి జస్టిస్ రమణకు స్వాగతం పలికారు.

నేడు విజయవాడకు సీజేఐ

- పలు కార్యక్రమాల్లో బిజీబిజీగా గడపనున్న సీజేఐ ఎన్వీ రమణ
- విజయవాడ కోర్టు భవన సముదాయానికి ప్రారంభోత్సవం
- ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ స్వీకరణ
- గవర్నర్, సీఎంతో కలిసి ప్రభుత్వ అధికారిక విందుకు హాజరు

సాక్షి, అమరావతి : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ నూతలపాటి వెంకటరమణ శనివారం విజయవాడ రానున్నారు. ఉదయం 6.35 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి 7.40 గంటలకు విజయవాడ చేరుకుంటారు. నగరంలోని జిల్లా కోర్టు భవన సముదాయాన్ని తొమ్మిది గంటలకు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఇతర న్యాయమూర్తులు పాల్గొంటారు. విజయవాడ కోర్టుతో జస్టిస్ ఎన్వీ రమణకు ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడి నుంచే ఆయన తన న్యాయవాద వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. విజయవాడ కోర్టు భవన సముదాయ ప్రారంభోత్సవం అనంతరం 11.30 గంటలకు ఆయన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చేరుకుంటారు. యూనివర్సిటీ ప్రదానం చేసే డాక్టరేట్‌ను అందుకుంటారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ తదితరులు పాల్గొంటారు. ఆ తర్వాత ఆయన గౌరవార్థం రాష్ట్ర ప్రభుత్వం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన అధికారిక విందులో గవర్నర్, ముఖ్యమంత్రితో కలిసి పాల్గొంటారు. అనంతరం హైదరాబాద్ బయలుదేరి వెళతారు.



నేడు ఏఎన్‌యూ స్నాతకోత్సవం

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముస్తాబైంది. నాలుగున్నర దశాబ్దాల ప్రస్థానంలో మరో విజయోత్సవం జరుపుకోనుంది. వర్సిటీలోని డైక్‌మెన్ ఆడిటోరియంలో శనివారం 37, 38 స్నాతకోత్సవాలను నిర్వహించనున్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. గవర్నర్, అతిథుల చేతుల మీదుగా పట్టాలు తీసుకునేందుకు విద్యార్థులు ఉత్సుకతతో నిరీక్షిస్తున్నారు.

లోకజ్ఞానం లేని లోకేశ్

- అవివేకం, అజ్ఞానంతోనే ఆ లేఖ : మంత్రి పెద్దిరెడ్డి
- సచివాలయ వ్యవస్థతో లక్షల మంది యువతకు శాశ్వత ఉద్యోగాలు
- నిబద్ధతతో ఎనర్జీ అసిస్టెంట్స్ అత్యుత్తమ సేవలు



సాక్షి, అమరావతి : ఎనర్జీ అసిస్టెంట్ల విషయంలో రాసిన లేఖ ద్వారా టీడీపీ నేత నారా లోకేశ్ మరోసారి అజ్ఞానాన్ని చాటుకున్నారని రాష్ట్ర ఇంధన, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. లోకేశ్‌కు కనీస లోకజ్ఞానం కూడా లేదనే విషయాన్ని రాష్ట్ర ప్రజలకు మరోసారి చాటి చెప్పారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి లేఖ రాసే సందర్భంలో వాస్తవాలు తెలుసుకోకుండా అవివేకం, అనుభవరాహిత్యం, అజ్ఞానంతో వ్యవహరించారని తెలిపారు.

వృత్తి నైపుణ్యాలపై సమగ్ర శిక్షణ

'సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా పాలనలో విప్లవాత్మక మార్పులకు సీఎం జగన్ నాంది పలికారు. లక్షల మంది యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించి స్ఫూర్తి నింపారు. విద్యుత్ శాఖను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు సచివాలయాల పరిధిలో ఎనర్జీ అసిస్టెంట్ ఉద్యోగాలను భర్తీ చేశారు. విద్యుత్ శాఖలో పని చేస్తున్న రెగ్యులర్ సిబ్బందితో సమానంగా ఎనర్జీ అసిస్టెంట్‌లకు ఆర్‌ఈసీ, ఎన్టీపీసీ లాంటి ప్రఖ్యాత సంస్థల తోడ్పాటుతో వృత్తి నైపుణ్యాలపై సమగ్ర శిక్షణ అందించారు. ఎలాంటి శిక్షణ లేకుండా స్తంభాలు ఎక్కించడం ద్వారా ఎనర్జీ అసిస్టెంట్లను ప్రమాదాల్లోకి నెడుతున్నారంటూ లోకేశ్ లేఖలో పేర్కొనడం ఆయన అజ్ఞానానికి నిదర్శనం.' అని పెద్దిరెడ్డి పేర్కొన్నారు.

జీతం రెట్టింపు

'సచివాలయ ఉద్యోగులందరికీ ప్రభుత్వపరంగా వర్తించే అన్ని నిబంధనలు, సదుపాయాలు ఎనర్జీ అసిస్టెంట్‌లకూ వర్తిస్తున్నాయి. సెలవులు లేకుండా పని చేయాల్సి రావడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారంటూ లోకేశ్ పేర్కొనడం విడ్డూరం. సీఎం జగన్ ఆదేశాల మేరకు ఎనర్జీ అసిస్టెంట్‌లకు కూడా ప్రొబేషనరీ ప్రకటించాం. ప్రొబేషనరీకి ముందు రూ.15 వేల జీతం ఉంటే తరువాత రూ.31 వేలకు పెరిగిన విషయం లోకేశ్‌కు తెలియకపోవడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనం.' అని తెలిపారు.

అండగా ప్రభుత్వం

'బాబు వస్తే... జాబు వస్తుందని నాడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు యువతకు మొండి చేయి చూపారు. సీఎం జగన్ అధికారంలోకి రాగానే అటు సచివాలయాలు, ఇటు ఏపీపీఎస్సీ ద్వారా ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. ఎనర్జీ అసిస్టెంట్లు ప్రతికూల పరిస్థితుల్లోనూ రెగ్యులర్ విద్యుత్ సిబ్బందితో కలసి సేవలు అందిస్తున్నారు. దీనివల్లే రాష్ట్ర విద్యుత్ సంస్థలు వినియోగదారుల సేవా సూచికలో జాతీయ స్థాయిలో ఏ గ్రేడ్ సాధించాయి. విధి నిర్వహణలో ఎనర్జీ అసిస్టెంట్లు ప్రాణాలను కోల్పోతున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదు. తగిన భద్రతా పరికరాలను ఉపయోగించకుండా వ్యక్తిగత అశ్రద్ధ కారణంగా జరిగిన కొన్ని ప్రమాదాలను భూతద్దంలో చూపి విమర్శించటం సరికాదు. ప్రమాదాల బారిన పడితే ఆదుకుంటున్నాం. దురదృష్టవశాత్తూ విలువైన ప్రాణాలు కోల్పోయిన సందర్భాల్లో సిబ్బందికి చెల్లించే అన్ని రకాల పరిహారాలను ఎనర్జీ అసిస్టెంట్‌లకు కూడా అందచేస్తున్నాం.' అని పేర్కొన్నారు.

మనుష్యుడు ఎట్లు చినిగిన వస్త్రములను వదలి నూతన వస్త్రములను ధరించునో, అట్లే ఆత్మ జీర్ణమైన శరీరమును వదలి కొత్త శరీరమును ధరించుచున్నది.
– హైందవ ధర్మం

సాక్షి
శనివారం, ఆగస్టు, 20

క్రీడలపై క్రీనీడ!

క్రీడా మైదానాల్లో సమవుజ్జీలైన రెండు జట్లు నువ్వా నేనా అన్నట్టు తలపడుతూ అభిమానుల్లో ఉత్కంఠ రేపాలి. తమ ప్రతిభా పాటవాలతో స్టేడియంలను హోరెత్తించాలి. కానీ అందుకు భిన్నంగా ఈ ఆటలు నిర్వహించాల్సిన సంఘాల్లోని పెద్దలే ముఠాలు కట్టి పరస్పరం తలపడుతూ, క్రీడలను గాలికొదిలితే దేశం నగుబాటు పాలవుతుంది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య(ఏఐఎఫ్‌ఎఫ్)పై అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య(ఫిఫా) నిషేధాస్త్రం సంధించిన నేపథ్యంలో మన క్రీడా సంఘాల పనితీరు మరోసారి చర్చకొచ్చింది. 2012లో భారత్ ఒలింపిక్ సంఘం(ఐఓఏ) కూడా ఈ మాదిరే వివాదాల్లో చిక్కుకోవడంతో అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం(ఐఓసీ) దాన్ని సస్పెండ్ చేయాల్సివచ్చింది. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్(బీసీసీఐ) వ్యవహారాలు సైతం గతంలో ఇలాగే బజారుకెక్కడంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఒక కమిటీని ఏర్పాటు చేసి ప్రక్షాళనకు పూనుకుంది. అయినా మన క్రీడాసంఘాల్లో చెప్పుకోదగ్గ మార్పు రాలేదు. పర్యవసానంగా భారత ఫుట్‌బాల్ సమాఖ్య దోషిగా నిలబడింది. క్రీడలతో పెద్దగా సంబంధం లేని రాజకీయ నాయకులు ఈ సంఘాల్లోకి జొరబడి వాటిని నియంత్రించడం, ఆ రంగంలో సుదీర్ఘానుభవం ఉన్నవారిని తృణీకరించడం మన దేశంలో రివాజుగా మారింది. ఇందువల్ల సంఘాల్లో నిధులు దుర్వినియోగం కావడం, నిబంధనలు గాలికొదిలి ఇష్టానుసారం వ్యవహరించడం పెరిగింది. దాంతో అసలైన ఔత్సాహిక క్రీడాకారులకు ప్రోత్సాహం కరువవుతోంది. మహిళా క్రీడాకారిణులకు లైంగిక వేధింపులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు సరేసరి. ఎన్ని సమస్యలున్నా ఈమధ్య జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో మనవాళ్లు మంచి ప్రతిభ కనబరిచి పతకాల సాధనలో నాలుగో స్థానంలో నిలిచారు. 22 బంగారు పతకాలు, 16 వెండి పతకాలు, 23 కాంస్య పతకాలు–మొత్తంగా 61 పతకాలు తీసుకొచ్చారు. 2010లో ఇంతకన్నా ఎక్కువ పతకాలు సాధించి రెండో స్థానంలో నిలిచిన సంగతి నిజమే అయినా ఆ తర్వాత నిరాశ తప్పలేదు. ఇప్పుడిప్పుడే అంతా సర్దుకుంటోంది. ఈ ఉత్సాహాన్ని నీరుగార్చేలా ఏఐఎఫ్‌ఎఫ్‌పై నిషేధం వేటుపడింది.

అంతర్జాతీయంగా 211 దేశాలకు సభ్యత్వం ఉన్న ఫిఫా కొంతకాలంగా మన సమాఖ్య పనితీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేకపోయాడు. మా నిబంధనావళిని బేఖాతరు చేస్తున్నారంటూ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ వస్తున్నా వినేవారే లేకుండా పోయారు. సమాఖ్యకు కొత్త కార్యవర్గం ఎన్నికై, దాని అధీనంలో రోజువారీ కార్యకలాపాలుండాలని ఫిఫా సూచిస్తోంది. సాధారణంగా క్రీడాసంఘాలకు అధికారంలో ఉండే పెద్దలవల్ల సమస్యలెదురవుతాయి. కానీ ఫుట్‌బాల్ సమాఖ్యకు విపక్ష ఎన్‌సీపీ నేత ప్రఫుల్ పటేల్ గుదిబండగా మారారు. వరసగా మూడుమార్లు ఎన్నికైన ఆయన పదవీకాలం 2020లోనే ముగిసినా న్యాయస్థానాలను ఆశ్రయించి ఆ పదవి పట్టుకుని వేలాడారు. చివరకు సుప్రీంకోర్టు జోక్యంతో ఫుట్‌బాల్ సమాఖ్యకు ఆయన్నుంచి విముక్తి కలిగినా కొత్త సమస్యలొచ్చి పడ్డాయి. పటేల్‌ను తప్పించినప్పుడే ఫిఫా నిబంధనావళికి అనుగుణంగా చర్యలు తీసుకోమని ఆదేశాలిస్తే వేరుగా ఉండేది. కానీ సమాఖ్య కార్యకలాపాల నిర్వహణకంటూ ఒక పరిపాలక సంఘాన్ని(సీఓఏ) ఏర్పాటుచేయడం, ఆ సంఘం వెనువెంటనే మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారులతో ఓటర్ల జాబితా తయారుచేసి, ఎన్నికైన 36 సంఘాల ప్రతినిధులను బేఖాతరు చేయడం, ఎన్నికలకు సిద్ధం కావడం వివాదాన్ని మరింత ముదిరేలా చేసింది. సీఓఏను ఫిఫా గుర్తించడానికి నిరాకరించి, మన ఫుట్‌బాల్ సమాఖ్యను నిషేధించడంతో కేంద్రం కూడా రంగంలోకి దిగక తప్పలేదు. నిజానికి బీసీసీఐ కేసు తనముందుకు వచ్చినప్పుడే క్రీడాసంఘాలకు రాజకీయ నాయకులు దూరంగా ఉండాలని సుప్రీంకోర్టు హితవు చెప్పింది. కానీ ఆ తర్వాత కూడా ఏమీ మారనందువల్లే 85 ఏళ్ల మన ఫుట్‌బాల్ సమాఖ్య తొలిసారి వీధిన పడాల్సి వచ్చింది. ఫిఫాతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దాలని సుప్రీంకోర్టు కేంద్రానికి చేసిన సూచనవల్ల ఈ భంగపాటు నుంచి సమాఖ్య బయటపడొచ్చు. కానీ ఎన్నాళ్లిలా? క్రీడా సంఘాలు అంకితభావంతో, స్వయంప్రతిపత్తితో పనిచేయలేవా? కొరడా ఝుళిపించినప్పుడు మాత్రమే దారికొస్తాయా?

క్రీడాసంఘాల తీరువల్ల ఆటగాళ్లలో నిరాశానిస్పృహలు అలుముకోవడం, దేశానికి తలవంపులు తప్పకపోవడం మాత్రమే కాదు... ఫిఫా తాజా నిర్ణయం పర్యవసానంగా ఏటా రావాల్సిన రూ. 4 కోట్ల నిధులు ఆగిపోతాయి. ఫుట్‌బాల్ క్రీడకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కుంటుపడుతుంది. పైగా వచ్చే అక్టోబర్‌లో భారత్‌లో జరగాల్సిన మహిళల అండర్–17 ప్రపంచ కప్ సందిగ్ధంలో పడింది. నిషేధం ఎత్తేసేవరకూ అన్ని దేశాల ఫుట్‌బాల్ సమాఖ్యలూ మన దేశాన్ని దూరం పెడతాయి. ఈ నెలాఖరులో ఇరాన్‌లో జరగాల్సిన మ్యాచ్‌లలో... వచ్చే నెలలో వియత్నాం, సింగపూర్‌లలో జరిగే మ్యాచ్‌లలో మన క్రీడాకారులు పాల్గొనలేరు. అందుకే మన క్రీడాసంఘాలు కళ్లు తెరవాలి. క్రీడలపట్ల నిబద్ధత, నిమగ్నతా ఉన్నవారు మాత్రమే సారథ్యం వహించే స్థితి రావాలి. దిగ్గజ క్రీడాకారులూ, క్రీడాభిమానులూ సమష్టిగా నిలబడితే ఇదేమంత అసాధ్యం కాదు. క్రీడా సంఘాలు సర్వస్వతంత్ర సంఘాలుగా రూపొంది దేశంలో క్రీడాభివృద్ధికి కృషిచేస్తేనే మెరికల్లాంటి క్రీడాకారులు రూపొందుతారు. అందుకు భిన్నంగా నిర్ణయరాహిత్యమో, తప్పుడు నిర్ణయాలో రివాజుగా మారితే దేశం తీవ్రంగా నష్టపోతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం
వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బ.నవమి రా.2.21 వరకు
తదుపరి దశమి, నక్షత్రం: రోహిణి పూర్తి (24గంటలు)
వర్జ్యం: రా.10.07 నుండి 11.52 వరకు
దుర్ముహూర్తం: ఉ.5.48 నుండి 7.27 వరకు
అమృతఘడియలు: రా.3.16 నుండి 5.04 వరకు.

సూర్యోదయం: 5.46
సూర్యాస్తమయం: 6.21
రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుంచి 3.00 వరకు


బాబు తప్పులకు బాజాలెందుకు?



వాస్తవాలను వక్రీకరించడంలో తనకు సాటి మరెవరూ రారని 'ఈనాడు' రామోజీరావు మరో సారి నిరూపించుకున్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు నాయుడు చేసిన తప్పిదాలను కప్పిపెట్టడానికి ప్రతిరోజూ పనిగట్టుకుని మరీ ప్రభుత్వంపై విషం చిమ్ముతూ కథనాలు అచ్చేస్తున్న 'ఈనాడు'... శుక్రవారం మరీ చిత్రమైన కథనాన్ని ప్రచురించింది. చంద్రబాబు చేసింది తప్పా? కాదా? అన్న దానికి సమాధానం చెప్పకుండా.. ప్రభుత్వం ఆది నుంచి తెగేసిచెబుతూ వస్తున్న మాటలను సైతం వక్రీకరించే దుస్సాహసానికి ఒడిగట్టడం ఆ పత్రిక దిగజారుడుతనానికి పరాకాష్ట. పోలవరంపై ఆది నుంచీ చంద్రబాబు వైఫల్యాలను బయటపెడుతూ వస్తున్న రాష్ట్రం... తాము అధికారంలోకి వచ్చిన 15 రోజులకే వరదలొచ్చాయని, దాంతో పనులు చేపట్టడం కుదరలేదని పదేపదే చెబుతోంది. అంతకు ముందు మూడున్నరేళ్లుగా ఒక్క బస్తా సిమెంటు వేసే పనిని కూడా చంద్రబాబు సర్కారు చేపట్టకపోవటాన్ని ఎండగడుతోంది కూడా. ఇవేవీ ప్రస్తావించని 'ఈనాడు'... మొన్నటిదాకా చంద్రబాబుపై... ఇపుడు కేంద్ర సంస్థలపై నెపం నెట్టుకొస్తూ పోలవరాన్ని కావాలనే జాప్యం చేస్తున్నట్లుగా వై.ఎస్.జగన్ ప్రభుత్వంపై విషం చిమ్మే ప్రయత్నం చేశారు. 'పోలవరం వైఫల్యంపై పిల్లి మొగ్గలు' అనే శీర్షికతో తన వంకర పాత్రికేయాన్ని మరోసారి బయటపెట్టుకున్నారు. ఒక్కటి చెప్పండి రామోజీరావు గారూ? చంద్రబాబు వైఫల్యం వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి వచ్చిందని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. దానికి సమాధానం చెప్పండి? బాబు పనులు చేసింది కమీషన్ల కోసం కాదా? కమీషన్లు వచ్చే పనులను ముందుగా చేపట్టడం అబద్ధమా? ఇవేవీ చెప్పకుండా కేంద్రంపై నెపం పెట్టేస్తున్నారంటూ శివాలెత్తడం దేనికి? బాబును వెనకేసుకు రావటం దేనికి? అసలు 'ఈనాడు' రాతల్లో నిజమెంత?

రాష్ట్ర ప్రభుత్వం పదే పదే చెబుతోన్న నిజాలను వక్రీకరిస్తూ.. పోలవరంపై రామోజీ పదేపదే విషపూరిత కథనాలను వండి వార్చటానికి అసలు కారణం... తన కుమారుడి వియ్యంకుడికి చెందిన నవయుగ సంస్థను కాంట్రాక్టు ఒప్పందం నుంచి తప్పించడమే తప్ప మరొకటి కాదన్నది కాదనలేని వాస్తవం. పైపెచ్చు చంద్రబాబుతో కలిసి సాగిస్తున్న దోచుకో.. పంచుకో.. తినుకో(డీపీటీ) విధానానికి విఘాతం కలిగింది కూడా!. చంద్రబాబు పాల్పడిన తప్పిదాలను కేంద్ర సంస్థలు సూచించిన మార్గదర్శకాల మేరకు సరిదిద్దుతూ.. ప్రణాళికాయుతంగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ అడుగులు వేస్తున్నారన్నది కాదనలేని నిజం కాదా రామోజీరావు గారూ? కరోనా కష్టకాలంలో కూడా స్పిల్ వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్‌లను రికార్డు సమయంలో పూర్తి చేయడం అబద్ధమా? 35 మీటర్ల కాంటూర్ పరిధిలోని 4,886 కుటుంబాలకు పునరావాసం కల్పించి.. ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి.. గతేడాది జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని 6.1 కిమీల పొడవున మళ్లించడం నిజం కాదా? 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని మిగతా 12,138 కుటుంబాలకు పునరావాసం కలిస్తూ.. కేంద్ర సంస్థలు సూచించిన మేరకు ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలు, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్, దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని పూడ్చే పనులు చేపట్టి.. వేగంగా ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా సీఎం వైఎస్ జగన్ ప్రయత్నించటం మీకెన్నడూ కనిపించదా?

ఏది నిజం?



చంద్రబాబుది తప్పా? కాదా?

ఇక్కడ రామోజీ చెప్పాల్సింది ఒకటే!. నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్ కట్టకుండా.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు నిర్మించకుండా.. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా అప్పట్లో అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించేశారు. ఎందుకంటే దాన్లో అయితేనే ఎక్కువ కమీషన్లు వస్తాయి కాబట్టి. అందుకే పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎం మాదిరిగా వాడుకున్నారని సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇలా చేయటం వల్లే ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలు ఏర్పడ్డాయని, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని ఐఐటీ హైదరాబాద్ నిపుణుల బృందం సహా ప్రపంచ వ్యాప్తంగా ఇంజనీరింగ్ నిపుణులు స్పష్టంచేశారు. ఇలా చేయటం వల్లే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బీఎస్ఎన్ రెడ్డి కూడా స్పష్టంగా చెప్పారు. ప్రభుత్వం పలు సందర్భాల్లో అధికారికంగానే ఈ విషయాన్ని బయటపెట్టింది. విచిత్రమేంటంటే 'ఈనాడు' ఎప్పుడు పోలవరంపై ఎలాంటి రాతలు రాసినా... చంద్రబాబు తప్పు చేశారని గానీ... అలా కాదు చంద్రబాబు చేసిందంతా కరెక్టేనని గానీ ఎన్నడూ చెప్పదు. అదంతా వదిలేసి చంద్రబాబును విమర్శించటం తప్పనే విచిత్రమైన వాదన చేస్తుండటమే దారుణాతిదారుణం.

ఐదేళ్లలో చేయలేనిది.. 15 రోజుల్లో సాధ్యమా?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019, మే 30న అధికారాన్ని చేపట్టింది. అదే ఏడాది జూన్ 15న గోదావరికి వరద ప్రవాహం ప్రారంభమైంది. 2014, జూన్ 8 నుంచి 2019, మే 29 వరకూ అధికారంలో ఉన్న ఐదేళ్లలో చంద్రబాబు పూర్తి చేయలేని ఎగువ కాఫర్ డ్యామ్ పనులు, 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని 17,024 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 15 రోజుల్లో పూర్తి చేయడం సాధ్యమా? రాజధాని అమరావతిని నిర్మించేసినట్లు గ్రాఫిక్స్‌లో చూపిన చంద్రబాబుకు.. గోబెల్స్ తలదన్నేలా అబద్ధపు రాతలు అచ్చేసే 'ఈనాడు' రామోజీకి మాత్రమే అది సాధ్యమవుతుందేమో?

పోలవరంలో విధ్వంసం సృష్టించింది చంద్రబాబే..

కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు పాల్పడిన ఇంజనీరింగ్ తప్పిదాల వల్ల 2019, ఆగస్టులో గోదావరికి వచ్చిన వరదలకు 2400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన ప్రవాహం ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఖాళీ ప్రదేశం 750 మీటర్లకే కుచించుకుపోయి ప్రవహించింది. అందుకే వరద ఉధృతి అధికమై ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై రెండు భారీ అగాధాలు ఏర్పడ్డాయి. దిగువ కాఫర్ డ్యామ్‌లో ఖాళీగా వదిలేసిన ప్రాంతంలోనూ పెద్ద అగాధం ఏర్పడింది. ఇది చంద్రబాబు ఘోర వైఫల్యం కాదా? పోలవరం పనులు ఆలస్యమవుతుండటానికి ప్రధాన కారణం చంద్రబాబు చేసిన తప్పిదాలు కాదా? చంద్రబాబు సృష్టించిన విధ్వంసాన్నే ఐఐటీ హైదరాబాద్ నిపుణుల బృందం ఎత్తి చూపింది. దీనిపై నోరుమెదపరెందుకు రామోజీ?

వరదల్లో పనులు చేయడం మీకే సాధ్యమేమో!!

దిగువ కాఫర్ డ్యామ్‌లో 0 నుంచి 680 మీటర్ల వరకూ కోతకు గురైన ప్రదేశాన్ని జెట్ గ్రౌటింగ్ చేస్తూ.. జియో మెంబ్రేన్ బ్యాగ్‌లలో ఇసుకను నింపి.. వాటిని అగాధం ఏర్పడిన ప్రాంతంలో వేసి.. వైబ్రో కాంపాక్షన్ చేస్తూ పూడ్చి.. 30.5 మీటర్ల ఎత్తుతో జూలై 31 నాటికి పూర్తి చేయాలని ఏప్రిల్ ఆఖరులో పీపీఏ, డీడీఆర్పీ, సీడబ్ల్యూసీలు సూచించాయి. జియో మెంబ్రేన్ బ్యాగ్స్ వినియోగం చాలా తక్కువ. దాంతో వాటి లభ్యత కూడా అంతంత మాత్రమే. అయినా సరే గుజరాత్, అస్సోంలలో వాటిని ఉత్పత్తి చేసే సంస్థలకు ఆర్డర్ ఇచ్చి.. 2.50 లక్షల జియో మెంబ్రేన్ బ్యాగ్స్‌ను సేకరించారు. జెట్ గ్రౌటింగ్ విఫలమవుతుండటంతో సమయం ఎక్కువ తీసుకోవడంతో పాటు కష్టమైన పాలీయురిథేన్ (పీయూ) గ్రౌటింగ్ చేస్తూ.. జూలై 9 నాటికే 20 మీటర్ల ఎత్తుకు దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశారు. గోదావరికి అనుకోకుండా ఈ సారి వరదలు ముందే వచ్చాయి. దీంతో జూలై 10న అర్ధరాత్రి స్పిల్ వే నుంచి దిగువకు విడుదలైన వరద దిగువ కాఫర్ డ్యామ్ మీదుగా ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతంలోకి చేరి నిర్మాణ పనులను ముందుకెళ్లకుండా చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో జూలై 31 నాటికి దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేయడం ఎలా సాధ్యం రామోజీరావు గారూ? వరదల్లోనూ పనులు చేస్తూ.. పూర్తి చేసినట్లు గ్రాఫిక్స్‌ను సృష్టించి.. అదే నిజమని నమ్మబలికే చంద్రబాబే మీకు సరైన జోడీ.

వరదల్లో పరీక్షలు చేయడం ఎలా?

ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చటానికి 9 రకాల పరీక్షలు చేసి.. జూలై 15 నాటికి ఇస్తే.. వాటిని అధ్యయనం చేసి.. ఆ గోతులు పూడ్చే విధానాన్ని ఖరారు చేస్తామని.. వరదలు తగ్గాక ఆ పనులు చేపట్టవచ్చునని రాష్ట్ర జలవనరుల శాఖకు కేంద్ర జల్ శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం మే 17న నిర్వహించిన సమావేశంలో సూచించారు. ఆ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలోనే జూలై 10న అర్ధరాత్రి గోదావరి వరద ప్రవాహం ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతాన్ని ముంచెత్తింది. పరీక్షలకు ఆటంకం కలిగింది. వరదల్లో పరీక్షలు చేయడం అసాధ్యమని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అవి కూడా రామోజీకే సాధ్యమని చెప్పాలి మరి.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కష్టాల్ని ఎత్తుకెళ్లాలి



అందరికీ జన్మాష్టమి శుభాకాంక్షలు. ఈ పర్వదినం మన జీవితాల్లో సంతోషాన్ని తేవాలి. కృష్ణుడు మన జీవితాల్లోని చింతలను దొంగిలించి శాంతినీ, సంతోషాన్నీ కలిగించాలి.
– సాజిద్ యూసుఫ్‌షా, కశ్మీర్ న్యాయవాది

అవకాశం కోల్పోయాను



నాకు మోడలింగ్ కాంట్రాక్టులు రాకపోయినా నేను పాలస్తీనా గురించి మాట్లాడుతూనే ఉంటాను. మా నాన్నతో ఉంటూ, మతాన్ని ఆచరిస్తూ, చెప్పాలంటే మొత్తంగా ముస్లిం సంస్కృతిలో పెరిగివుంటే బాగుండేదని నేను అనుకుంటాను. కానీ నాకు ఆ అవకాశం రాలేదు.
– బెలా హదీద్, అమెరికన్ మోడల్

స్థానాలు మార్చుకోవచ్చు



బెలా హదీద్ లాంటి అన్నీ అమరినవాళ్లు గాలి బుడగల్లో జీవిస్తూ ఉంటారు. ఇప్పుడు నిన్ను ఎవరు ఆపుతున్నారు? నీ యావజ్జీవితం ఇంకా ముందుంది. సౌదీ అరేబియా, ఇరాన్ లేదా అఫ్ఘానిస్తాన్‌కు వెళ్లి షరియా చట్టం కింద బతకొచ్చు. కానీ లక్షలాది మంది మహిళలు నీ స్థానంలోకి రావడానికి తమ జీవితాలను ఎంతటి ప్రమాదంలోకి నెట్టడానికి అయినా సిద్ధంగా ఉన్నారు.
– యాస్మీన్ మొహమ్మద్, యాక్టివిస్ట్

అలా... ఇలా...




ఇండియాతో సరిహద్దు వివాదం గురించి చైనా: "ఇండియా, చైనా తమ సరిహద్దు వివాద పరిష్కారాన్ని భవిష్యత్ తరాలకు వదిలేయాలి."
తైవాన్ మీద చైనా: "మనం ఈ సమస్యను ఒక తరం నుంచి ఇంకో తరానికి కొనసాగడాన్ని అనుమతించకూడదు."
– సనా హాష్మీ, పరిశోధకురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

రైతుబిడ్డల స్ఫూర్తి గీతికలు

తెలుగునాట వ్యవసాయం బలంగా నాటుకోవటంలో తన వంతుపాత్ర పోషించింది బాపట్ల వ్యవసాయ కళాశాల. 1945 జూలై 16న అప్పటి గుంటూరు డిస్ట్రిక్ట్ బోర్డు ఛైర్మన్ పీవీ కృష్ణయ్య చౌదరి చొరవతో ఏర్పడింది. డెబ్బై ఐదేళ్ల కళాశాల నీడలో పెరిగి ప్రయోజకులైన వారి జీవన రేఖలను ఇప్పటివరకూ 3 పుస్తకాలుగా వేసినవాడు ఆ కళాశాల పూర్వ విద్యార్థి, ఆకాశవాణి ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ వలేటి గోపిచంద్. మొదటి పుస్తకం 'ఒక నేల–అనేక ఆకాశాలు'. ఇందులో 1945 నుంచి 2020 వరకు 75 బ్యాచ్‌ల వివరాలు, ఫొటోలు, క్లుప్తంగా ఆ బ్యాచ్ వారి ప్రత్యేకతలు; కళాశాల ఏర్పాటు నేపథ్యం ఉన్నాయి. కళాశాలలో చదువుకున్న 53 మంది విజయగాథలను రెండో పుస్తకం 'వెలుతురు తోవలు'గా మనకందించాడు. ఈనాటికీ అందరూ కోరుకునే సన్న బియ్యం సాంబ మసూరీ రూపకర్త ఎమ్వీ రెడ్డి, చెరకు పంటలో ఎన్నో రకాలు రూపొందించిన డా॥ కొటికలపూడి ప్రసాదరావు, నూనెగింజల పరిశోధనకు ప్రసిద్ధి గాంచిన డా॥ వీరపనేని రంగారావు వంటివారి సేవలు ఉన్నాయి. మరో వందమంది హరిత జీవనరేఖలను మూడో పుస్తకం 'వెలుగు పూలు'గా ఆవిష్కరించాడు.




ఈ కళాశాలలో చదివి సివిల్ సర్వీసుల్లో చేరిన అజయ్ కల్లం, అరిబండి వేణు ప్రసాద్, మన్నెం మాల కొండయ్య, జె. పూర్ణచంద్రరావు వంటివారు, రాజకీయ నేతలైన డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వంటి వారి జీవిత గమనమూ ఇందులో ఉంది. ఈసారి మరింతగా విస్తరించిన నాల్గవ పుస్తకం 'వెలుగు దివ్వెలు'లో మరో 75 మంది జీవన రాగాలను రుచిచూడబోతున్నాం. ఇందులో పెద్దపీట మహిళలకు వేశారు. పరిశోధన, మీడియా, పాలనా, సేవా సామాజిక రంగాలతో పాటుగా మేనేజ్‌మెంట్ రంగంలో రాణిస్తున్న వారి విజయగాథలూ ఉన్నాయి.

– సి.యస్. రాంబాబు, హైదరాబాద్
(బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థుల గురించిన 'వెలుగు దివ్వెలు' ఆవిష్కరణ రేపు హైదరాబాద్‌లో)

గాంధీజీ మెచ్చిన ఊరు


సందర్భం



డాక్టర్ సమ్మెట విజయ్‌కుమార్

అనంతపురం జిల్లా గుత్తికి 11 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'పెద్ద వడుగూరు' గ్రామం స్వాతంత్ర్య ఉద్యమంలో గొప్ప పాత్ర పోషించింది. ఆ ఊళ్లో గొప్ప పారిశ్రామికవేత్త కె. చిన్నారప రెడ్డి. ఎన్నో ఆదర్శ భావాలు కలిగినవాడు. ఆయన పనిపై మద్రాస్ వెళుతూ ఉండేవారు. 1934లో ఒకరోజు ఆయన మద్రాసు మెరీనా బీచ్‌లో మహాత్మాగాంధీ ఉపన్యాసం విన్నారు. ఆ రోజు గాంధీ ఉపన్యసిస్తూ స్వాతంత్ర పోరాటానికి నిధులు కొరతగా ఉన్నాయనీ, దాతలు సహాయం చేయాలనీ విజ్ఞప్తి చేశారు. ఆ మాటలు నారపరెడ్డిని ఆలోచనలో పడవేశాయి. తమ ఊరికి రావాలని గాంధీజీని సంప్రదించారు. స్వాతంత్రోద్యమానికి రూ. 12 వేల నిధి ఇస్తే వస్తానని హామీ ఇచ్చారు. అన్నట్టుగానే బాపు 1934 సెప్టెంబర్ 21న మద్రాసు నుండి రైలులో ఉదయం 7 గంటలకు గుత్తి రైల్వేస్టేషన్లో దిగారు. ప్రజలు పెద వడుగూరుకు ఘన స్వాగతం పలికారు.

చిన్నారప రెడ్డే గాంధీకి వసతి చేకూర్చారు. తిరుపతి రావు అనే వ్యక్తి గాంధీజీని తన భుజస్కంధాలపై ఎత్తుకొని వేదికపైకి చేర్చాడు. హిందీ పండిట్ సత్యనారాయణ... గాంధీ ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించారు. నిధులు అందించి స్వాతంత్ర పోరాటాన్ని విజయవంతం చేయాలని అక్కడ చేరిన ప్రజలను కోరారు గాంధీ. అందరూ కలిసి దాదాపు రూ. 27 వేలు ఇచ్చారు. సభాస్థలికి 11 కిలోమీటర్ల దూరం నుంచి విచ్చేసిన భూస్వామి హంపమ్మ రూ. 1,116 అందజేశారు. ఆమె అంతటితో ఆగకుండా మరో అరగంట గడుస్తుండగా తన ఒంటిపై ఉన్న బంగారు నగలన్నీ విరాళంగా ఇచ్చేశారు. అలా ఒకరికొకరు పోటీలు పడుతూ దాదాపు 5 కేజీల బంగారాన్ని గాంధీకి ఇచ్చారు. ఈ ఊరిని కేంద్రంగా చేసుకుని గాంధీ అనేక గ్రామాలు సందర్శించారు. ఉరవకొండ, హిందూపురం, కదిరి సమావేశాల్లో కూడా ప్రసంగించారు. రాత్రి అయ్యే సరికి తిరిగి పెద్ద వడుగూరులోని తన విడిది గృహానికి చేరుకునేవారు. ఈ నాలుగు రోజులూ గాంధీ చిన్నారప రెడ్డి కారులోనే తిరిగేవారు. ఆఖరు రోజున చిన్నారప రెడ్డి తనకున్న 32 ఎకరాల పొలాన్ని, తన కారును కూడా విరాళంగా ప్రకటించి గొప్ప మనసును చాటుకున్నారు. గాంధీజీని గ్రామానికి పిలవద్దని కూడా అప్పట్లో బ్రిటిష్‌వాళ్లు ఆయనను బెదిరించారు. అయినా ఆయన భయపడకుండా ధైర్యంగా నిలబడి తన నిర్ణయాన్ని అమలుపరిచారు.



గుత్తి రైల్వేస్టేషన్‌లో దిగి బయటికి వస్తున్న గాంధీజీ

ఇక్కడ ఇల్లూరి కేశమ్మ అనే మహిళను కూడా మనం స్మరించుకోవాలి. ఇల్లూరు కేశమ్మ పోలీసుల బెదిరింపులకు భయపడకుండా గ్రామ గ్రామం తిరిగి, గాంధీ సభలకు రావాల్సిందిగా వేసిన కరపత్రాలు పంచింది. ఆమెను ఒకసారి అరెస్టు కూడా చేశారు. అయినా జడవక విడుదల కాగానే తిరిగి ప్రచారం మొదలు పెట్టింది. గాంధీ వెంట నారాయణమ్మ, సుభద్రమ్మ అనే మహిళలు సైతం 4 రోజులు తిరిగారు. ఆరోజు గాంధీ సభకు తోరణాలు కట్టి, అలంకరణ చేసి అందరికీ మంచినీళ్లు అందించిన వెంకటరెడ్డి వయసు నేడు 110 ఏళ్లు. ఆ గ్రామానికి 3 దశాబ్దాలు సర్పంచ్‌గా సేవలందించిన శరభా రెడ్డి కూడా ఆ కాలంలో గాంధీకి రూ. 1,116 విరాళంగా ఇచ్చారు. ఆయన కొడుకు సూర్యనారాయణరెడ్డి (88 ఏళ్ళు)... గాంధీ తమ ఊరికి వచ్చినపుడు తాను చిన్న పిల్లవాడి ననీ, అప్పటి విశేషాలు ఎన్నో తన మనసులో దాగివున్నాయనీ పూస గుచ్చినట్లు వివరించారు. 1947 ఆగస్టు 15న గ్రామమంతా పండుగ చేసుకున్నామనీ, అందరికీ పప్పరమెంట్లు, బొరుగులు పంచామనీ చెప్పుకొచ్చారు. గాంధీజీ పెద వడుగూరును ప్రశంసిస్తూ తన డైరీలో ప్రత్యేకంగా రాసుకున్నారనీ ఆయన అన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఆనాటి కోట్లాదిమందిని స్మరిస్తూ, జీవించివున్న స్వాతంత్ర్య సమరయోధులకు పాదాభివందనాలు తెలియజేద్దాం.

వ్యాసకర్త సామాజిక శాస్త్రవేత్త । 93907 45775

పరమాత్మ పరమార్థం

శుక మహర్షి, మృత్యు నిరీక్షణలో ఉన్న పరీక్షిత్తుకు ఏడు రోజులలో వినిపించిన మోక్ష గ్రంథం శ్రీమద్భాగవతం. భగవంతుని కరుణను పొందే మార్గాలను ఈ కథలలో శుక మహర్షి వివరిస్తాడు. ఒకరోజు, పరీక్షిత్తు శుకునితో 'శివుని సేవించే దేవ, మానవులు సుఖ, సంపదలతో జీవిస్తారు. విష్ణువుని సేవించే మునీశ్వరులు నిరుపేదలుగా జన్మిస్తారు. దీనికి కారణమేమిటి?' అని అడుగుతాడు. అపుడు శుక యోగి 'శివుడు మహా శక్తి సంపన్నుడు. సత్వ, రజ, తమో గుణాలతో కూడుకుని ఉంటాడు. అందువల్ల పరమేశ్వరుని సేవించేవారు ఐశ్వర్య వంతులవుతారు. శ్రీ హరి గుణాతీతుడు. అతనిని కొలిచే భక్తులూ రాగ రహితులే! వారు సంపదలను కోరరు' అని చెపుతాడు.

జ్యోతిర్మయం

ధర్మరాజు రాజసూయ యాగం చేసిన తరవాత కృష్ణుని ఇదే ప్రశ్న అడిగాడు. కృష్ణ పరమాత్మ స్వయంగా సమాధానం ఇలా చెప్పాడు: 'ఎవని పైన అయితే నా అనుగ్రహం ఉంటుందో ఆ ఉత్తముని సమస్త సంపదలను నేను హరిస్తాను. అతడు ధన హీనుడై శోకిస్తాడు. బంధువులతణ్ణి వదిలేస్తారు. అతడు నిస్సహాయుడై నా భక్తులతో స్నేహం చేస్తాడు. క్రమంగా జ్ఞాన వంతుడై అవ్యయానంద చిత్తుడై వైకుంఠ ప్రాప్తికి అర్హుడవుతాడు. నన్ను సేవించటం కష్టమని తలచేవారు లౌకిక సంపదల కోసం ఇతరులను సేవిస్తారు. అలా ఆ దేవతల వల్ల పొందిన ఐశ్వర్యాన్ని శాశ్వతమని భ్రమలో పడి, ఆ ఐశ్వర్యాన్నిచ్చిన దేవతలనే మర్చిపోతారు. కష్టాల పాలవుతార'ని చెపుతాడు. దీనిని బట్టి మనకేం అర్థమవుతుంది? అశాశ్వతమైన భౌతిక సంపదలనూ, భవ బంధాల మమకారాలనూ మనకు దూరం చేయటంలో, పరమాత్మ పరమార్థం తనకు దగ్గర చేసుకోవటమే! భగవంతుని ఈ తత్వం అర్థం కాక బాధపడుతుంటారు. అర్థమైనాక తమ కంటే సంపన్నులు వేరెవరు లేరని ఆనందంగా జీవిస్తారు.


– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

కులవాదులకు తగిన శాస్తి తప్పదు

691వ రోజు దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: తమకు హక్కులు అందకుండా కుట్ర పన్నుతున్న కులవాదులకు తగిన శాస్తి తప్పదని, కోర్టులో వేసిన తప్పుడు కేసులు ఉపసంహరించుకోపోతే బాబు అండ్ కోను రాష్ట్రంలో తిరగకుండా అడ్డుకుంటామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. మూడు రాజధానులకు మద్దతుగా వారు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 691వ రోజుకు చేరుకున్నాయి. పలువురు ప్రసంగిస్తూ, కులవాదమే అజెండాగా కొనసాగుతున్న అమరావతి ఉద్యమంలో టీడీపీ నాయకులు, ప్యాకేజీ పార్టీలు, దళిత దళారులు మినహా ప్రజల మద్దతు లేదన్నారు. అధికారంలో ఉండి భూములిచ్చిన రైతులకు ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా నట్టేట ముంచిన చంద్రబాబును నిలదీయకుండా ఉండేందుకు ముందస్తు ఎత్తుగడతో అమరావతి ఉద్యమం పేరుతో దొంగ దీక్షలకు శ్రీకారం చుట్టడం సిగ్గుచేటన్నారు. అరసవెల్లి పేరుతో చందాల యాత్రలకు శ్రీకారం చుట్టిన అమరావతి జేఏసీ నాయకులకు కోట్లాది రూపాయలు ఎక్కడనుంచి అందుతున్నాయో నిఘా వేసి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు ఎత్తుగడలు వేస్తున్న వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో సమితి నాయకులు గురునాథం, సాంబయ్య, జోషి, ఈపూరి ఆదాం, దాసు తదితరులు పాల్గొన్నారు.

వరద గోదారి



భద్రాచలం, ధవళేశ్వరం వద్ద ఉధృతంగా వరద

- రెండు చోట్లా రెండో ప్రమాద హెచ్చరిక
- ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 14.94 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- వర్షాలు తెరిపి ఇవ్వడంతో గోదావరిలో ఎగువన తగ్గుతున్న వరద
- కృష్ణాలో నిలకడగా వరద.. శ్రీశైలంలోకి 2.89 లక్షల క్యూసెక్కులు
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 1.23 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- వంశధారలో స్థిరంగా వరద
- గొట్టా బ్యారేజ్ నుంచి 20 వేల క్యూసెక్కులు కడలిలోకి

సాక్షి, అమరావతి/ధవళేశ్వరం/శ్రీశ్రీశైలం ప్రాజెక్ట్/సత్రశాల (రెంటచింతల)/విజయపురిసౌత్: గోదావరిలో వరద ఉధృతి కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద 47.7 అడుగులు, ధవళేశ్వరం వద్ద 15 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. అక్కడ రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు 48 గేట్ల ద్వారా విడుదల చేస్తున్న జలాల్లో ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 15,05,850 క్యూసెక్కులు వస్తుండగా.. గోదావరి డెల్టాకు 11 వేల క్యూసెక్కులు, మిగులుగా ఉన్న 14,94,850 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు. నదీ పరివాహక ప్రాంతం(బేసిన్)లో శుక్రవారం వర్షాలు తెరిపి ఇచ్చాయి. దాంతో ఎగువన గోదావరిలో వరద తగ్గింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజ్‌లోకి వరద 7.40 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. దాని దిగువన ఉన్న తుపాకుల గూడెం బ్యారేజ్‌లోకి 8.84 లక్షలు, సీతమ్మ సాగర్‌లోకి 11.47 లక్షల క్యూసెక్కులకు ప్రవాహం తగ్గింది. ఆ నీటినంతా దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం నుంచి భద్రాచలం, ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద వరద ప్రవాహం తగ్గుముఖం పట్టనుంది.

స్థిరంగా వంశ'ధార'

వర్షాల ప్రభావం వల్ల వంశధారలో వరద స్థిరంగా కొనసాగుతోంది. గొట్టా బ్యారేజ్‌లోకి 22,809 క్యూసెక్కులు చేరుతుండగా.. వంశధార ఆయకట్టుకు 2,215 క్యూసెక్కులను విడుదల చేస్తూ.. మిగులుగా ఉన్న 20,594 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. నాగావళిలోనూ వరద కొనసాగుతోంది. తోటపల్లి బ్యారేజ్‌లోకి 6,358 క్యూసెక్కులు చేరుతుండగా.. ఆయకట్టుకు 1,520 క్యూసెక్కులు విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 4,838 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఆ జలాలు నారాయణపురం ఆనకట్ట మీదుగా బంగాళాఖాతంలో కలుస్తున్నాయి.

నిలకడగా కృష్ణమ్మ

బేసిన్‌లో కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణాలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. జూరాల, సుంకేశుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 2,89,909 క్యూసెక్కులు చేరుతుండగా.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 18 వేలు, హంద్రీ–నీవా ద్వారా 1,688 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్కేంద్రాల ద్వారా 62,665 క్యూసెక్కులు, స్పిల్ వే 8 గేట్లను పది అడుగుల మేర ఎత్తి 2,23,864 క్యూసెక్కులు.. మొత్తం 3,06,217 క్యూసెక్కులను తరలిస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో 884.8 అడుగుల్లో 214.84 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. నాగార్జున సాగర్‌లోకి 1,74,167 క్యూసెక్కులు చేరుతుండగా.. కుడి కాలువకు 8,831, ఎడమ కాలువకు 8,193, ఏఎమ్మార్పీకి 600, వరద కాలువకు 400, ప్రధాన విద్యుత్కేంద్రం ద్వారా 32,927, స్పిల్ వే 16 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,23,216 క్యూసెక్కులను తరలిస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో 586.2 అడుగుల్లో 301.35 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.

పులిచింతల ప్రాజెక్టులోకి 1,36,582 క్యూసెక్కులు చేరుతుండగా.. విద్యుత్కేంద్రం ద్వారా 8 వేలు, స్పిల్ వే 5 గేట్లను 3.5 అడుగుల మేర ఎత్తి 1,30,616 క్యూసెక్కులు.. మొత్తం 1,38,616 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌లోకి 1,35,847 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టాకు 12,797 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 1,23,050 క్యూసెక్కులను బంగాళాఖాతంలోకి వదిలేస్తున్నారు.

21 నుంచి కాణిపాక వినాయకుని మూలవిరాట్ దర్శనం



మాట్లాడుతున్న చైర్మన్, ఈవో

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి మూలవిరాట్ దర్శనం ఈ నెల 21వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి భక్తులందరికీ కల్పించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఈవో కార్యాలయంలో వీరు మీడియాతో మాట్లాడారు. కాణిపాక ఆలయ పునఃనిర్మాణ పనులు పూర్తయినందున 21న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆ సమయంలో భక్తులకు దర్శనాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

'ప్యారీ షుగర్స్'లో పేలుడు

- ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి
- మరో 9 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- మొబైల్ కన్వేయర్ బెల్ట్ మోటారు పేలిపోవడంతో ప్రమాదం?



రాయుడు వీరవెంకట సత్యనారాయణ (ఫైల్)



వీరమళ్ళ రాజేశ్వరరావు (ఫైల్)

కాకినాడ రూరల్ : కాకినాడ జిల్లా వాకలపూడిలోని ప్యారీ షుగర్స్ (ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెట్) పరిశ్రమలో శుక్రవారం పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు రాయుడు వీరవెంకట సత్యనారాయణ (35), వీరమళ్ళ రాజేశ్వరరావు(45) మృతిచెందారు. మరో 9 మంది కార్మికులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. విదేశాల నుంచి ఓడలు ద్వారా కాకినాడ సీ పోర్టుకు ముడి సరుకును దిగుమతి చేసుకుని ఇక్కడ శుద్ధిచేసి బస్తాల్లో ప్యాకింగ్ చేసి తిరిగి విదేశాలకు పంపుతుంటారు. ఈ నేపథ్యంలో.. శుక్రవారం లోడింగ్ కోసం వచ్చిన జట్టు ఉ.9గంటల సమయంలో ఒక లారీని లోడు చేశారు. మరో లారీలోకి సరుకు లోడు చేసేందుకు కన్వేయర్ బెల్ట్ పవర్ సప్లై కోసం ఎంసీబీ (మెయిన్ సర్క్యూట్ బ్రేకర్) వద్ద సాకెట్‌లో వైర్లు కలిపి ఎంసీబీ ఆన్‌చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు వాటిల్లినట్లు చెబుతున్నారు. ఇలా పేలుడు రావడం.. మంటలు వ్యాపించడంతో సత్యనారాయణ శరీర భాగాలు ఛిద్రమై అక్కడికక్కడే మరణించాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా రాజేశ్వరరావు మృతిచెందాడు. మరోవైపు.. గాయపడిన వీరబాబు, గర్లంవల సూర్య సుబ్రహ్మణ్యం, మోరుకుర్తి జగన్నాథం, గండి వీరబాబులను ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. వీరిలో వీరబాబు పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇతరుల వివరాలు తెలియాల్సి ఉంది.

ఓవర్ లోడు విద్యుత్ సరఫరాతోనే ప్రమాదం?

ఎంసీబీ నుంచి ఒక్కసారిగా అధిక విద్యుత్ రావడం వల్లే మోటారు పేలిపోయి ఉంటుందని దీంతో కార్మికులు తీవ్రగాయాలపాలై ఉంటారని అనుమానిస్తున్నారు. దీనికితోడు కాలే స్వభావం గల పంచదార కూడా మంటలకు ఆజ్యంపోసి ఉండవచ్చునంటున్నారు. కానీ, ప్రమాద కారణాలను విద్యుత్, అగ్ని మాపక సిబ్బంది చెప్పలేకపోవడం మిస్టరీగా మారింది. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ప్రమాద స్థలిని పరిశీలించి కార్మికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత సంస్థ మేనేజరు ఎం.బాలాజీతోనూ చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సంఘటనపై అగ్నిమాపక, విద్యుత్ అధికారులతో విచారణ జరిపిస్తామని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు చెప్పారు. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సర్పవరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు తదితరులు

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సానుభూతి

ప్రమాదం గురించి తెలిసిన వెంటనే కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లామన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని, దీనిపై యాజమాన్యంతో మాట్లాడతున్నామని ఎమ్మెల్యే చెప్పారు.

రూ.40లక్షల చొప్పున పరిహారం

ఇదిలా ఉంటే.. ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ వంగా గీత చర్చలు జరపడంతో మృతుల కుటుంబాలకు రూ.40లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు సంస్థ యాజమాన్యం అంగీకారం తెలిపింది. అలాగే, మృతుల కుటుంబాల్లో చదువుకున్న వారుంటే వారికి ఉద్యోగాలు.. కార్మికుల చట్టం ప్రకారం రావాల్సిన బెనిఫిట్స్ చెల్లిస్తామని హామీ ఇచ్చింది. మరోవైపు.. గాయపడ్డ వారికి వైద్య ఖర్చులు, చికిత్స కాలానికి వేతనం కూడా ఇవ్వనున్నారు.

రాయదుర్గం ఎమ్మెల్యే అల్లుడు ఆత్మహత్య

తాడేపల్లి రూరల్: అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అల్లుడు శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆత్మహత్య చేసుకున్నారు. కాపు రామచంద్రారెడ్డి కుమార్తె భర్త అయిన మంజునాథరెడ్డి తాడేపల్లిలోని అవంతి అపార్టుమెంటులోని ఫ్లాట్‌లో ఫ్యానుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కార్పొరేట్ ఆస్పత్రిలో భద్రపర్చారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

గడపగడపనా ఘనస్వాగతం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రజలు ఘనంగా స్వాగతించారు. తమ ఇంటికి వచ్చిన ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులను ఆత్మీయంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమకు కలిగిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పాలన బాగుందని, అర్హత ఉంటే పథకాలు అందుతున్నాయని చెప్పారు. సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తోన్న ప్రభుత్వానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు.



గుంటూరు రూరల్ చినపలకలూరులో వృద్ధురాలికి పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మహిళకు ఇంటిపట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ప్రకాశం జిల్లా రాయవరంలో మహిళకు లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

అగ్రశ్రీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జాతీయ అవార్డుల ప్రదానం



అవార్డు గ్రహీతలు వీరే

తిరుపతి రూరల్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఔట్‌స్టాండింగ్ లీడర్‌షిప్ జాతీయ అవార్డు–2021ను నేషనల్ క్యాపబిలిటీ బిల్డింగ్ ఫ్రేమ్ వర్క్ రివిజన్ కమిటీ (ఎన్‌సీబీఎఫ్) చైర్మన్ డాక్టర్ డబ్ల్యూ.రాంపుల్లారెడ్డి అందుకున్నారు. అకాడమీ ఆఫ్ గ్రాస్‌రూట్స్ స్టడీస్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ఇండియా (అగ్రశ్రీ), ఏపీ మహిళా అభివృద్ధి సొసైటీ (ఏపీ మాస్) సహకారంతో శుక్రవారం తిరుపతిలో రాజీవ్‌గాంధీ జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. పలు రంగాల్లో విశేష ప్రతిభ చూపిన వారికి, ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన నిపుణులకు ఈ కార్యక్రమంలో స్విమ్స్ వర్సిటీ వీసీ డాక్టర్ వెంగమ్మ అవార్డులను అందజేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో డాక్టర్ టీహెచ్ చౌదరి, గ్రామ స్వరాజ్ విభాగంలో గ్రామాలయ సంస్థ సీఈవో దామోదరన్, మహిళా శక్తి విభాగంలో నెల్లీ జోయ్ రోడ్రిగ్స్, ఉత్తమ జిల్లా పంచాయతీ అవార్డును మహారాష్ట్ర కొల్హాపూర్ జిల్లా పంచాయతీ చైర్మన్ రాహుల్ పాటిల్ సదోల్కర్, ఉత్తమ తాలూక పంచాయతీ అవార్డును కేరళలోని మలప్పురం జిల్లా పెరింతాల్‌మన్న బ్లాక్ పంచాయతీ అధ్యక్షుడు ముస్తాఫా, ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును కేరళ కొల్లాం జిల్లా వెస్ట్ కల్లాడ గ్రామపంచాయతీ ప్రెసిడెంట్ డాక్టర్ ఉన్నికృష్ణన్‌లకు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలు, పరిశోధకులు విజయగాథలతో రూపొందించిన సావనీర్‌ను అగ్రశ్రీ వ్యవస్థాపకులు డాక్టర్ సుందర్‌రాం ఆవిష్కరించారు. ఏపీ మాస్ సంస్థ వ్యవస్థాపకులు సీఎస్ రెడ్డి, అగ్రశ్రీ సహవ్యవస్థాపకులు భారతిసుందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

అజయ్‌కుమార్ భల్లా మరో ఏడాది

న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన 2023 ఆగస్టు 22 వరకూ ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. భల్లా పదవీ కాలాన్ని పొడిగించడం ఇది మూడోసారి కావడం గమనార్హం. 1984 బ్యాచ్ అస్సాం–మేఘాలయా క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన భల్లా తొలుత 2019 ఆగస్టులో కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. 2020 నవంబర్‌లో రిటైర్ అయ్యారు. దీంతో పదవీ కాలాన్ని రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. మూడోసారి సైతం పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

1.35 కోట్ల మంది మహిళలకు స్మార్ట్‌ఫోన్లు

జైపూర్: 'ముఖ్యమంత్రి డిజిటల్ సేవా యోజన' అమలుకు రాజస్తాన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకం కింద రాష్ట్రంలో 1.35 కోట్ల మంది మహిళలకు స్మార్ట్‌ఫోన్లు అందజేయనున్నట్లు అధికారులు శుక్రవారం తెలియజేశారు. 'చిరంజీవి ఆరోగ్య బీమా పథకం'లో చేరిన కుటుంబాల్లోని ఒక మహిళకు ఈ ఫోన్లు పంపిణీ చేస్తారు. మూడేళ్లపాటు ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పిస్తారు. ఈ ఫోన్లకు టెలికం సేవలు అందించేందుకు మూడు పెద్ద కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. రాజస్తాన్‌లో వచ్చే ఏడాది డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఆ లోపే స్మార్ట్‌ఫోన్ల పంపిణీ పథకం అమలును దశల వారీగా పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.12,000 కోట్లు. లబ్ధిదారులకు యాక్టివేట్ అయిన సిమ్ కార్డుతో సహా స్మార్ట్ ఫోన్ అందజేస్తారు. ఆ సిమ్ కార్డును మార్చుకోవడానికి వీలుండదు.

సిరియాలో రాకెట్ దాడి.. 15 మంది మృతి

బీరుట్: ఉత్తర సిరియాలోని అల్–బాబ్ పట్టణంలో జనంతో కిక్కిరిసి ఉన్న మార్కెట్‌పై ప్రతిపక్ష ఫైటర్లు శుక్రవారం రాకెట్ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 15 మంది మరణించారు. మరో 30 మంది గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. సిరియా ప్రభుత్వంపై పోరాడుతున్న ప్రతిపక్ష సభ్యులకు టర్కీ అండగా నిలుస్తోంది. ఇటీవలే టర్కీ సైన్యం జరిపిన వైమానిక దాడిలో 11 మంది సిరియా సైనికులు, అమెరికా మద్దతున్న కుర్దిష్ ఫైటర్లు బలయ్యారు.

జడ్జీలుగా ఇద్దరి నియామకం నిలిపివేత

న్యూఢిల్లీ: పంజాబ్, హరియాణా హైకోర్టులో న్యాయమూర్తులుగా నియమించాలని సూచిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం 13 మంది అడ్వొకేట్ల పేర్లను సిఫార్సు చేయగా, ఇందులో ఇద్దరి పేర్లను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడం ఆసక్తికరంగా మారింది. కేవలం 11 మందిని పంజాబ్, హరియాణా హైకోర్టులో న్యాయమూర్తులుగా నియమిస్తూ ఆగస్టు 14న ఉత్తర్వులు జారీ చేసింది. మిగిలిన ఇద్దరు అడ్వొకేట్లు హెచ్.ఎస్.బ్రార్, కుల్దీప్ తివారీల నియామకాన్ని మాత్రం నిలిపివేసింది. వీరిలో ఒకరిపై గతంలో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయని, మరొకరికి తగినంత అనుభవం, వయసు లేదని న్యాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఇద్దరి విషయంలో ప్రభుత్వం తగిన సమయంలో నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి.

ప్రభుత్వ సమావేశాల్లో లాలూ అల్లుడు

బిహార్‌లో రాజకీయ రగడ

పట్నా/గయ: బిహార్‌లో ఇటీవలే ఏర్పాటైన మహాకూటమి ప్రభుత్వానికి కొత్త తలనొప్పులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ అధికారిక సమావేశాల్లో ఆర్జేడీ వ్యవస్థాపకుడు లాలూ ప్రసాద్ యాదవ్ అల్లుడు శైలేష్ కుమార్ పాల్గొనడం వివాదాస్పదంగా మారింది. లాలూ కుమార్తె, ఆర్జేడీ రాజ్యసభ సభ్యురాలు మీసా భారతి భర్త ఈ శైలేష్ కుమార్. ఇటీవల లాలూ పెద్ద కుమారుడు, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్ నేతృత్వంలో జరిగిన రెండు అధికారిక భేటీల్లో అతడు పాల్గొన్నట్లు వీడియో దృశ్యాలు, ఫొటోలు శుక్రవారం బయటకు వచ్చాయి. ఈ మొత్తం వ్యవహారంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్ తన అధికారిక విధులను బావ శైలేష్ ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చాడని బీజేపీ సీనియర్ నేత సుశీల్‌కుమార్ మోదీ ఆరోపించారు. శైలేష్ నేరుగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ, అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నాడని ఆక్షేపించారు. దీనిపై ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నితీశ్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

గయ: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ శుక్రవారం గయలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. ప్రతికూల వాతావరణం కారణంగానే హెలికాప్టర్‌ను అత్యవసరంగా దించినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. కరువు ప్రభావిత ఔరంగాబాద్, జెహానాబాద్, గయ జిల్లాల్లో నితీశ్ హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. రాజధాని పాట్నాకు తిరిగి వస్తుండగా, వాతావరణం అనుకూలించకపోవడంతో హెలికాప్టర్‌ను పైలట్ గయ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా దించారు. అనంతరం నితీశ్ రోడ్డు మార్గం ద్వారా పాట్నాకు చేరుకున్నారు.

ఆదాయం పెంచేందుకు... 'మందు'కు రండి

- యువతను బతిమాలుతున్న జపాన్
- దేశంలో బాగా పడిపోయిన లిక్కర్ సేల్స్
- దాంతో రంగంలోకి నేషనల్ ట్యాక్స్ ఏజెన్సీ
- యూత్‌తో తాగించాలంటే ఏం చేయాలి?
- సలహాలివ్వాలంటూ దేశవ్యాప్త కాంపిటీషన్



టోక్యో: 'యువతీ యువకుల్లారా! బాబ్బాబూ, దయచేసి మద్యం అలవాటు చేసుకోండి. మీకు నచ్చిన బ్రాండ్ ఎంపిక చేసుకుని తాగండి. ప్లీజ్' అంటోంది జపాన్ సర్కారు! దేశంలో లిక్కర్ ఆదాయం ఏటేటా భారీగా పడిపోతుండటమే ఇందుకు కారణం. 1995లో సగటున ఒక్కో జపనీయుడు ఏటా 100 లీటర్ల మందు తాగితే 2020 కల్లా అది ఏకంగా 75 లీటర్లకు పడిపోయిందట. దాంతో 1980ల్లో మొత్తం పన్ను ఆదాయంలో 5 శాతంగా ఉన్న మద్యం వాటా కాస్తా 2011కు 3 శాతానికి, 2020కల్లా ఏకంగా 1.7 శాతానికి తగ్గిందని జపనీస్ టైమ్స్ పేర్కొంది. 2019తో పోలిస్తే 2020లో మద్యం ఆదాయం ఏకంగా 110 బిలియన్ యెన్ల మేరకు పడిపోయిందట! గత 31 ఏళ్లలో ఇదే అతి పెద్ద తగ్గుదల! ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జపాన్ ఇప్పటికే నిధుల లేమితో సతమతమవుతోంది. మద్యం అమ్మకాలు కుచించుకుపోవడం మూలిగే నక్కపై తాటిపండు చందంగా మారింది. దాంతో ప్రభుత్వం ఆందోళనలో పడింది. వాటిని ఎలాగైనా పెంచాలని కంకణం కట్టుకుంది. ఇంతకీ సమస్య ఎక్కడుందా అని కుస్తీ పడితే తేలిందేమిటంటే, పెద్దలు పర్లేదు గానీ జపాన్ యువతే అస్సలు మందు జోలికే పోవడం లేదట. జీవన శైలిలో వచ్చిన మార్పులు, కరోనా మహమ్మారి వంటి వాటివల్ల యూత్ మందు ముట్టడం మానేశారట. ఆరోగ్యం విలువ తెలిసొచ్చింది గనుక కరోనా సమస్య తగ్గుముఖం పట్టినా బాటిళ్లకేసి కన్నెత్తి కూడా చూడటం లేదట! లిక్కర్ అమ్మకాలు తగ్గుముఖం పట్టడానికి ఇదే ప్రధాన కారణమని తేలింది.

సేక్ వివా...

ఈ నేపథ్యంలో మందు తాగేలా యువతను ప్రోత్సహించేందుకు భారీ ప్రచారానికి జపాన్ ప్రభుత్వం తెర తీసింది. ఇందులో భాగంగా ''సేక్ వివా'' పేరుతో నేషనల్ ట్యాక్స్ ఏజెన్సీ దేశవ్యాప్త పోటీ నిర్వహిస్తోంది. 20 నుంచి 39 ఏళ్ల మధ్య వయస్కులు ఇందులో పాల్గొనవచ్చు. యూత్‌లో మందు కొట్టే అలవాటును పెంచేందుకు ఏం చేయాలో వారు సలహాలు సూచనలివ్వాలి. అందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెటావర్స్ తదితరాల సాయంతో వినూత్నం, ఆకర్షణీయం అయిన సేల్స్ టెక్నిక్స్ పద్ధతులను రూపొందించవచ్చు. ఈ పోటీ సెప్టెంబర్ 9 దాకా నడుస్తుంది. ఫైనలిస్టులను అక్టోబర్లో నిపుణుల కన్సల్టేషన్ కోసం ఆహ్వానిస్తారు. నవంబర్లో టోక్యోలో తుది రౌండ్ పోటీ ఉంటుంది. విజేత తన మద్యం అమ్మకాల పెంపు బ్లూప్రింట్‌ను అమలు చేసేందుకు ఏజెన్సీ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందట! ''మద్యం మార్కెట్ నానాటికీ కుంచించుకుపోతోంది. అందుకే యువత మందు అలవాటు చేసుకుని ఈ పరిశ్రమకు జీవం పోసేలా చేయడమే ఈ కాంపిటీషన్ లక్ష్యం'' అని ఏజెన్సీ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది.

ఇదేం దిక్కుమాలిన పోటీ!

ఈ కాంపిటీషన్‌పై పలు వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వమే పనిగట్టుకుని మద్యం అమ్మకాలు పెంచేందుకు ప్రయత్నించడం ఏమిటంటూ ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ''అది కూడా దేశ సంపద అయిన యువతను మందు తాగి ఆరోగ్యం చెడగొట్టుకొమ్మని ప్రభుత్వమే పిలుపునివ్వడం ఎంతవరకు సబబు? మద్యానికి దూరంగా ఉండటం నిజానికి మంచిదే కదా!'' అని జనం ప్రశ్నిస్తున్నారు. ఆదాయమే తప్ప జనారోగ్యం పట్టదా అంటూ దుయ్యబడుతున్నారు. 'మితిమీరిన తాగుడు మంచిది కాదు. అదో పెద్ద సామాజిక సమస్య' అంటూ జపాన్ ఆరోగ్య శాఖ గతేడాది కార్యక్రమాలు జరిపిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

కేంద్రం, ఆప్ కుస్తీ

- ఎక్సైజ్ పాలసీ అక్రమాల కేసులో...
- సిసోడియా, సన్నిహితుల ఇళ్లపై సీబీఐ దాడులు
- దేశవ్యాప్తంగా 31 చోట్ల సోదాలు
- నిబంధనల తారుమారు
- లైసెన్సీలకు అనుచిత లబ్ధి
- ఖజానాకు రూ. 144 కోట్ల నష్టం
- బదులుగా సిసోడియా తదితరులకు కోట్లు ముట్టాయని అభియోగాలు



తన నివాసంలో సోదాల సందర్భంగా సీబీఐ అధికారులతో మనీశ్ సిసోడియా

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ ఉదంతం కేంద్రానికి, ఆమ్ ఆద్మీ పార్టీకి మధ్య మరోసారి చిచ్చు రాజేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా దేశ రాజధానిలోని ఆప్ నేత, ఢిల్లీ విద్యా, ఎక్సైజ్ శాఖల మంత్రి మనీశ్ సిసోడియా నివాసంపై సీబీఐ శుక్రవారం దాడులు చేసింది. గురుగ్రాం, చండీగఢ్, ముంబై, హైదరాబాద్, లఖ్‌నవూ, బెంగళూరు... ఇలా దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 31 చోట్ల ఉదయం 8 గంటల నుంచి రాత్రి దాకా ఏకకాలంలో దాడులు చేసింది. మాజీ ఎక్సైజ్ కమిషనర్ అరవ గోపీకృష్ణతో పాటు పలువురు అధికారులు, వ్యాపారవేత్తలు, మద్యం వ్యాపారులు తదితరుల నివాసాల్లో సోదాలు చేసింది. రాత్రి 11 గంటల దాకా సిసోడియా నివాసంలో సోదాలు కొనసాగాయి. తన లాప్‌టాప్, ఫోన్ తీసుకెళ్లారని ఆయన మీడియాకు తెలిపారు. పలు పత్రాలు, డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకున్నట్టు సీబీఐ తెలిపింది. ఈ ఉదంతంపై బుధవారమే ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. సిసోడియా, నలుగురు ప్రభుత్వాధికారులతో పాటు మొత్తం 15 మందిపై నేరపూరిత కుట్ర, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద సీబీఐ అభియోగాలు మోపింది. ''సిసోడియా తదితరులు నిబంధనలకు విరుద్ధంగా ఎక్సైజ్ పాలసీలో పలు మార్పులు చేశారు. తద్వారా లైసెన్సుదారులకు అనుచిత లబ్ధి చేకూర్చారు. ఖజానాకు రూ.144.36 కోట్ల మేరకు నష్టం చేకూర్చారు. బదులుగా భారీగా ముడుపులు అందుకున్నారు'' అని ఆరోపించింది. ఈ ఉదంతంపై ఆప్ మండిపడింది. పై నుంచి వచ్చిన ఆదేశాల మేరకే దాడులు జరిగాయని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. విద్య, ఆరోగ్య రంగాల్లో ఢిల్లీ సర్కారుకు అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు వస్తుండటాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు. అందుకే ఢిల్లీ విద్యా విధానాన్ని ప్రశంసిస్తూ న్యూయార్క్ టైమ్స్ మొదటి పేజీలో కథనం ప్రచురించిన రోజే సీబీఐని ఉసిగొల్పారన్నారు. ''స్వతంత్ర భారతదేశంలోనే అత్యుత్తమ విద్యా శాఖ మంత్రిపై కక్షపూరిత చర్యలకు దిగారు. సీబీఐకి మేం పూర్తిగా సహకరిస్తాం. మా మంత్రులపై గతంలో చేసిన దాడుల్లో తేలిందేమీ లేదు. ఇప్పుడూ తేలేదేమీ లేదు'' అంటూ ట్వీట్ చేశారు. న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని జత చేశారు. ''మంచి చేయబోయిన వారందరినీ 75 ఏళ్లుగా ఇలాగే వెనక్కు లాగుతున్నారు. ఇందుకే దేశం వెనకబడింది. ఎవరేం చేసినా ఢిల్లీలో మాత్రం అభివృద్ధి ఆగదు'' అన్నారు. ఇలాంటి దాడులకు బెదిరేది లేదని సిసోడియా అన్నారు. ''సీబీఐకి స్వాగతం. ఈ కుట్రలు నన్నేమీ చేయలేవు. నిజం నిలకడ మీద తేలుతుంది'' అంటూ ట్వీట్ చేశారు.

హైదరాబాద్ వ్యాపారిపైనా..

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అరుణ్ రామచంద్ర పిళ్లై నివాసాలు, కార్యాలయాల్లోనూ సీబీఐ దాడులు చేసింది. హైదరాబాద్ కోకాపేటతో పాటు బెంగళూరులో ఉన్న ఆయన నివాసాలు, కార్యాలయాల్లో సీబీఐ సోదాలు జరిపింది. అరుణ్ రామచంద్ర పిళ్లై బెంగళూరు కేంద్రంగా స్పిరిట్, డిస్టిలరీస్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ కేసులో ఆయనపైనా ఆరోపణలున్నాయి.

మోదీ సర్కారుకు దడ

కేజ్రీవాల్‌కు, ఆయన ఢిల్లీ మోడల్ పాలనకు సర్వత్రా పెరుగుతున్న పాపులారిటీని చూసి మోదీ ప్రభుత్వం బెదిరిపోతోందని ఆప్ ఆరోపించింది. సిసోడియా ఇంట్లో సీబీఐకి జామెట్రీ బాక్సులు, పెన్సిళ్లు తప్ప మరేమీ దొరకవంటూ ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా చెణుకులు విసిరారు. సిసోడియాను ఎలాగైనా కటకటాల్లోకి నెట్టాలని సీబీఐకి ఆదేశాలున్నాయని ఆప్ జాతీయ అధికార ప్రతినిధి సంజయ్ సింగ్ ఆరోపించారు. వీటిని బీజేపీ తిప్పికొట్టింది. ఎక్సైజ్ మంత్రి కాస్తా ఎక్స్‌క్యూజ్ మంత్రిగా మారారంటూ కేంద్ర సమాచార మంత్రి అనురాగ్ ఠాకూర్ ఎద్దేవా చేశారు. మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ఆరోగ్య మంత్రి సత్యేంద్ర జైన్‌ను మే 30న ఈడీ అరెస్టు చేయడం తెలిసిందే. ప్రస్తుతం ఆయన కస్టడీలో ఉన్నారు.

కాకరేపిన కథనం



న్యూయార్క్ టైమ్స్ పత్రికలో వచ్చిన కథనాన్ని చూపుతున్న అరవింద్ కేజ్రీవాల్

ఢిల్లీ విద్యా విధానాన్ని ప్రశంసిస్తూ న్యూయార్క్ టైమ్స్ వార్తా పత్రిక గురువారం తన అంతర్జాతీయ ఎడిషన్లో మొదటి పేజీలో ప్రముఖంగా కథనం ప్రచురించింది. ''ఆప్ పాలనలో ఢిల్లీ విద్యా విధానంలో సమూలమైన మౌలిక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. వాటిలో చేరేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు'' అంటూ ప్రశంసించింది. ఇతర రాష్ట్రాలు కూడా ఢిల్లీ మోడల్ విద్యా విధానంపై దృష్టి పెట్టాయని పేర్కొంది. విద్యార్థినులతో సిసోడియా ఉన్న ఫొటోను కూడా ప్రచురించింది. ఆకస్మిక పర్యటనలు తదితరాల ద్వారా విద్యా మంత్రిగా ఆయన బాగా పని చేస్తున్నారని రాసింది. బీజేపీ, ఆప్ మాటల యుద్ధానికి ఈ కథనమే ప్రధాన ఆయుధంగా మారింది. అంతర్జాతీయంగా ప్రశంసలు దక్కడాన్ని ఓర్వలేకే సిసోడియాపైకి మోదీ ఇలా సీబీఐని ఉసిగొల్పారని ఆప్ నేతలంతా ఆరోపించారు. ''సిసోడియా ఫొటోను న్యూయార్క్ టైమ్స్ ఫస్ట్ పేజీలో వేసి మెచ్చుకుంది. కేంద్రం వెంటనే ఆయన ఇంటికి సీబీఐని పంపింది'' అంటూ కేజ్రీవాల్ మండిపడ్డారు. మోదీ తీరు సిగ్గుచేటని ఆప్ నేత సంజయ్ సింగ్ అన్నారు. బీజేపీ మాత్రం ఇది కచ్చితంగా ఆప్ డబ్బులిచ్చి రాయించుకున్న కథనమేనంటూ ఎదురుదాడికి దిగింది. ప్రచారం కోసం ప్రజా ధనాన్ని వృథా చేస్తోందని ఆరోపించింది. ''ఆప్ సర్కారు కీర్తి కండూతికి న్యూయార్క్ టైమ్స్ కథనమే తాజా ఉదాహరణ. ఈ కథనం అదే రోజు ఖలీజ్ టైమ్స్ అనే పత్రికలోనూ యథాతథంగా వచ్చింది'' అంటూ బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ ట్వీట్ చేశారు.

పెయిడ్ ఆర్టికల్ కాదు: న్యూయార్క్ టైమ్స్

పెయిడ్ ఆర్టికల్ ఆరోపణలను న్యూయార్క్ టైమ్స్ శుక్రవారం తీవ్రంగా ఖండించింది. అది తాము క్షేత్రస్థాయిలో పరిశోధించి పూర్తి నిష్పాక్షికంగా రాసిన కథనమని స్పష్టం చేసింది. ఇదే కథనాన్ని ఖలీజ్ టైమ్స్ వార్తా పత్రిక కూడా అదే రోజు యథాతథంగా ప్రచురించడంపై బీజేపీ లేవనెత్తిన అనుమానాలను కొట్టిపారేసింది. ''మా లైసెన్సున్న పలు వార్తా సంస్థలు మా కథనాలను ప్రచురించుకోవడం మామూలే'' అని పేర్కొంది.

ఏమిటీ కేసు?

2021 నవంబర్‌లో కేజ్రీవాల్ ప్రభుత్వం ఢిల్లీలో కొత్త ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చింది. లైసెన్సుదారులకు అనుచిత లబ్ధి కలిగేలా గోల్‌మాల్ చేశారంటూ ఆరోపణలొచ్చాయి. వీటికి సంబంధించి ప్రాథమిక సాక్ష్యాధారాలున్నట్టు ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివేదించారు. దాంతో సీబీఐ దర్యాప్తుకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా జూలైలో ఆదేశించారు. పలువురు అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో కొత్త పాలసీని గత నెలలో ఢిల్లీ సర్కారు పక్కన పెట్టింది. ఎఫ్ఐఆర్‌లో ఏముందంటే...

- లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి లేకుండానే లైసెన్సుదారులకు అనుచిత లబ్ధి కలిగే పలు నిర్ణయాలను ఎక్సైజ్ మంత్రి సిసోడియా తీసుకున్నారు.
- కరోనాతో అమ్మకాలు తగ్గాయనే సాకుతో లైసెన్సు ఫీజులో ఏకంగా రూ.144.36 కోట్ల మేరకు రాయితీ ఇచ్చారు.
- లైసెన్స్ ఫీజు రాయితీ/తగ్గింపు, అనుమతి లేకుండానే ఎల్–1 లైసెన్సు పొడిగింపు వంటి నిర్ణయాలు తీసుకున్నారు.
- ఈ గోల్‌మాల్‌లో విజయ్‌నాయర్, మనోజ్ రాయ్, పెర్నాడ్‌రిచర్డ్, అమన్‌దీప్ ధాల్, సమీర్ మహేంద్రు తదితర మద్యం లైసెన్సుదారులు, వ్యాపారుల పాత్ర ఉంది.
- వారి నుంచి సిసోడియా సన్నిహితులకు నుంచి కోట్లలో ముడుపులందాయి. మహేంద్రు వారికి రెండు విడతల్లో కోట్లు చెల్లించారు.
- సిసోడియాకు అతి సన్నిహితులైన అమిత్ అరోరా, దినేశ్ అరోరా, అర్జున్ పాండే వసూళ్లకు పాల్పడ్డారు.
- దినేశ్ అరోరాకు చెందిన రాధా అసోసియేట్స్‌కు మహేంద్రు నుంచి రూ.కోటి అందింది.
- విజయ్ నాయర్ తరఫున మహేంద్రు నుంచి పాండే కూడా రూ.2 నుంచి 4 కోట్ల దాకా వసూలు చేశారు.
- మహేంద్రు నుంచి అరుణ్ రామచంద్ర పిళ్లై లంచాలు వసూలు చేసి నిబంధనల తారుమారుకు సాయపడ్డ ప్రభుత్వాధికారులకు ఇచ్చారు.

పైలట్లు ఇద్దరూ నిద్రపోతే..

అడీస్ అబాబా: ప్రయాణంలో ప్రతిక్షణం అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎయిర్‌పోర్ట్‌లో రన్‌వే పై విమానాన్ని భద్రంగా దించాల్సిన పైలట్లు హాయిగా నిద్రపోయారు. గమ్యస్థానం దాటేసిన తర్వాత విమానంలో అలారం మోగాక హఠాత్తుగా నిద్ర నుంచి మేలుకున్నారు. ఆఫ్రికా ఖండంలోనే అతి పెద్దదైన ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737 ఈటీ343 విమానం ఈ నెల 15వ తేదీన సూడాన్ నుంచి ఇథియోపియాకు బయలుదేరింది. షెడ్యూల్ ప్రకారం అడీస్ అబాబా విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, అందులోని ఇద్దరు పైలట్లు నిద్రలోకి జారుకున్నారు. అడీస్ అబాబాకు చేరుకున్నా లేవలేదు. ఆ సమయంలో విమానం 37,000 అడుగుల ఎత్తున ఆకాశంలో దూసుకెళ్తోంది. రన్ వేపై దిగాల్సిన జాడ లేకపోవడంతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. పైలట్లను సంప్రదించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఫ్లైట్‌లోని అలారం మోగించారు. ఆ శబ్దానికి పైలట్లు కళ్లు తెరిచారు. జరిగిన పొరపాటు గుర్తించారు. అధికారుల సూచనతో విమానాన్ని వెనక్కి మళ్లించి, ఎయిర్‌పోర్ట్‌లో దించారు.

మూడేళ్లలో ఏడు కోట్ల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు



పనాజీ/సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చిన రాష్ట్రాలుగా తెలంగాణ, గోవా నిలిచాయి. గోవా గత మూడేళ్లలో 200 కోట్లకు పైగా ఖర్చుతో 2.63 లక్షల గృహాలకు కుళాయిల ద్వారా నీటి సౌకర్యం కల్పించింది. ఈ సందర్భంగా గోవా ప్రభుత్వం శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మూడేళ్లలో దేశవ్యాప్తంగా ఏడు కోట్ల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చామన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో 10 కోట్ల గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చిన మైలురాయిని చేరుకున్నట్టు వెల్లడించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను జరుపుకుంటున్న ఈ నేపథ్యంలో 52% కంటే ఎక్కువ గ్రామీణ కుటుంబాలకు సురక్షిత మంచినీరు అందుతోందని కేంద్ర జలశక్తి శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 2019 ఆగస్టు 15న ప్రధాని మోదీ జల్ జీవన్ మిషన్‌ను ప్రారంభించినప్పుడు గ్రామాల్లోని 3.23 కోట్ల (16.90%) కుటుంబాలకు మాత్రమే పైపు నీటి కనెక్షన్ అందుబాటులో ఉంది. తెలంగాణ సహా మూడు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో 100% కవరేజీని కలిగి ఉన్నాయి. బహిరంగ మల విసర్జన రహిత రాష్ట్రాల జాబితాలో తెలంగాణ టాప్‌లో ఉంది.

రాహుల్ డైలమా!

కాంగ్రెస్ రథసారథిపై పార్టీలో విస్తృతంగా చర్చ

- రాహుల్ అంగీకరించకపోతే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు
- సోనియా అనారోగ్యం, మన్మోహన్ లాంటి విశ్వసనీయుడు లేకపోవడం అసలైన సవాళ్లు
- ఎన్నికలకు సిద్ధమన్న సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ
- ఆగస్టు 21–సెప్టెంబర్ 20 మధ్య ఎన్నికలు నిర్వహిస్తామని గతంలోనే కాంగ్రెస్ ప్రకటన



రాహుల్ గాంధీ పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తారా? లేదా? ఇప్పుడు కాంగ్రెస్‌లో దీనిపైనే చర్చ నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికలకు ఆ పార్టీ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ సంసిద్ధంగా ఉన్నట్టు ప్రకటించడంతో అందరి దృష్టి రాహుల్ తదుపరి అడుగులపై పడింది. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఆరోగ్య పరిస్థితి రోజురోజుకీ క్షీణిస్తూ ఉండడంతో పార్టీని ముందుకు నడిపించే నాథుడెవరన్న ఆందోళన మొదలైంది. రాహుల్ గాంధీ పగ్గాలు చేపట్టేందుకు ఆసక్తి చూపిస్తారో లేదో ఆయనకు అత్యంత సన్నిహితంగా మెలిగే నాయకులు కూడా చెప్పలేకపోతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 21 సెప్టెంబర్ 20 మధ్య అధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని గత ఏడాది అక్టోబర్‌లో కాంగ్రెస్ ప్రకటించింది. దీంతో సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయానికి నైతిక బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. దీంతో సోనియా గాంధీ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. 2020లో జీ–23 పేరుతో కొందరు సీనియర్ నేతలు అధిష్టానంపై తిరుగుబాటు చెయ్యడంతో సోనియా పదవిని వదులుకోవడానికి సిద్ధపడ్డారు. సీడబ్ల్యూసీ నిర్ణయం మేరకు ఇంకా కొనసాగుతున్నారు.

గాంధీ కుటుంబానికే సారథ్యం

నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ తిరుగులేని శక్తిగా ఎదుగుతూ కాంగ్రెస్ ముక్త భారత్ అని నినదిస్తున్న నేపథ్యంలో గాంధీ కుటుంబమే పార్టీకి రథసారథిగా ఉండాలన్న అభిప్రాయాలు బలపడుతున్నాయి. బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు తెరతీస్తూ ఎదురు తిరిగిన వారిపై సీబీఐ, ఈడీ అస్త్రాన్ని ప్రయోగిస్తోందన్న విమర్శలు ఉన్న నేపథ్యంలో గాంధీ కుటుంబానికి చెందిన వారే పార్టీ పగ్గాలు చేపట్టాలని పార్టీలో అంతర్గతంగా చర్చ నడుస్తోంది. అయితే రాహుల్ గాంధీ మనసులో ఏముందో ఎవరికీ అర్థం కావడం లేదు. అధ్యక్ష పదవిపై ఆయన వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తున్నారు. మరోవైపు బీజేపీ పదే పదే వంశపారంపర్య రాజకీయాలను ఎత్తి చూపిస్తూ ఉండడంతో ఆ తరహా రాజకీయాలపై దేశంలో కొంత వ్యతిరేకత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో మళ్లీ తాను అధ్యక్ష బాధ్యతలు చేపడితే ఆత్మరక్షణలో పడిపోతానని, ఆ పదవి తనని మరింత బలహీనుడిగా మారుస్తుందన్న ఆందోళన రాహుల్ గాంధీలో ఉందని రాజకీయ విశ్లేషకుడు రషీద్ కిద్వాయ్ అభిప్రాయపడ్డారు. ''24 అక్బర్ రోడ్: ఏ షార్ట్ హిస్టరీ ఆఫ్ ది పీపుల్ బిహైండ్ ది ఫాల్ అండ్ రైజ్ ఆఫ్ ది కాంగ్రెస్''తో పాటు పలు పొలిటికల్ పుస్తకాలు రచించిన ఆయన రాహుల్ ఆందోళన సరైనదే అయినప్పటికీ గాంధీ కుటుంబానికి చెందిన వ్యక్తులే సారథిగా ఉంటేనే అధికార పార్టీ వారిని టచ్ చేయడానికి జంకుతుందని అభిప్రాయపడ్డారు. ప్రియాంక గాంధీని అధ్యక్షురాలిగా చేస్తే కాంగ్రెస్‌కి పూర్వ వైభవం వస్తుందని ఇటీవల ఉదయ్‌పూర్ చింతన్ శిబిర్‌లో కొందరు నాయకులు డిమాండ్ చేసినప్పటికీ ఆమె మాత్రం అందుకు సుముఖంగా లేరు.

– సాక్షి, నేషనల్ డెస్క్

రాహుల్ అంగీకరించకపోతే...?

ఒకవేళ రాహుల్ గాంధీ అధ్యక్షుడు అవడానికి సుముఖంగా లేకపోతే సోనియాగాంధీయే అధ్యక్షురాలిగా ఉండి ఆమెకు సహాయంగా కనీసం ముగ్గురు సీనియర్ నాయకుల్ని కార్యనిర్వాహక అధ్యక్ష పదవిలో నియమించాలని కొందరు నాయకులు అభిప్రాయపడుతున్నారు. బయట వారికి పార్టీ పగ్గాలు అప్పగించి రాహుల్ గాంధీ వారికి ఒక గైడ్‌లా వ్యవహరిస్తే కుటుంబ రాజకీయాల విమర్శల నుంచి బయటపడవచ్చునని మరి కొందరి ఆలోచనగా ఉంది. గాంధీ కుటుంబానికి మన్మోహన్ సింగ్ లాంటి అత్యంత నమ్మకమైన నాయకుడి అవసరం కూడా ఉంది. కానీ కాగడా పెట్టి వెతికినా అలాంటి నాయకుడెవరూ కనిపించడం లేదని, ఇప్పుడు పార్టీ ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య అదేనని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ మణీంద్ర నాథ్ ఠాకూర్ అభిప్రాయపడ్డారు.

బయటవారికే ఇస్తే.. ?

గాంధీ కుటుంబం కాకుండా బయట వారు కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాల్సిన పరిస్థితి వస్తుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు మానసికంగా సంసిద్ధులవుతున్నారు. అలాంటప్పుడు పార్టీ పగ్గాలు ఎవరు స్వీకరిస్తే బాగుంటుందన్న చర్చ కూడా మొదలైంది. సీనియర్ నాయకులు డీకే శివకుమార్, మల్లికార్జున ఖర్గే, సుశీల్ కుమార్ షిండే, అశోక్ గెహ్లోట్, కుమారి సెల్జా వంటి నాయకులైతే బాగుంటుందన్న ఊహాగానాలు మొదలయ్యాయి. స్వాతంత్ర్యదినోత్సవం నాడు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో అంబికా సోని జాతీయ జెండాని ఎగురవేయడంతో ఆమె కూడా రేసులో ఉన్నారా అన్న చర్చ సాగుతోంది. సోనియాకి కరోనా సోకడంతో అంబికా సోని జెండా ఎగురవేశారే తప్ప ఆమెకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పని లేదన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. బయటవారు కాంగ్రెస్ పగ్గాలు చేపట్టే పరిస్థితి రాదని, ఎన్నికలొచ్చే సమయానికి రాహుల్‌ని ఒప్పించగమన్న ధీమాలో ఓ వర్గం ఉంది.

ఇక దేశవ్యాప్త ఆందోళనలు

- రైతు ధర్నాలో రాకేశ్ తికాయత్ పిలుపు
- కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని డిమాండ్



లఖీంపూర్ ఖేరీ: పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రాను కేబినెట్ నుంచి తొలగించాలన్న డిమాండ్లతో రైతు సంఘాలు చేస్తున్న ధర్నా రెండో రోజు శుక్రవారం ఉధృతంగా సాగింది. యూపీలోని లఖీంపూర్ ఖేరీ జిల్లాలో రాజాపూర్ మండీ సమితిలో జరుగుతున్న ఈ ధర్నాకు భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) నాయకుడు రాకేశ్ తికాయత్ హాజరయ్యారు. తమ డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్త నిరసనలకు రైతులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నాయకులు దేశవ్యాప్త నిరసనలు ఎక్కడ, ఎప్పుడు చేపట్టాలో త్వరలోనే నిర్ణయిస్తారని తెలిపారు. వివిధ రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చాను మరింత బలోపేతం చేయాలన్నారు. రైతు సంఘాలన్నీ ఎలాంటి విభేదాలు లేకుండా ఒక్కతాటిపైకి వచ్చి కేంద్రం మెడలు వంచాలన్నారు. ధర్నా చేస్తున్న రైతులపై వాహనాన్ని నడిపి నలుగురు రైతుల నిండు ప్రాణాల్ని బలిగొన్నాడని కేంద్ర మంత్రి అజయ్ కుమార్ కుమారుడు ఆశిష్ మిశ్రా ఆరోపణలెదుర్కొంటున్న విషయం తెలిసిందే. అజయ్ కుమార్ మిశ్రాను మంత్రి మండలి నుంచి తప్పించడం, పంటలకు కనీస మద్దతు ధరను కల్పిస్తూ చట్టం చేయాలన్న డిమాండ్లపై రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా ఆందోళన చేస్తామని రాకేశ్ తికాయత్ స్పష్టం చేశారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 20 । ఆగస్టు । 2022



కృష్ణుని వెండి విగ్రహం వితరణ

గంపలగూడెం: నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి శుక్రవారం తెలంగాణకు చెందిన పుచ్చకాయల పుల్లారెడ్డి దంపతులు 1.139 కిలోల కృష్ణుని వెండి విగ్రహాన్ని వితరణగా అందజేశారు.



దుర్గమ్మ సేవలో స్పీకర్ తమ్మినేని

ఇంద్రకీలాద్రి: రాష్ట్ర శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు శుక్రవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో భ్రమరాంబ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు బహూకరించారు.



కృష్ణానదిలో ముగ్గురు గల్లంతు

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో కృష్ణా నదిలో ముగ్గురు గల్లంతయ్యారు. ఈ రెండు ఘటనల్లో ఏడుగురు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. -8లో▶

న్యూస్‌రీల్

'స్పాట్'కు రాకుంటే జరిమానా

మచిలీపట్నం: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ స్పాట్ వాల్యూయేషన్ విధులకు హాజరుకాని అధ్యాపకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐవో పెదపూడి రవికుమార్ హెచ్చరించారు. విధులకు హాజరుకాని అధ్యాపకుల జాబితాతో కూడిన ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు. స్పాట్ వాల్యూయేషన్ సకాలంలో పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. కానీ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని కొన్ని ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు అధ్యాపకులను పంపించటం లేదన్నారు. ఇలాంటి వారిని గుర్తించి, నోటీసులు ఇస్తున్నామన్నారు. శనివారం విధులకు హాజరుకాకుండా ఉంటే సదరు కాలేజీ యాజమాన్యాలకు నిబంధనల మేరకు రూ. 10 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఎన్టీఆర్ జిల్లాలో 162.8 మిల్లీమీటర్ల వర్షపాతం



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): జిల్లాలో 162.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటు వర్షపాతం 8.14 మిల్లీ మీటర్లుగా నమోదైంది. జిల్లాలో అత్యధికంగా కంచికచర్ల మండలంలో 35.0 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. జి. కొండూరు మండలంలో 22.6 మిల్లీమీటర్లు, వీరులపాడు మండలంలో 21.2 మిల్లీమీటర్లు, నందిగామలో 20.8, విసన్నపేటలో 13.6, జగ్గయ్యపేటలో 7.8, ఇబ్రహీం పట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో 6.4 మిల్లీమీటర్ల చొప్పున, విజయవాడ అర్బన్‌లోని నాలుగు మండలాల్లో 5 మిల్లీమీటర్ల చొప్పున, మైలవరం 3.2, పెనుగంచిప్రోలు 2.2, రెడ్డిగూడెం 2.0, చందర్లపాడు 2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయుడు సస్పెన్షన్

గంపలగూడెం(తిరువూరు): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గంపలగూడెం మండలం గాదెవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఇరువురు ఉపాధ్యాయులను ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం కె. కృష్ణయ్య, ఉపాధ్యాయుడు కె. హరికృష్ణ లెసన్ ప్లాన్, ఉపాధ్యాయుల డైరీ సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. అలాగే గత ఏడాది 70 మంది విద్యార్థులతో ఉన్న ఆ పాఠశాలలో ఈ ఏడాది ఒక్కరు మాత్రమే హాజరవుతున్నప్పటికీ ఉన్నతాధికారులు తెలియపర్చలేదని.. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను స్థానిక ప్రజా ప్రతినిధులకు ఆహ్వానించకుండానే ఎగురవేశారని చెప్పారు. ఈ కారణాలతో ఈ ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ వివరించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పంపిణీ విషయంలో కూడా వీరివురు అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.

ఊరంతా బృందావనం







బాల గోపాలా.. ముకుందా.. మురళీగానలోలా.. మురారీ.. రారా మము దీవించ మా ఇంటికి.. అంటూ భక్తలోకం ప్రార్థించింది. ముద్దులు మూటగట్టిన మురిపాల కన్నయ్యను చూసి పరవశించిపోయింది. గోకులంలో కేరింతలు కొట్టిన లీలా వినోదుడిని భక్తిశ్రద్ధలతో పూజించింది. భక్తిభావాన్ని మించిన అనురాగంతో అల్లరి కృష్ణయ్యను తలచుకుని మురిసిపోయింది. జిల్లా వ్యాప్తంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా జరిగిన కార్యక్రమాలతో ఆధ్యాత్మిక సుగంధాలు గుబాళించాయి. ఉట్టి సంబరాల్లో యువత ఉత్సాహంగా పాల్గొంది. కొన్నిచోట్ల బాలకృష్ణులు, బుల్లి గోపికమ్మల వేషధారణతో చిన్నారులు చూడముచ్చటగొలిపారు. విజయవాడ రామలింగేశ్వరనగర్ ఇస్కాన్ టెంపుల్‌లో కృష్ణాష్టమి వేడుకల దృశ్యమాలిక ఇది. - సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

కొనసాగుతున్న ఉమెన్ గేమ్స్ మీట్

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 22వ ఇంటర్ కళాశాలల ఉమెన్ గేమ్స్ మీట్ రెండో రోజు శుక్రవారం కొనసాగింది. బాల్ బ్యాడ్మింటన్‌లో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, ఆశ్రం మెడికల్ కళాశాల జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. టేబుల్ టెన్నిస్‌లో చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా నాగేశ్వరరావు సిద్ధార్థ డెంటల్ కళాశాల సిబార్ డెంటల్ కళాశాలపై, రాజమండ్రి జీఎస్ఎల్ డెంటల్ కళాశాల నెల్లూరు నారాయణ డెంటల్ కళాశాలపై విజయం సాధించాయి. వాలీబాల్‌లో సెయింట్ జోసఫ్ డెంటల్, విజయనగరం మహారాజా మెడికల్ కళాశాల ఫైనల్స్‌కు చేరుకున్నాయి. క్రీడలను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి పర్యవేక్షించారు.



త్రోబాల్‌లో పోటీ పడుతున్న గుంటూరు ఎన్ఆర్ఐ, కాటూరు మెడికల్ కళాశాలల జట్లు

త్రీమెన్ నివేదిక.. తప్పుల తడక

- తప్పేకొద్దీ లోపాలు బహిర్గతం
- డిగ్రీ కళాశాలల్లో కానరాని మౌలిక వసతులు
- అయినప్పటికీ అంతా సక్రమమని త్రీమెన్ కమిటీ నివేదికలు
- తప్పుబట్టిన ఉన్నత విద్యా మండలి అధికారులు
- 39 డిగ్రీ కాలేజీలకు నోటీసులు జారీ



మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని చాలా కాలేజీల్లో సరైన మౌలిక వసతులు, అర్హత గల ఫ్యాకల్టీ లేకుండానే నిర్వహిస్తున్నట్లు బహిర్గతమైంది. ఇలాంటి వాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ వర్సిటీ అఫిలియేషన్ ఇవ్వడానికి వీల్లేదని ఉన్నత విద్యా మండలి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వటంతో దీనిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. వర్సిటీ పరిధిలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో డిగ్రీ కోర్సులు నిర్వహించే 120 కాలేజీలకు గుర్తింపు ఉండగా, వీటిలో గతేడాది 101 కాలేజీల నిర్వహణకు అనుమతులు ఇచ్చారు. 2022–23 విద్యా సంవత్సరంలో డిగ్రీకాలేజీల నిర్వహణ కోసం ఈ సారి పకడ్బందీగా తనిఖీలు చేపట్టారు. త్రీమెన్ కమిటీతో పాటు, కాలేజీల నిర్వాహకులు మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలతో నిశిత పరిశీలన చేశారు. యూనివర్సిటీ పరిధిలో ఏకంగా 39 కాలేజీల్లో నిబంధనలు పాటించలేదని వెల్లడైంది. వీటి నిర్వాహకులకు తాజాగా నోటీసులు జారీ చేశారు.

అసలు ఏం జరిగిందంటే..

విద్యార్థులకు వసతులు, నాణ్యమైన విద్యాబోధన లక్ష్యంగా 2022–23 విద్యా సంవత్సరానికి డిగ్రీ కాలేజీలకు అఫిలియేషన్ ఇచ్చే క్రమంలో ఉన్నత విద్యా మండలి కాలేజీల్లో తనిఖీల కోసం 'త్రీమెన్ కమిటీ'లను ఏర్పాటు చేసింది. వర్సిటీ సీనియర్ అధ్యాపకులతో ఏర్పడిన ఈ కమిటీ కాలేజీ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువీకరణ పత్రాల మేరకు వాస్తవికతను పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలి. వీరు అంతా బాగున్నట్లు నివేదికలిచ్చారు.

వాస్తవం మరోలా..

అయితే కాలేజీ యాజమాన్యాలు వరుసగా మూడేళ్ల పాటు ఆన్‌లైన్‌లో పొందుపరిచిన అంశాలతో బేరీజు వేసిన ఉన్నత విద్యామండలి అధికారులు, త్రీమెన్ కమిటీ నివేదికలతో పొంతన లేకపోవటాన్ని గుర్తించారు. వర్సిటీ పరిధిలో ఏకంగా 39 డిగ్రీ కాలేజీల్లో నిబంధనలు పాటించలేదని నిర్ధారించారు. అర్హత గల ఫ్యాకల్టీ లేకపోవటం, ఆట స్థలం, లైబ్రరీ, పార్కింగ్ స్థలం లేకున్నా ఆన్‌లైన్‌లో మాత్రం అవన్నీ బాగానే ఉన్నట్లుగా చూపించటం, కోర్సులకు అనుగుణంగా ప్రయోగశాలలు లేని విషయాన్ని తనిఖీ బృందాలు వాస్తవ నివేదికలో చూపకపోవటాన్ని ఉన్నత విద్యా మండలి తీవ్రంగా పరిగణిస్తోంది. ఇలా ఎందుకు జరిగిందని తెలుసుకునే క్రమంలో నిర్లక్ష్యంగా తనిఖీలు చేసిన త్రీమెన్ కమిటీలకు సైతం నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

రంగంలోకి వీసీ, రిజిస్ట్రార్..

త్రీమెన్ కమిటీ నివేదికల్లో లోపాలను ఉన్నత విద్యా మండలి ఎత్తిచూపటంతో అసలేం జరిగిందనేది తెలుసుకునేందుకు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కేబీ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రామిరెడ్డి రంగంలోకి దిగారు. గత నాలుగు రోజులుగా మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ ఏరియాల్లోని పన్నెండు డిగ్రీ కాలేజీలను పరిశీలించారు. త్రీమెన్ కమిటీ ఇచ్చిన నివేదికకు భిన్నంగా నాలుగు కాలేజీల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో వర్సిటీ పరిధిలో నోటీసులు జారీ చేసిన 31 డిగ్రీ కాలేజీలను మరోదఫా పూర్తిస్థాయిలో తనిఖీలు చేసేందుకు నిర్ణయించారు.

మొదటి కౌన్సెలింగ్‌కు అఫిలియేషన్ డౌటే..

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 22 నుంచి విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేలా ముందుగా ప్రకటించిన షెడ్యూల్‌ను, తాజా పరిణామాలతో ఉన్నత విద్యా మండలి దీనిని సెప్టెంబర్ 6కు వాయిదా వేసింది. అఫిలియేషన్ ఇచ్చే క్రమంలో నోటీసులు జారీ చేసిన కాలేజీలను ఈ నెలాఖరులోగా మరోదఫా పూర్తిస్థాయి పరిశీలన చేసేందుకు వర్సిటీ అధికారులు నిర్ణయించారు. నోటీసులు అందుకున్న కాలేజీల్లో మొదటి విడత కౌన్సిలింగ్‌కు అనుమతి ఇస్తారా? లేదా అనేది వర్సిటీ వర్గాలు, డిగ్రీ కాలేజీల యాజమాన్యాల్లో సర్వత్రా చర్చసాగుతోంది.

కఠినంగా వ్యవహరిస్తాం..



ఉన్నత విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. క్రమం తప్పకుండా విద్యా, వసతి దీవెన పథకాలు మంజూరవుతున్నాయి. అయినా కాలేజీల్లో సరైన వసతులు, అర్హత గల ఫ్యాకల్టీ లేకుంటే ఎలా? విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. నిబంధనలు పాటించని కాలేజీలపై కఠినంగానే వ్యవహరిస్తాం. – కేబీ చంద్రశేఖర్, వైస్ చాన్స్‌లర్, కృష్ణా వర్సిటీ

ఒక భవనం.. 31 కోర్టులు

- విజయవాడలో ముస్తాబైన సిటీ సివిల్ కోర్టుల భవన సముదాయం
- నేడు సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- హాజరు కానున్న ఏపీ సీజే ప్రశాంత్ కుమార్ మిశ్రా, సీఎం వైఎస్ జగన్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



విజయవాడ లీగల్: న్యాయవాదులు, కక్షిదారులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విజయవాడ సిటీ సివిల్ కోర్టుల బహుళ అంతస్తుల భవనం శనివారం నుంచి అందుబాటులోకి రానుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ చేతుల మీదగా ఉదయం 9.00 గంటలకు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నారు. అలాగే హైకోర్టు జడ్జిలు జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ కొంగర విజయ లక్ష్మి, జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ వీఆర్‌కే కృపా సాగర్, జస్టిస్ వి.శ్రీనివాస్, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) అధ్యక్షుడు చంద్రగిరి విష్ణు వర్ధన్ పాల్గొనున్నారు.

2013లో శంకుస్థాపన..

2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టుల బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులిచ్చింది. 2013, మే 13న అప్పటి ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి హోదాలో ఎన్వీ రమణ భూమి పూజ చేశారు. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వం పనులను సరిగా నిర్వహించలేకపోయింది. వైఎస్సార్ ప్రభుత్వం పనులపై దృష్టి పెట్టి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంది.

ఎనిమిది ఫ్లోర్లు.. 31 కోర్టులు..

రూ. 100 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మితమైన బహుళ అంతస్తు భవనంలో మొత్తం ఎనిమిది ఫ్లోర్లు ఉన్నాయి. ఒక్కో ఫ్లోర్‌లో నాలుగు కోర్టులు ఏర్పాటు చేశారు. ఒక్క ఫ్లోర్‌లో మాత్రం కోర్టు బదులు ప్రత్యేకంగా సమావేశ మందిరం ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం 31 కోర్టులు ఒకే చోట అందుబాటులోకి వస్తున్నాయి. దీంతోపాటు ప్రతి ఫ్లోర్‌లో ఒక మినీ క్యాంటీన్, న్యాయవాదులకు (మహిళలకు, పురుషులకు వేర్వేరుగా) విశ్రాంత గదులు, రికార్డు రూం, కాపీయిస్టు విభాగం, లిఫ్టులు న్యాయమూర్తులకు, న్యాయవాదులకు విడివిడిగా ఏర్పాటు చేశారు.



వేడుక నిర్వహణకు ముస్తాబైన స్టేజి

తొమ్మిదేళ్ల కష్టాలకు చెక్..

కోర్టుల నిర్మాణ పనులు మొదలైన తర్వాత కొన్ని కోర్టులు ఏలూరు రోడ్ దగ్గర, మరి కొన్ని కోర్టులు బీసెంట్ రోడ్‌లో, ఇంకొన్ని ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో, ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేశారు. న్యాయవాదులు, కక్షిదారులు ఆ కోర్టుకు, ఈ కోర్టులకు తిరగలేక ఎనిమిది సంవత్సరాలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు అన్నీ కోర్టులు ఒకే చోట ఉండటంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆకాశమే హద్దు

విభిన్న క్రీడల్లో.. విజయ విహారం

కంటి చూపు సరిగా లేదు.. అయినా ఆమె చెస్‌లో క్వీన్. రెండు చేతులూ లేవు.. అయినా అతడు ఫుట్‌బాల్‌లో కింగ్‌మేకర్. రెండు కాళ్లూ లేవు.. అయినా అతడు స్విమ్మింగ్‌లో స్వీప్ చేసేయగలడు. ఇలా 'దివ్య'మైన ప్రతిభతో సత్తా చాటుతున్నారు విజయవాడకు చెందిన విభిన్న ప్రతిభావంతులు. వారికున్న వైకల్యాన్ని చూసి కృంగి పోకుండా.. దానిని అధిగమిస్తూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై విజయ విహారం చేస్తున్నారు. అనేకమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. – విజయవాడ స్పోర్ట్స్

దృష్టి లోపానికి చెక్..



విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన జి. హేమలతకు పుట్టుకతోనే కంటి చూపు లోపం ఉంది. ప్రస్తుతం ఈమె మేరీస్ స్టెల్లా కాలేజీలో డిగ్రీ చదువుతోంది. చదరంగం నేర్చుకోవాలనే తన కోరికను తల్లిదండ్రుల వద్ద తన 14 ఏట బయటపెట్టింది. వెంటనే ఆమె తల్లిదండ్రులు ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీలో శిక్షణ ఇప్పించారు. పట్టుదలతో శిక్షణ తీసుకుని అతికొద్ది నెలల్లోనే జిల్లా స్థాయిలో పతకం పట్టింది. కోచ్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ అదే ఏడాది రాష్ట్ర స్థాయిలో పతకం సొంతం చేసుకుంది. గత ఏడాది జరిగిన జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈ ఏడాది జరిగిన దక్షిణ భారత అంతర్ యూనివర్సిటీ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంది. పలు అంతర్జాతీయ క్రీడల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించి.. ఇంటర్ నేషనల్ 1345 ఫిడే రేటింగ్‌ను సొంతం చేసుకుంది.

చేతులు లేకపోయినా స్కిల్ ఫుల్..



విజయవాడ న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన కె. దుర్గారావు ఫుట్‌బాల్ క్రీడల్లో రాణిస్తున్నాడు. తన చిన్నతనంలో జరిగిన ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయిన దుర్గారావు తన 12వ ఏట నుంచి ఫుట్‌బాల్ క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. కఠోర శిక్షణ తీసుకుని 26వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు, 25 అంతర్ జిల్లాల పోటీలకు ప్రాతినిధ్యం వహించాడు. కృష్ణా యూనివర్సిటీ జట్టులో స్థానం దక్కించుకుని మూడు యూనివర్సిటీ జాతీయ స్థాయి పోటీలతో పాటు మూడు జాతీయ పోటీల్లో పాల్గొని మొత్తం 30 పతకాలు సాధించాడు. 2015లో జరిగిన ఫిఫా ప్రపంచ చాంపియన్‌షిప్‌కు జెమినీ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అప్పట్లో ఈ జట్టు మూడో స్థానాన్ని సాధించింది. దుర్గారావు ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. 2019లో స్పోర్ట్స్ కోటాలో తనకు ఉద్యోగం ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా దుర్గారావు కృతజ్ఞతలు తెలిపారు.

నిలబడలేకపోయినా ఈజీగా ఈత..



విజయవాడ గాంధీనగర్‌కు చెందిన కె. లక్ష్మణరావు అంతర్జాతీయ స్విమ్మింగ్ క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. వీల్‌చైర్ సాయంతోనే ప్రయాణించే ఈయనను ఈత పోటీల్లో ఓడించేవారు అరుదుగా ఉంటారు. కృష్ణానదిని ఈదడమంటే ఈయనకు అత్యంత సరదా. ప్రతి సోమవారం నదిని ఈదుతుంటాడు. గడిచిన ఆరేళ్లలో 15 జాతీయ స్థాయి పారా పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించాడు. 2022లో జరిగిన జాతీయ పోటీల్లో ఫ్రీ స్టయిల్ 50 మీటర్ల విభాగంలో బంగారు పతకం, 100 మీటర్ల విభాగంలో బంగారు పతకం, బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్ల విభాగంలో బంగారు పతకం సాధించారు. ప్రస్తుతం ఈయన గాంధీనగర్‌లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో కోచ్‌గా పని చేస్తున్నాడు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్

పాస్టర్లకు గౌరవ వేతనంపై ఏపీపీఎఫ్ హర్షం

సాక్షి, అమరావతి: పాస్టర్లకు గౌరవ వేతనం విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్(ఏపీపీఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. విజయవాడలోని స్టేట్ గెస్ట్ హౌస్ వద్ద పాస్టర్ ఫెడరేషన్ ప్రతినిధులు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఏపీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రభాకరరావు, పి.జీవన్‌కుమార్, రాష్ట్ర సలహాదారులు పెరికే వరప్రసాదరావు, జేమ్స్, సంయుక్త కార్యదర్శి జి.అరుల్ అరుసు, కోశాధికారి పి.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో అర్చకులకు, ఇమామ్‌లకు, మౌలాలకు, పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. సీఎం వైఎస్ జగన్, ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాకు పాస్టర్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో క్రైస్తవుల సమస్యలైన బరియల్ గ్రౌండ్ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఏపీ క్రిస్టియన్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్‌తో 'అప్టెసా' సభ్యులు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన నాగరాణిని శుక్రవారం విజయవాడ నగరంలోని ఆమె చాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ అసోసియేషన్ (అప్టెసా) సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. అప్టెసా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పీబీకే మోహనరావు, సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ (ఏవో) ఉద్యోగోన్నతులకు అర్హులైన వారిని గుర్తించి ఈ నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేస్తామని.. అలాగే 1:8 రేషియో సమస్యను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని నాగరాణి హామీ ఇచ్చారని అన్నారు. సంఘం సభ్యులు విజయకుమారి, రామ్‌ప్రసాద్, వెంకట్రావు, బేగ్ డైరెక్టర్ నాగరాణిని కలిసిన వారిలో ఉన్నారు.

ఆస్పత్రిలో ఉద్యోగి వీరంగం

- దేహశుద్ధి చేసిన రోగి బంధువులు
- విచారణకు ఆదేశించిన సూపరింటెండెంట్

మచిలీపట్నం: మచిలీపట్నంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఓ ఉద్యోగి గురువారం రాత్రి వీరంగం సృష్టించాడు. అతని చేష్టలను సహించలేని రోగి బంధువులు దేహశుద్ధి చేశారు. ఆస్పత్రి క్యాజువాల్టీ వద్ద జరిగిన ఈ ఘటన వైద్యవిధానపరిషత్ అధికారుల దృష్టికి వెళ్లింది. ఆస్పత్రి వర్గాల కథనం మేరకు.. క్యాజువాల్టీ వద్ద విధుల్లో ఉన్న ఉద్యోగి కొలుసు నాగేశ్వరరావు అక్కడికి వచ్చిన వారందరినీ తన సెల్‌ఫోన్‌తో ఫొటోలు, వీడియోలు తీస్తున్నాడు. అదే సమయంలో ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి బంధువైన మచిలీపట్నం ఖాలేఖాన్‌పేటకు చెందిన మహిళ ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే ఆమె మృతి చెందటంతో బంధువులు భోరున విలపిస్తున్న దృశ్యాలను కూడా క్యాజువాల్టీ వద్ద ఉన్న ఉద్యోగి కొలుసు నాగేశ్వరరావు నాగేశ్వరరావు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. అతడిని గమనించిన మృతురాలి బంధువులు ఆగ్రహించారు. కిందపడేసి, చెప్పులతో కొట్టి, కాళ్లతో తన్ని దేహశుద్ధి చేశారు. అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది స్పందించి నాగేశ్వరరావును దూరంగా తీసుకెళ్లారు. ఈ దాడిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆర్‌ఎంఓ డాక్టర్ మల్లికార్జున్‌ను ఆదేశించామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.జయకుమార్ తెలిపారు.

ఏలూరు కాలువలో వృద్ధుడు గల్లంతు


దాసు(ఫైల్)

ఉంగుటూరు (గన్నవరం): ఏలూరు కాలువలో ఓ వృద్ధుడు గల్లంతైన ఘటన ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గన్నవరం మండలం బల్లిపర్రు గ్రామానికి చెందిన కొక్కిలగడ్డ దాసు (64)కు ఇద్దరు కుమారులు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం, కానూరులో నివసిస్తున్న చిన్న కొడుకు కృపాకర్ వద్ద దాసు తన భార్యతో కొన్నేళ్లుగా ఉంటున్నాడు. పెద్ద కుమారుడు రవి కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు కుటుంబ సభ్యులతో కలసి దాసు ఈ నెల 16వ తేదీన పొట్టిపాడు వెళ్లారు. శుక్రవారం ఉదయం గ్రామంలోని ఏలూరు కాలువలో దుస్తులు ఉతికే రేవు వద్ద స్నానం చేసేందుకు దాసు కాలువలోకి దిగాడు. ప్రమాదవశాత్తూ నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. ఎస్‌ఐ కిశోర్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో వృద్ధుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కృష్ణానదిలో ముగ్గురు గల్లంతు

- కోసూరువారిపాలెం వద్ద ఇద్దరు యువకులు, పవిత్ర సంగమం వద్ద మరో విద్యార్థి గల్లంతు
- రెండు ఘటనల్లో ఏడుగురు క్షేమం
- గాలింపు చర్యలు చేపట్టిన ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, పోలీసులు


పవిత్ర సంగమం వద్ద గల్లంతైన లోకేష్ కోసం గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది


దొప్పలపూడి లోకేష్ (ఫైల్)


అనంత్ (ఫైల్)


భోరున విలపిస్తున్న లోకేష్ తల్లి నాగలక్ష్మి

ఇబ్రహీంపట్నం/మోపిదేవి: ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో కృష్ణా నదిలో ముగ్గురు గల్లంతయ్యారు. రెండు ఘటనల్లో ఏడుగురు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం కోసూరువారిపాలెం వద్ద ఎడ్ల బండిని కడగటానికి శుక్రవారం మధ్యాహ్నం కృష్ణానదిలోకి కాగితాల అనంత్ (22), మేకా వెంకటేష్ (20), ఎనికే వివేక్, కాగితాల వంశీధర్ దిగారు. వరద ఉధృతి, గుంతల వల్ల ఆ నలుగురు కొట్టుకుపోయారు. వివేక్, వంశీధర్‌కు ఈత రావడంతో ఈదుకుంటూ నదిలో ఉన్న దిబ్బలకు చేరుకున్నారు. స్థానికులు పడవ సాయంతో వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. అనంత్, వెంకటేష్ గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్, రెవెన్యూ సిబ్బంది మత్స్యకారుల సాయంతో గాలిస్తున్నారు.

పవిత్ర సంగమం వద్ద విద్యార్థి..

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన దొప్పలపూడి లోకేష్(13), ఈపూరి తరుణ్, పుప్పాలపాటి అవినాష్, మేడూరు సుమంత్, టి.హర్షవర్ధన్, చెరుకు సిద్ధార్థ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. కృష్ణాష్టమి పండుగ సెలవు కావడంతో శుక్రవారం ఉదయం 6.30 గంటలకల్లా సైకిళ్లపై సంగమం వద్ద స్నానం చేసేందుకు వచ్చారు. ఆరుగురు నదిలోకి దిగి స్నానం చేస్తుండగా లోకేష్, సిద్ధార్థ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. మిగిలిన స్నేహితులు భయంతో కేకలు వేయడంతో ఆ సమీపంలో వాకింగ్ చేస్తున్న రాయపూడి టోనీప్రజీత్, చింతల చిట్టిబాబు స్పందించారు. టోనీ ప్రజీత్ నీటిలోకి దిగి సిద్ధార్థను రక్షించాడు. ఒడ్డుకు సమీపంలో ఉన్న నలుగురిని చిట్టిబాబు బయటకు చేర్చాడు. దొప్పలపూడి లోకేష్ వరద ఉధృతిలో గల్లంతయ్యాడు. ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కృష్ణానదిలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న లోకేష్ తల్లిదండ్రులు దొప్పలపూడి నాగలక్ష్మి, యోహాన్ ఘటనాస్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఏడీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ హనుమంతరావు, సీఐ పి.శ్రీను, జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, పాలడుగు దుర్గాప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ మునగాల శివారెడ్డి, లంకే అంకమోహనరావు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్లతో పడవల ద్వారా నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. లోకేష్ తల్లి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య

నిమ్మకూరు (పామర్రు): ఓ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పామర్రు మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గూడూరు మండలం మద్దిపట్ల గ్రామానికి చెందిన మెరుగు ప్రశాంత్ (18) పాలిటెక్నిక్ చదువుతున్నాడు. అతనికి తరచుగా తీవ్రంగా తలనొప్పి రావడంతో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నాడు. దీంతో మనస్తాపం చెందిన ప్రశాంత్ పామర్రు మండలంలోని నిమ్మకూరు, నిభానుపూడి గ్రామాల మధ్య ఉన్న నాగులేరు కాలువ గట్టున ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ అవినాష్ తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ బలవన్మరణం

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి చెందిన పరిశపోగు ఇందు (23)కు అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన లావణ్యకుమార్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. లావణ్యకుమార్ రాడ్ బెండింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం రాత్రి 11 గంటలకు అతను మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో భార్యాభర్తల మధ్య వాగ్వివాదం జరిగింది. భర్త ప్రవర్తనతో విసిగిపోయిన ఇందు ఇంటి లోపలికి వెళ్లి గడియ పెట్టుకుని చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. లావణ్యకుమార్, అతని బంధువులు ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఇందు చనిపోయినదని వైద్యులు చెప్పడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ఈ సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ సీఐ ఎస్.వి.వి.లక్ష్మీనారాయణ సిబ్బందితో ఘటనా స్థలాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, ఇందు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇందు మృతి సమాచారాన్ని భద్రాచలంలో నివసిస్తున్న ఆమె తల్లికి తెలియజేశారు.

నదిలోకి దూకిన వృద్ధుడు!

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వృద్ధుడు కృష్ణా నదిలోకి దూకినట్లు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా పెద్రమడి గ్రామంలో ఆలివార్ రంగయ్య కుటుంబం నివసిస్తోంది. గురువారం గుర్తు తెలియని వ్యక్తి రంగయ్యకు ఫోన్ చేసి ఓ వృద్ధుడు తన ఫోన్, దుస్తుల సంచిని ప్రకాశం బ్యారేజీ 56వ కానా వద్ద ఉంచి కృష్ణానదిలోకి దూకినట్లు చెప్పాడు. దీంతో రంగయ్య విజయవాడ చేరుకొని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రి చెంచునారాయణ శెట్టి (80) తన వద్దనే ఉంటున్నారని, కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి కలిగిందని చెప్పేవాడని రంగయ్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దుర్గమ్మ దర్శనం కోసం విజయవాడ వచ్చిన తన తండ్రి ఫోన్ నుంచి నదిలోకి దూకినట్లు గుర్తు తెలియని వ్యక్తి చెప్పాడని పేర్కొన్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో దూకి భార్యాభర్తల ఆత్మహత్య


తిరపతిరావు, కుసుమ మృతదేహాలు

జి.కొండూరు (మైలవరం): మండలంలోని గడ్డమణుగు గ్రామ శివారులో ఉన్న పులివాగులో దూకి భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. జి.కొండూరు మండలం మునగపాడు గ్రామానికి చెందిన పణితి తిరుపతిరావు(32)కు విజయవాడకు చెందిన కుసుమ (28)తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. తిరుపతిరావు గుంటుపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం గొల్లపూడిలోని బంధువుల ఇంట్లో వివాహ కార్యక్రమానికి హాజరైన తిరుపతిరావు, కుసుమ సాయంత్రం సమయంలో మునగపాడు గ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. రాత్రి ఏడు గంటల సమయంలో గడ్డమణుగు గ్రామ శివారులోని పులివాగు వద్దకు చేరుకున్నారు. అనంతరం ద్విచక్రవాహనాన్ని వంతెనపై ఉంచి భార్యాభర్తలు ఇద్దరూ వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో ఇద్దరి మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం కోసం తరలించారు. వారి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

పక్కాగా పంట లెక్క


పొలాల్లో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

- ముమ్మరంగా 'ఈ-క్రాప్' నమోదు
- సెప్టెంబర్ 5వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 47,661 ఎకరాల్లో పంటల నమోదు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. గ్రామాల్లో వీఆర్వో, వ్యవసాయ సహాయకులు, సర్వే అసిస్టెంట్ల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ-క్రాప్ నమోదు సాగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఖరీఫ్‌లో సాగైన పంటల వివరాలను సెప్టెంబర్ ఐదో తేదీ నాటికి పూర్తిస్థాయిలో నమోదు చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కృష్ణా జిల్లాలో సాధారణ సాగు విస్తీరణం 4,15,641.4 ఎకరాలు. ఇప్పటి వరకు 3,61,925 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి.

జేసీల పర్యవేక్షణలో..

జిల్లాలో పంట నమోదు ప్రక్రియ నాలుగు రోజులుగా సాగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి 29,835 ఎకరాల్లో 10,456 మంది రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను పక్కాగా నమోదు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2,35308.83 ఎకరాలు. ఇప్పటి వరకు 1,75,000 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. 17,826 ఎకరాల్లో 6,023 మంది రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను అధికారులు నమోదు చేశారు. అన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ప్రతి రైతూ తాను సాగు చేస్తున్న పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో జాయింట్ కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను రోజూ పర్యవేక్షిస్తున్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పని సరి

ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్ట పరిహారం పొందాలంటే ఈ-క్రాప్ నమోదు ఉపయోగపడుతుంది. ప్రభుత్వం అందించే అన్ని రకాల రాయితీలు పొందేందుకు, పంటల విక్రయాలకు ఈ-క్రాప్‌నే అధికారులు ప్రాతిపదికగా తీసుకొంటారు. జిల్లాలో ఇప్పటికే ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో రైతులు పండించే ప్రతి పంటను కచ్చితంగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పంట నమోదు ప్రక్రియ పూర్తయిన తరువాత రైతులు పరిశీలించుకొని, పొరపాట్లను సరిదిద్దుకొనే అవకాశం కల్పిస్తున్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో సామాజిక తనిఖీ నిమిత్తం ఈ-క్రాప్ నమోదు జాబితాలను గ్రామ/వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించనున్నారు.

రైతులు సహకరించాలి



ఈ- క్రాప్ నమోదును సకాలంలో పూర్తి చేసేందుకు రైతులు సహకరించాలి. తాము సాగు చేస్తున్న పంటల వివరాలు సరిగా నమోదైనదీ లేనిదీ పరిశీలించి నిర్ధారణ చేసుకోవాలి. ఏవైనా తప్పులు ఉంటే సరిచూసుకొన్న తరువాతనే బయోమెట్రిక్ వేయాలి. పంట నమోదు సమయంలో దొర్లిన పొరపాట్లను సరిచేయకుంటే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపరిహారంలో ఇబ్బందులు తప్పవు. పరిహారంపై రైతులు ప్రశ్నించే హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. రైతులు అప్రమత్తంగా ఉండి పంట నమోదును జాగ్రత్తగా చేయించుకోవాలి.

-విజయభారతి, ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి

గడప గడపకు..

అవనిగడ్డ: మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు తమ పార్టీని మరోసారి ఆదరించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రజల్ని కోరారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ పంచా యతీ పరిధిలోని 2వ వార్డు బీసీ కాలనీలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.





జగ్గయ్యపేట: రాష్ట్ర ప్రభుత్వం కుల మతాలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో తోడ్పడుతున్నాయని ప్రజలు చెబుతున్నారని జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అన్నవరంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరును ఆరా తీశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): 33 కేవీ భవానీపురం విద్యుత్ ఉపకేంద్రం భవానీపురం సెక్షన్ పరిధిలో మరమ్మతులు, మెయింటినెన్స్ నిమిత్తం శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ సీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ట్రాంబ్వే రోడ్డు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, ఐరన్ యార్డ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

రెండు టన్నుల కూరగాయల వితరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): కృష్ణాష్టమి సందర్భంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించే మూడు రోజుల పండుగలో జరిగే అన్నదాన కార్యక్రమానికి కూరగాయలు పంపించడం పూర్వజన్మ సుకృతమని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనేకుల వీర వెంకట సత్యనారాయణ అన్నారు. బృందావన కాలనీలోని ఎ కన్వెన్షన్ నుంచి శుక్రవారం ఇస్కాన్ అన్నదాన కార్యక్రమానికి మండవ కుటుంబరావు ఆధ్వర్యంలో రెండు టన్నుల కూరగాయలను పంపించారు. మండవ కాశీ అన్నపూర్ణ జ్ఞాపకార్థం అవరపల్లి దేవకిదేవి, అరవపల్లి శేష సాయివర్మ–కావ్య, అరవపల్లి ఆదిత్య– మండవ సస్య దంపతుల సహకారంతో పంపిస్తున్న ఈ కూరగాయల వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కర్రెటి శ్రీహరిరావు, బొర్రా మల్లేశ్వరరావు, గుమ్మడి శివరామప్రసాద్, గుమ్మడి సురేష్, చెరుకూరి పవన్ కుమార్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

విజయవాడ కల్చరల్: సినీ నటుడు చిరంజీవి సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం చిరంజీవి యువతకు సూచించారు. చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత, రాష్ట్ర చిరంజీవి యువత అధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సినీ గీతాల నృత్య పోటీలను తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించారు. సామాజిక సేవను దైవంగా భావించిన చిరంజీవి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, చిరంజీవి ఐ బ్యాంక్ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారని వివరించారు. చిరంజీవి యువత ప్రధాన బాధ్యుడు ఎల్. శ్యాం ప్రసాద్, ఉపాధ్యక్షుడు కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ చిరంజీవి జన్మదినం సందర్భంగా డాన్స్ పోటీలు నిర్వహించామని, 26 జిల్లాల నుంచి 30 జట్లు పోటీలో పాల్గొన్నాయని చెప్పారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

అమ్మవారికి కుంకుమార్చన

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని మహాలక్ష్మీ అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష అలంకరణ అనంతరం అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిగింది. ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా పలువురు ఉభయదాతలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కల్యాణ మండపంలో సుమారు రెండు వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కంపూడి గ్రామంలోని ఇందిరానగర్‌కు చెందిన విద్యార్థిని (17) నగరంలోని సిద్ధార్థ జూనియర్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఫలితం లేక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిరణ్ అనే యువకుడిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

మోపెడ్ ఢీకొని మహిళకు గాయాలు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): మోపెడ్ ఢీకొనడంతో మహిళ గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టినగర్ సొరంగం ప్రాంతానికి చెందిన సయ్యద్ అసియా భర్త ఇస్మాయిల్ ఎనిమిదేళ్ల కిందట మృతి చెందడంతో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఈ నెల 16వ తేదీన మందులు తెచ్చుకునేందుకు సొరంగం రోడ్డులో నడుచుకుంటూ వెళుతుండగా సొరంగంలో నుంచి వచ్చిన మోపెడ్ ఢీకొట్టింది. బాధితురాలిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కాలికి గాయమై శస్త్రచికిత్స చేయాలని వైద్యులు పేర్కొన్నారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.







గోకుల కృష్ణ.. గోపాల కృష్ణ

విజయవాడ రామలింగేశ్వర నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు గోపికలు, కృష్ణుడి వేషధారణలో చేసిన అల్లరి ఆకట్టుకుంది. ఉట్టికొట్టి సందడి చేశారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

వెంకన్న సన్నిధిలో...

బ్రాహ్మణవీధిలోని వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీకృష్ణుని ఉత్సవమూర్తికి పంచామృత తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి సంకీర్తనలను గానం చేశారు. ఆలయంలో గోపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు.

శ్రీకృష్ణ ప్రార్థనా మందిరంలో..

వన్‌టౌన్‌లోని శ్రీకృష్ణ ప్రార్థనా మందిరంలో స్వామి వారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, తులసీ దళార్చన చేశారు. భజన మండలి మహిళలు విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ప్రార్థనా మందిరం అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.

వేణుగోపాలస్వామి సన్నిధిలో..

కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్‌లోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో స్వామి వారికి ఉదయం తిరుమంజన అభిషేకాలను నిర్వహించి విశేష అలంకారం చేశారు. పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, మహాదేవు అప్పాజీరావు, ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), నాయకులు తంగెళ్ల రాము పాల్గొన్నారు.

నాలుగు స్తంభాల సెంటర్‌లో..

భవానీపురం(విజయవాడ పశ్చిమ): విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో కృష్ణాష్టమి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ అరవ సత్యనారాయణ, 38, 39 డివిజన్ల కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, గుడివాడ నరేంద్ర రాఘవ, ఆంధ్రప్రదేశ్ సంగీత, నృత్య అకాడమీ డైరెక్టర్ బట్టిపాటి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్రమైన భగవద్గీతను ప్రపంచానికి అందచేసిన శ్రీకృష్ణ భగవానుడు సమస్త మానవాళి మనుగడకు మార్గనిర్దేశనం చేశారని అన్నారు. భగవద్గీత గ్రంథంలోని ప్రతి శ్లోకం నేటి యువతకు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, జి. సూర్యనారాయణ, డి. సత్యనారాయణ తదితరులు వేడుకలను నిర్వహించగా వైఎస్సార్ సీపీ నాయకులు బట్టిపాటి శివ, ఐతా కృష్ణకిషోర్, డీవీ రెడ్డి పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామి సన్నిధిలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నాయకులు



వేణుగోపాలస్వామికి ప్రత్యేక అలంకరణ



శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో స్వామి వారు

ఆలయాల్లో శ్రావణ శోభ

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని వివిధ ఆలయాల్లో కొలువై ఉన్న అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక వైదిక కార్యక్రమాలు జరిగాయి. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పద్మావతి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయంలో వారాహిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు..

పాతబస్తీ శేషయ్యవీధి కొత్తగుళ్ల ప్రాంగణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాత శివాలయంలో..

వన్‌టౌన్‌లోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లోని భ్రమరాంబ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకస్వాములు అమ్మవారి విశిష్టతను వివరించి భక్తులతో వ్రతాలను ఆచరింపజేశారు. కార్యనిర్వహణాధికారి ఎస్.హేమలతా దేవి పర్యవేక్షించారు.

దర్భేశ్వరస్వామి వారి దేవస్థానంలో..

కొత్తపేట సైకంవారివీధిలోని దర్భేశ్వరస్వామి వారి దేవస్థానంలో పార్వతీ అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ఆలయంలో స్వామి వారి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.



వెంకన్న సన్నిధిలో పద్మావతి అమ్మవారికి ప్రత్యేక అలంకారం

23న దసరా కో-ఆర్డినేషన్ సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దసరా మహోత్సవాల తొలి కో ఆర్డినేషన్ సమావేశం ఈ నెల 23వ తేదీన జరగనుంది. మంగళవారం సాయంత్రం 3 గంటలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సెప్టెంబర్ 26వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నారు. సమావేశంపై ఇప్పటికే ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలకు సమాచారం అందజేశారు. భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలు, ఉత్సవాల ఏర్పాట్లపై దేవస్థాన అధికారులు ప్రత్యేకంగా అంచనాలను రూపొందిస్తున్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన భక్తులు శుక్రవారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. విజయవాడ వించిపేటకు చెందిన వెంకటకృష్ణారావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదాన పథకానికి రూ. 1,00,116ల విరాళాన్ని అందచేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడవద్దని మందలింపు

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టినగర్‌కు చెందిన బెవర తనోజ్ స్థానికంగా ఉన్న శ్రీ గౌతమ్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కరోనా సమయంలో ఆన్‌లైన్ క్లాసుల కోసం తల్లిదండ్రులు ఫోన్ కొనిచ్చారు. క్లాసులు అయిపోయిన తర్వాత తనోజ్ ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడేవాడు. కొంత కాలం తర్వాత విషయాన్ని తల్లిదండ్రులైన విజయలక్ష్మీ, చిన్నారావులు గమనించారు. కుమారుడిని మందలించాడు. ప్రస్తుతం స్కూల్‌కు వెళుతున్న తనోజ్ తల్లిదండ్రులకు తెలియకుండా గేమ్స్ ఆడుతున్నాడు. దీంతో మరోమారు మందలించడంతో ఈ గురువారం రాత్రి అందరూ భోజనం చేసిన తర్వాత నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారుజామున నిద్రలేచిన విజయలక్ష్మీకి తనోజ్ కనిపించలేదు. సెల్‌ఫోన్‌తో పాటు కొన్ని బట్టలు తీసుకుని తనోజ్ ఎక్కడికో వెళ్లిపోయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భక్తిగా సాగిన శ్రీకృష్ణ లీలామృతం

విజయవాడ కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి గోకుల గానం కార్యక్రమంలో భాగంగా సంస్కార భారతి మహానగర్ ఆధ్వర్యంలో బీసెంట్‌రోడ్డులోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుని లీలలను వర్ణిస్తూ లీలామృతంలోని సంకీర్తనలను మధురంగా గానం చేశారు. సంస్కార భారతి మహానగర్ కార్యదర్శి సీతాలక్ష్మి మాట్లాడుతూ శ్రీ కృష్ణుడు భగవద్గీతను మానవాళికి అందించిన మహనీయుడని తెలిపారు.

తన లీలల ద్వారా భక్తి, జ్ఞానయోగం, మోక్షాలను గురించి తెలియజేశాడని వివరించారు. సంస్థ సభ్యులు సూర్యకాంతి, జ్యోతి, శ్రీకృష్ణుని భక్తి తత్వం అంశంగా ప్రసంగించారు.



శ్రీకృష్ణుడి లీలలను గానం చేస్తున్న చిన్నారులు

సచివాలయ ఉద్యోగుల సంఘం నగర కమిటీ ఎన్నిక



వెంకటరామిరెడ్డికి మొక్క అందజేస్తున్న నవ్యరెడ్డి

భవానీపురం(విజయవాడ పశ్చిమ): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం 13/2020 విజయవాడ నగర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్నికయ్యారు. శుక్రవారం విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో సంఘం గౌరవాధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో విజయవాడ నగర కమిటీ అధ్యక్షుడిగా మోకా శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఇ. నవ్యరెడ్డిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాజీ, విజయవాడ నగర కార్యదర్శులు భవానీ, క్రాంతి, విజయ్, అక్బర్ సలీం, విఘ్నేష్, నాగరాజు పాల్గొన్నారు.

కబరిస్థాన్‌లో త్వరలో రోడ్డు నిర్మాణం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

మధురానగర్(విజయవాడ సెంట్రల్): గవర్నర్‌పేటలోని కబరిస్థాన్‌లో రూ.27 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నామని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా తెలిపారు. గవర్నర్‌పేటలోని కబరిస్థాన్‌ను శుక్రవారం నగర పాలక సంస్థ అధికారులు, కబరిస్థాన్ పెద్దలతో కలిసి ఎమ్మెల్సీ పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ రోడ్లు, విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో తాను అధికారులతో మాట్లాడి రోడ్డు, విద్యుత్ దీపాలకు రూ.27 లక్షలు మంజూరు చేయించామని చెప్పారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నగర పాలక సంస్థ డీఈ గురునాథం, ఏఈ వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీం, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, అమిత్, కబరిస్థాన్ గౌరవాధ్యక్షులు ఇర్ఫాన్ పాల్గొన్నారు.



కబరిస్థాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

జ్వరాల అదుపునకు పటిష్ట చర్యలు

వాంబే కాలనీలో రాష్ట్ర అధికారుల పర్యటన

లబ్బీపేట(విజయవాడతూర్పు): కీటక జనిత వ్యాధులు, జ్వరాలు అదుపు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ పటిష్టమైన చర్యలు చేపట్టిందని జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమం రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి అన్నారు. నగరంలోని వాంబేకాలనీ ఇ–బ్లాక్‌లో జ్వరాలు నమోదవుతున్న దృష్ట్యా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని, రాష్ట్ర ఎంటమాలజిస్ట్ కొండారెడ్డితో కలిసి శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా దోమల లార్వా గుర్తింపు చర్యలు, ఇంటింటికీ ఫీవర్ సర్వే కార్యక్రమం నిర్వహణ, ఫ్రైడే డ్రైడే వంటి కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. లార్వా నాశక చర్యలైన అబేట్ స్ప్రేయింగ్, ఇంటిలోపల నిర్వహించే పైరిథ్రిమ్ చల్లించడం, మలేరియా, నగర పాలక సంస్థ సిబ్బంది సమన్వయంతో నిర్వహిస్తున్న ఫాగింగ్ కార్యక్రమాల అమలును సమీక్షించారు. క్రమం తప్పకుండా ఈ ప్రాంతంలో ఫీవర్ సర్వే నిర్వహించడంతో పాటు దోమల నియంత్రణ చర్యలు ముమ్మరంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న గుణదల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని సందర్శించి, నిర్మాణ పనుల ప్రగతిపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె. నరసింహనాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, ఏఎంఓ సూర్యకుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



వాంబేకాలనీలో పర్యటిస్తున్న రామిరెడ్డి, డాక్టర్ సుహాసిని తదితరులు

బైక్‌ల దొంగ అరెస్ట్

8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

సత్యనారాయణపురం (విజయవాడ పశ్చిమ): నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన నిందితుడిని టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఎన్‌పురం పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూజివీడు మండలానికి చెందిన గన్ను నాగబాబు (29) ఇటీవల నగరంలోని సత్యనారాయణపురం, కృష్ణలంక, అజిత్‌సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు ద్విచక్ర వాహనాలను చోరీ చేశాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగర పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ శ్రీనివాసరావు, నార్త్ డివిజన్ ఇన్‌చార్జి రమణమూర్తిల పర్యవేక్షణలో ఎస్‌ఎన్‌పురం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో చోరీలకు పాల్పడిన నిందితుడిని గుర్తించారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం నిందితుడు రైల్వేస్టేషన్ గడియారం స్తంభం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు చోరీ చేసిన ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఎస్‌ఎన్‌పురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 6, కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి ఉన్నాయి. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

శరవేగంగా కాలువ కట్ట రోడ్డు పనులు

పెనమలూరు: యనమలకుదురులో కాలువ కట్ట రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాలువ కట్ట వాసుల అవసరాలకు ప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత కొద్ది నెలల క్రితం యనమలకుదురు ఇందిరానగర్–1లో కాలువ కట్టపై సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శంకుస్థాపన చేశారు. దాదాపు రూ. 15 లక్షలతో రోడ్డు పనులు చేసిన తర్వాత ఉపాధి నిధులకు సాంకేతికపరమైన సమస్యలు వచ్చాయి. దీంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. అయితే స్థానిక ప్రజలు రోడ్డు లేక ఇబ్బందులు పడటంతో ఎమ్మెల్యే పార్థసారథి చొరవతో తాడిగడప మునిసిపాలిటీ నిధులు దాదాపు రూ. 62 లక్షలు మంజూరు చేయించారు. దీంతో ఇందిరానగర్ జన్మభూమి వంతెన వద్ద నుంచి లాకుల వరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు.

రూ. 37 లక్షలతో అంబేద్కర్ కట్ట రోడ్డు పనులు..

గ్రామంలో అంబేద్కర్ కట్ట రోడ్డు పనులు కూడా చేపట్టారు. పెద్ద కట్ట నుంచి లాకుల వరకు రూ. 37 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేస్తున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తి అయితే లాకుల మీదగా నేరుగా అవనిగడ్డ కట్ట రోడ్డుకు వాహనాలు వెళ్లటానికి మార్గం సుగమం అవుతుంది. ఈ రెండు రహదారుల పనులు వేగంగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తాడిగడప కమిషనర్ ఎన్. ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఆయా రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.



యనమలకుదురులో రోడ్డు పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రకాశరావు

శ్రీవారి సేవలో ప్రముఖులు



అలయం వెలుపల న్యాయమూర్తులు జస్టిస్ లలిత, జస్టిస్ విజయలక్ష్మి, జస్టిస్ రవీంద్రబాబు, జస్టిస్ చక్రవర్తి, జస్టిస్ వెంకటరమణ

తిరుమల: పలువురు ప్రముఖులు శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో కర్ణాటక సీఎం బసవరాజ్ బొమ్మై, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కన్నెగంటి లలిత, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.విజయలక్ష్మి, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, జస్టిస్ డి.వెంకటరమణ, టెక్ మహీంద్ర సీఈవో గుర్నాని, ఏపీ ఇన్ఫర్మేషన్ కమిషనర్ రమణ కుమార్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు. కాగా, తిరుమలలో టీటీడీ నిర్మిస్తోన్న కర్ణాటక సత్రాల భవనాల నిర్మాణ పనులను కర్ణాటక సీఎం, మాజీ సీఎం పరిశీలించారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ..కల్యాణమండపం, మొదటి బ్లాక్ నిర్మాణాలను వచ్చే ఏడాది జనవరి ఆఖరుకు పూర్తి చేసి కర్ణాటక ప్రభుత్వానికి అప్పగిస్తామని చెప్పారు.

ప్రతి ఇంట్లో గోపూజే లక్ష్యం

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



గోశాలలో శ్రీకృష్ణునికి పూజలు నిర్వహిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

తిరుపతి రూరల్ : ప్రతి ఇంట్లో, ప్రతి ఆలయంలో రోజూ గోపూజ జరగాలన్నదే టీటీడీ లక్ష్యమని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గోపూజ నిర్వహించే ఆలయాలకు ఆర్థిక వనరులు లేకపోతే వాటికి తోడ్పాటు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గోకులాష్టమి సందర్భంగా శుక్రవారం తిరుపతిలోని ఎస్వీ గోసంరక్షణ శాలలో గోపూజ మహోత్సవాలు నిర్వహించారు. ఇందులో వైవీ పాల్గొని గజరాజులకు పండ్లు అందించి వేణుగోపాలస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. గోమందిరంలో గోవు, దూడకు శాస్త్రబద్ధంగా పూజలు నిర్వహించి దాణా, మేత తినిపించారు. వైవీ మాట్లాడుతూ గుడికో గోమాత కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తామని చెప్పారు.

ఆర్‌జీఎఫ్.. ఇది మన కేజీఎఫ్!

- త్వరలో రామగిరి బంగారు గనుల తవ్వకం
- 10 బ్లాక్‌లలో తవ్వకాలకు రంగం సిద్ధం
- సెప్టెంబర్ 2 వరకూ టెండర్లకు గడువు
- బిడ్‌లు వేసేందుకు పలు సంస్థల ఆసక్తి
- అత్యాధునిక టెక్నాలజీ సాయంతో మైనింగ్
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మందికి ఉపాధి



బంగారం ఖనిజాన్ని శుద్ధి చేసే యంత్రాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం : అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రామగిరి బంగారు గనులకు(ఆర్‌జీఎఫ్) మంచి రోజులొస్తున్నాయి. రెండు దశాబ్దాల కిందట మూసేసిన ఈ గనులు మళ్లీ తెరుచుకోనున్నాయి. దీంతో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరకనుంది. గనుల తవ్వకానికి సంబంధించిన సంస్థలను ఎంపిక చేసేందుకు టెండర్లనూ ఆహ్వానించారు. టెండర్ల స్వీకరణ గడువు సెప్టెంబర్ 2తో ముగుస్తుంది. ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే గనుల తవ్వకం ప్రారంభం కానుంది. రామగిరితో పాటు బొక్కసంపల్లి(రొద్దం మండలం), జౌకుల (కదిరి మండలం) ప్రాంతాల్లో 10 గోల్డ్‌ఫీల్డ్ బ్లాకులున్నాయి. వీటిలో మైనింగ్ జరిపేందుకు రాష్ట్ర భూగర్భ గనుల శాఖ అంతర్జాతీయ సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించింది. ఇందుకోసం పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఇక్కడ బంగారు నిల్వలు బాగా ఉన్నట్టు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గతంలోనే తేల్చింది. రామగిరిలో 1984లో భారత్ గోల్డ్‌మైన్స్ అనే కంపెనీ తవ్వకాలు చేసి, ఆ తర్వాత 2001లో ఆపేసింది. ఏడాదికి 124 కిలోల బంగారం వెలికి తీయాలని, అలా 17 ఏళ్లు చేయాలన్నది అప్పటి కంపెనీ నిర్ణయం. తర్వాత రకరకాల కారణాలతో మైనింగ్ ఆపేశారు.

ఈ గనుల్లోనే తవ్వకాలు

రామగిరి నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్, బొక్కసంపల్లి నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్, జౌకుల ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్ బ్లాక్‌లలో తవ్వకాలకు టెండర్లు పిలిచారు. ఈ పది బ్లాకుల్లో తవ్వకాల టెండరును దక్కించుకునేందుకు ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయి. తాజాగా ఎంపిక చేసే సంస్థలకు తొలి రెండేళ్లు కాంపొజిట్ లైసెన్స్ ఇస్తారు. అంటే రెండేళ్ల పాటు తవ్వకాలు మాత్రమే చేస్తాయి. ఆ తర్వాత కమర్షియల్ లైసెన్స్(వాణిజ్య సంబంధిత) అనుమతులిస్తారు. రామగిరి, బొక్కసంపల్లి, జౌకుల ప్రాంతాల్లో ఉన్న గోల్డ్‌మైన్స్‌లో టన్ను మైనింగ్(తవ్వకం) జరిపితే 4 నుంచి 5 గ్రాముల వరకూ బంగారం వెలికి తీయొచ్చనేది అంచనా. ఒక్కో చోట 8 నుంచి 10 గ్రాముల వరకూ వెలికి వచ్చే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా బంగారం ధర బాగా ఉండటం, అత్యాధునిక మైనింగ్ మెషినరీ అందుబాటులో ఉండటం వల్ల గతంలో మాదిరి కాకుండా ఇప్పుడు ఎక్కువ మంది బిడ్డర్లు వస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

భారీగా ఉపాధి అవకాశాలు

ఇరవై ఏళ్ల కిందట మూతపడ్డ బంగారు గనులు తిరిగి తెరుచుకోనుండటంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా మరో 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నట్టు అంచనా. రవాణా రంగం, హోటల్ పరిశ్రమలు వంటి అనుబంధ పరిశ్రమలకు కూడా ఊతం ఇచ్చినట్టవుతుంది.

> ఈ రెండు కారణాలతోనే తవ్వకాల్లో పురోగతి
>
> అంతర్జాతీయ స్థాయి సంస్థలు బిడ్డింగ్‌కు రావడానికి రెండు కారణాలున్నాయి. అంతర్జాతీయంగా బంగారం ధర ఎక్కువగా ఉంది కాబట్టి మైనింగ్ చేసే సంస్థలకు నష్టమొచ్చే అవకాశమే లేదు. రెండోది.. అండర్ గ్రౌండ్ మైనింగ్. అండర్‌గ్రౌండ్ మైనింగ్ ప్రక్రియలో అత్యాధునిక యంత్రాలొచ్చాయి. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మైనింగ్ జరుగుతుంది.
>
> – బాలసుబ్రమణ్యం, అసిస్టెంట్ డైరెక్టర్, గనుల శాఖ, అనంతపురం



నారాయణ ధన దాహం..

ఫీజుల కోసం.. ప్రాణం ‘టీసీ’!

హైదరాబాద్ : ‘నారాయణ’ ధనదాహం ముగ్గురి ప్రాణాల మీదికి తెచ్చింది. గత ప్రిన్సిపల్ ఇచ్చిన ఫీజు రాయితీ చెల్లదని.. ఉత్తీర్ణత పత్రాలు, టీసీ ఇవ్వాలంటే రూ.16 వేలు కట్టాల్సిందేనంటూ యాజమాన్యం భీష్మించడమే దీనికి కారణం.

రాయితీ ఇచ్చిన ఫీజు చెల్లించాలంటూ...

హైదరాబాద్ మల్కాజిగిరి వెంకట్‌రెడ్డినగర్‌కు చెందిన సాయి అంబర్‌పేట–రామంతపూర్ ప్రధాన రహదారిలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ చదివాడు. ఇటీవల పరీక్ష ఫలితాలు వెలువడటంతో కళాశాలకు వెళ్లి ఉత్తీర్ణత పత్రాలు, టీసీ ఇవ్వాలని కోరాడు. అయితే విద్యార్థి చెల్లించాల్సిన ఫీజులో ఇంకా రూ.16 వేలు బకాయి ఉందని, అది చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని ప్రిన్సిపల్ సుధాకర్ తేల్చి చెప్పాడు. గత ప్రిన్సిపల్ రాధాకృష్ణ తనకు రూ.16 వేలు రాయితీ ఇచ్చారని, ఆయన్ను సంప్రదించాలని విద్యార్థి కోరినా సుధాకర్ అందుకు నిరాకరించాడు.

ఇస్తారా.. ఇక్కడే చావమంటారా?

సాయి దాదాపు 15 రోజులు కళాశాల చుట్టూ తిరిగినా ప్రిన్సిపల్ కనికరించకపోవడంతో విద్యార్థి సంఘం నేతలు వెంకటాచారి, సందీప్‌లను ఆశ్రయించాడు. వారంతా శుక్రవారం మరికొందరు విద్యార్థులతో కళాశాలకు చేరుకుని మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ప్రిన్సిపల్‌ను పదే పదే కోరినా ఆలకించలేదు. దీంతో కలత చెందిన సందీప్ ‘ఇస్తారా..? మమ్మల్ని ఇక్కడే చావమంటారా?..’ అంటూ హెచ్చరించాడు. అయినా ప్రిన్సిపల్, ఏవో అశోక్‌రెడ్డిలు ససేమిరా అనడంతో సందీప్ అప్పటికే తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ తీసుకుని ఒంటిపై పోసుకున్నాడు. ఏవో, వెంకటాచారిపై కూడా పెట్రోల్ పడింది. దేవుడి చిత్రపటం ముందు ఉన్న దీపంపైనా పెట్రోల్ పడటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి.

> **ఫీజుల కోసం వేధించడం వల్లే..**
>
> నా కుమారుడు ఇదే కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఫీజు కట్టలేదని బయట నిలబెట్టారని తెలియడంతో కాలేజీకి వెళ్లా. ఆ సమయంలోనే ఒక్కసారిగా అరుపులు, కేకలు వినిపించాయి. ప్రిన్సిపల్ గది వైపు వెళ్లడంతో మంటలు అంటుకుని నేను కూడా స్వల్పంగా గాయపడ్డా. ఫీజుల కోసం వేధింపులకు గురిచేయడం వల్లే ఈ సంఘటన జరిగింది.
>
> – మహ్మద్ బూరా, ప్రత్యక్ష సాక్షి

విచారణకు ఆదేశం

మంటలు అంటుకోవడంతో సందీప్, వెంకటాచారి, అశోక్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రిన్సిపల్‌కు సైతం స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందడంతో అగ్నిమాపక శకటాలు అక్కడకు చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చాయి. బాధితుల్ని మెరుగైన చికిత్స నిమిత్తం డీఆర్‌డీవో అపోలో ఆస్పత్రికి తరలించారు. ఘటన నేపథ్యంలో పలు విద్యార్థి సంఘాల నేతలు అక్కడికి చేరుకుని నారాయణ కళాశాల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటూ ఆందోళనకు దిగారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని తెలంగాణ విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి ఇంటర్ బోర్డు కార్యదర్శిని ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

పాహిపాహి గణాధిపా.. కొత్త కోవెల సిద్ధమప్పా

- కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయం పునర్నిర్మాణం
- రేపే కుంభాభిషేకం..



కాణిపాకం నూతన ఆలయం

సాక్షి, చిత్తూరు : కాణిపాకం వరసిద్ధి వినాయక క్షేత్రం రూపురేఖలు మారాయి. స్వయంభూ మూర్తి గణనాథునికి మరో వెయ్యేళ్లు నిలిచేలా శిల్పకళా సొబగులతో సరికొత్త కోవెల నిర్మాణం పూర్తయ్యింది. ఆగమ శాస్త్రయుక్తంగా 21న కుంభాభిషేకం క్రతువు నిర్వహించి.. భక్తులకు కొత్త ఆలయంలోని స్వయంభూ మూలమూర్తి పునర్దర్శనం ప్రారంభించనున్నారు.

కాశ్యప శిల్ప కళా సౌందర్యంతోనే...

స్వయంభూ మూర్తి వినాయకుని మినహాయించి.. పాత ఆలయాన్ని పూర్తిగా తొలగించారు. గుంటూరు జిల్లా కోటప్పకొండ నుంచి కృష్ణశిలను తెప్పించారు. మొత్తం 800 టన్నులకు పైగా నల్లరాయిని ఆలయ నిర్మాణానికి వినియోగించారు. కాశ్యప శిల్ప కళాశాస్త్రం, ఆయాది గణాంకాల కొలతలతోనే ఆలయ నిర్మాణం పనులు సాగాయి. తంజావూరు, పుదుకోటైకి చెందిన మొత్తం 100 మంది శిల్పులు, ఇంజనీరింగ్ నిపుణులు ఆలయ పునర్నిర్మాణంలో ఏడాదిన్నరపాటు రేయింబవళ్లు పనిచేశారు.

దాతల సహకారంతోనే..

అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయులు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 కోట్లు విరాళం ఇచ్చారు. ఇక ధ్వజస్తంభం ప్రతిష్ఠ, కుంభాభిషేకం క్రతువు నిర్వహణకు అయిన రూ.70 లక్షలు ఖర్చు కూడా దాతలే భరిస్తున్నారు.

బ్రీఫ్డ్ మీ.. అనలేదని ప్రమాణం చేస్తావా?

- చంద్రబాబుకు ఎంపీ గోరంట్ల మాధవ్ సవాల్
- మీరు వైరల్ చేసింది ఫేక్ వీడియో అని నేను ప్రమాణానికి సిద్ధం
- నిరూపిస్తే నా రాజీనామా మీ ముఖంపై విసిరికొడతా..
- ఓటుకు కోట్లు కేసులో దొరికి దొంగలా పారిపోయి వచ్చారు
- బాబు, బాలయ్య, లోకేశ్‌ల బాగోతాలపై చర్చ పెట్టండి



అనంతపురం సప్తగిరి సర్కిల్: ‘నాపై వైరల్ అయినది ఫేక్ వీడియో అని కాణిపాకం వినాయక స్వామి ఆలయంలో ప్రమాణం చేస్తాను. వెంకటేశ్వర స్వామి భక్తుడినని చెప్పుకుంటున్న చంద్రబాబు.. ఓటుకు కోట్లు కేసులో పట్టుబడిన రూ.50 లక్షల డబ్బు తనది కాదని, బ్రీఫ్డ్ మీ అనలేదని ప్రమాణం చేయగలరా?’ అని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ సవాల్ విసిరారు. శుక్రవారం ఆయన అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. ‘ఆ వీడియో ఒరిజినల్ అని రుజువు చేస్తే నా రాజీనామాను ఎడమ చేత్తో తీసుకొచ్చి నీ (చంద్రబాబు) ముఖం మీద విసిరి కొడతా. లేదంటే నీ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పు. అప్పుడే రాష్ట్రం నిన్ను క్షమిస్తుంది. లుచ్చా, నీచ, దోపిడీ రాజకీయాలు చేయడం ఇకనైనా ఆపు. అధర్మంతో భారతంలో ముందు దుర్యోధనుడు గెలిచాడు. రామాయణంలోనూ ముందు రావణాసురుడు గెలిచాడు. కానీ చివరికి న్యాయం, ధర్మం, నీతి, నిజాయితీ వైపునే విజయం నిలిచింది. మీ ఫేక్ ప్రచారంలో కూడా తుదకు నాదే విజయం’ అన్నారు. ఫేక్ వీడియో, ఫేక్ రిపోర్ట్‌పై నిజానిజాలు తేల్చాలని డీజీపీకి ఫిర్యాదు చేశానని, ఎప్పటికైనా ధర్మం, నీతి గెలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ ఇంకా ఏమన్నారంటే..

ఓటుకు కోట్లు కేసుపై చర్చ పెట్టలేదెందుకు?

- ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబుపై ఏబీఎన్, టీవీ 5, ఈటీవీలు ఎందుకు చర్చ పెట్టలేదు? ఏసీబీ కేసులో దొరికిపోయిన చంద్రబాబు.. ఆంధ్రప్రదేశ్‌ను తాకట్టు పెట్టి, రాత్రికి రాత్రి తేలుకుట్టిన దొంగలా పారిపోయి వచ్చాడనే సంగతి గుర్తు చేసుకోవాలి. దీనిపై ఆ ఛానళ్లలో చర్చ పెట్టాలి.
- ‘అమ్మాయి కనపడితే కడుపైనా చేయాలి.. ముద్దయినా పెట్టాలి’ అని ఎమ్మెల్యే బాలకృష్ణ బహిరంగంగా వ్యాఖ్యానించారు. దీనిపై ఎల్లో మీడియా ఎందుకు చర్చ పెట్టలేదు? లోకేశ్ నిస్సిగ్గు వ్యవహారంపై ఎందుకు ప్రశ్నించలేదు?
- ఫేక్ వీడియోకు సంబంధించి ఫేక్ రిపోర్ట్‌ను తీసుకొచ్చి రాద్ధాంతం చేయడం చంద్రబాబు దిగజారుడు తనానికి నిదర్శనం. అది తాము ఇచ్చిన రిపోర్ట్ కాదని సదరు ఫోరెన్సిక్ సంస్థ తేల్చడంతో చంద్రబాబు పరిస్థితి కాలు కాలిన పిల్లిలా, శకునం పలికిన బల్లి కుడితిలో పడిన చందంగా మారింది.
- బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎంపీని వేధించడం బాబు కుల దురహంకారానికి పరాకాష్ట. టీడీపీలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను రెచ్చగొట్టి అంతరాలు సృష్టిస్తున్నారు. చంద్రబాబు దొంగ వ్యవహారాన్ని ఈ వర్గాల వారంతా గమనించి ప్రశ్నించాలి.

చంద్రబాబు ఇక దుకాణం సర్దుకోవచ్చు

- ఆయనవి ఎప్పుడూ నీచ రాజకీయాలే
- మంత్రి మేరుగ నాగార్జున



వసతి గృహాలను పరిశీలిస్తున్న మంత్రి మేరుగ, ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా జనమంతా జాతీయ జెండా పట్టుకు తిరుగుతుంటే చంద్రబాబు, లోకేష్ మాత్రం ఎంపీ గోరంట్ల మాధవ్‌ని పట్టుకు వేలాడుతున్నారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని చంద్రబాబు ఎల్లో మీడియాని అడ్డం పెట్టుకుని కుట్రలకు తెర తీస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం ఆయన కృష్ణాజిల్లా అవనిగడ్డలోని ఎస్సీ బాలుర వసతి గృహం–2, బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో అందుతున్న వసతి, విద్య, ఆహారం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలు, రెసిడెన్సియల్ స్కూల్స్ భవనాలను ముందెన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ఫేజ్–2 కింద పూర్తిగా బాగు చేయించి ఆధునీకరించేందుకు చర్యలు తీసుకోవడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇలాంటి ఆలోచనలు చేయలేదని చెప్పారు. రానున్న రోజుల్లో వసతి గృహాల్లో మరింత నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు కోరిక మేరకు వసతి గృహాన్ని సందర్శించినట్టు చెప్పారు. గతంలో ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ఏనాడూ హాస్టళ్లని, అందులో చదివే పిల్లలను పట్టించుకోలేదని మంత్రి విమర్శించారు. చంద్రబాబు గతంలో ఎస్సీలను పట్టించుకోలేదని అందుకే గత ఎన్నికల్లో వాళ్ళంతా జగన్‌మోహన్‌రెడ్డితో నడిచారని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను మార్చడంతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారమైన ఆహారాన్ని అందిస్తున్నట్టుగానే వసతి గృహాల రూపురేఖలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మార్చేయనున్నారని తెలిపారు.

బాబూ ఇక రాజకీయాలు చాలించు..

చంద్రబాబు అండ్ కంపెనీకి ఎప్పుడూ నీచ రాజకీయాలే కావాలని, గోరంట్ల మాధవ్‌ది మార్ఫింగ్ వీడియో అని చెప్పినా వినకుండా అమెరికా ఇన్విస్టిగేషన్ సంస్థ పేరుతో ఒరిజనల్ వీడియో అని చెప్పి ప్రచారం చేస్తున్నారని అన్నారు. సీఐడీ అధికారి పి.వి.సునీల్‌కుమార్ విచారణలో ఇది కూడా దొంగ సర్టిఫికెట్ అని రుజువు చేశారని వాళ్ళకు ఎప్పుడూ దొంగ బుద్ధులు, దొంగ ఆలోచనలే వస్తాయన్నారు. లోకేష్ రాజకీయాల్లోకి పనికిరాడని తేలిపోయిందని, జగన్‌మోహన్‌రెడ్డి రథచక్రాల కింద చంద్రబాబు ఎప్పుడో నలిగిపోయారని ఇకనైనా రాజకీయాలు చాలించాలని మంత్రి హితవు పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి తదితరులు పాల్గొన్నారు.

టి-20 చాంపియన్‌షిప్ విజేత తమిళనాడు

రన్నరప్‌గా నిలిచిన పాండిచ్చేరి



విజేత తమిళనాడు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఇండియన్ క్రికెట్ టీం పూర్వ మేనేజర్ కోకా రమేష్

విజయవాడ స్పోర్ట్స్: విభిన్న ప్రతిభావంతుల దక్షిణ భారత టి–20 ఛాలెంజడ్ ఛాంపియన్‌షిప్‌ను తమిళనాడు జట్టు కైవసం చేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మైదానంలో శుక్రవారం జరిగిన తుది పోరులో పాండిచ్చేరి జట్టుపై 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన పాండిచ్చేరి జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడంతో తొలుత బరిలో దిగిన తమిళనాడు నిర్ణీత 20 ఓవర్లకు 8 వికెట్లు నష్టపోయి 127 పరుగులు చేసింది. ఓపెనర్ శివ 38 బంతుల్లో రెండు సిక్స్‌లు, ఐదు ఫోర్లతో 51 పరుగులు సాధించగా, మిడిలార్డర్ సెల్వగణేష్ 29 పరుగులు చేశాడు. పాండిచ్చేరి బౌలర్లు గుణశీలన్ మూడు, అజీమ్ బాషా రెండు, మణికందన్ ఒక వికెట్ తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో పాండిచ్చేరి బ్యాట్స్‌మెన్‌ను తమిళనాడు బౌలర్లు 111 పరుగులకు కట్టడి చేశారు. పాండిచ్చేరి బ్యాట్స్‌మెన్ 20 ఓవర్లు ఆడి ఏడు వికెట్లు మిగిలిన ఉన్నా విజయ లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. గోవిందరాసు 40, రజని 36 పరుగులు చేశారు. తమిళనాడు బౌలర్లు గోపీనాథ్ రెండు, రాజమహేష్ ఒక వికెట్ తీశారు. విజేత తమిళనాడు జట్టుకు ఇండియన్ క్రికెట్ టీం పూర్వ మేనేజర్ కోకా రమేష్ ట్రోఫీలను అందజేశారు. రన్నర్ ట్రోఫీని ఆంధ్రప్రదేశ్ దివ్యాంగ్ క్రికెట్ అసోసియేషన్ (ఏపీడీసీఏ) సహాయ కార్యదర్శి జాలా సుధాకర్ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును తమిళనాడు బౌలర్ ఇబ్రహీం అందుకున్నాడు.

దుర్గమ్మ సన్నిధిలో శ్రావణ శోభ

- ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తజనం
- భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



భక్తులకు హారతిస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రావణ మాస రద్దీ కనిపించింది. శుక్రవారం రికార్డు స్థాయిలో 60 వేలకు పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు చెబుతున్నారు. నాలుగవ శుక్రవారం నేపథ్యంలో అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు తరలివచ్చిన భక్తజనంతో పాటు సాధారణ భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఇంద్రకీలాద్రిపై పండుగ వాతావరణం కనిపించింది. శ్రీ కృష్ణాష్టమి సెలవు కావడంతో భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో సర్వదర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. నవ దంపతులు, పలువురు మహిళలు అమ్మవారి మెట్ల పూజలు నిర్వహించారు. మరి కొంత మంది మహిళలు మోకాళ్లపై మెట్లు ఎక్కుతూ మొక్కులు చెల్లించుకున్నారు.



వరలక్ష్మీ పూజలు చేస్తున్న భక్తులు

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు..

మహా మండపం ఆరో అంతస్తులో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. ఇందులో 400 మంది ముత్తయిదువులు పాల్గొనడం విశేషం. వ్రతాన్ని ఆచరించిన మహిళలు తోటి వారిని అమ్మవారికి ప్రతిరూపంగా భావించి వారి నుదుటిన తిలకాన్ని దిద్ది తాంబూలం ఇచ్చి పుచ్చుకున్నారు. అనంతరం ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఇక అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చనలో 19 మంది ఉభయదాతలు, లక్ష కుంకుమార్చనలో 52 మంది ప్రత్యేక కుంకుమార్చనలో 20 మంది ఉభయదాతలు పూజలు జరిపించుకున్నారు.



వరలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

అమ్మవారి సన్నిధిలో శ్రీ కృష్ణాష్టమి..

కృష్ణాష్టమిని పురస్కరించుకుని శుక్రవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గోపూజ, కృష్ణునికి ప్రత్యేక పూజలు, సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో శ్రీ కృష్ణ భగవానుడి విగ్రహానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈవో భ్రమరాంబ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని గోశాలలో గోమాతకు పూజా కార్యక్రమాలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఎన్నో భావాలను తెలిపే శక్తి ఫొటోగ్రఫీకి ఉంది

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఒక ఛాయాచిత్రం వేయి పదాలతో సమానమని, ఫొటో ప్రచురణ ఎన్నో జీవితాలలో మార్పు తీసుకొచ్చిన ఘటనలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా శుక్రవారం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వివిధ దినపత్రికలలో సేవలందిస్తున్న ఫొటో జర్నలిస్టులను ఆయన సన్మానించారు. తొలుత ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ ఓ.ఎం.డాగ్యూరే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవ జీవితానికి ఫొటోగ్రఫీకి అవినాభావ సంబంధం ఉందన్నారు. ఫొటోలు భద్రపరచడం అంటే చరిత్రను భద్రపరిచినట్లేనని, కాలగర్భంలో కలిసిపోయే ఎన్నో మధుర స్మృతులను పదిలంగా ఉంచగల శక్తి ఫొటోలకే ఉంటుందని పేర్కొన్నారు. ఫొటో జర్నలిస్టులు తమ ఆలోచన సరళికి పదును పెట్టి తీసిన చిత్రాలు పత్రికలో ప్రచురించడం ద్వారా ఎన్నో జీవితాలలో వెలుగులు నింపిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఫొటో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి యు.సురేంద్రనాథ్, ఇతర అధికారులు ఎస్.వి. మోహన్‌రావు, ఎ.సాయిబాబా పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు, యువతులు



వరాల తల్లీ వందనం

తిరుపతమ్మ సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

పెనుగంచిప్రోలు: అష్టైశ్వర్యాలు, పాడి పంటలు, పసుపు కుంకుమలతో నిండు నూరేళ్లు వర్ధిల్లేలా దీవించమని కోరుతూ మహిళలు అమ్మవారిని వేడుకున్నారు. పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు, పురోహితులు, ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా వ్రతాన్ని మహిళలతో వైభవంగా నిర్వహించారు. మహిళలు, పెళ్లికాని యువతులు, పెద్ద సంఖ్యలో పాల్గొనటంతో ఆలయంలో శ్రావణ శోభ కనిపించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


నీళ్ల బరువు బాలికలదే...

డాక్యుమెంటరీ

'నో వాటర్ ల్యాండ్'
ఇది త్వరలో రాబోతున్న డాక్యుమెంటరీ.
మహారాష్ట్రలో నీళ్లు లేని ప్రాంతాలలో
బాలికల జీవితం
నీళ్లు మోయడంలోనే ఎలా
గడిచిపోతున్నదో ఈ డాక్యుమెంటరీ
తెలియచేయనుంది.
యు.కెలోని స్వచ్ఛంద సంస్థ
'వెల్స్ ఆన్ వీల్స్' స్థాపకుడు షాజ్ మెమెన్
దీనిని నిర్మిస్తుండగా
అవార్డ్ విన్నింగ్ దర్శకుడు
సౌమిత్రా సింగ్ దర్శకత్వం వహించాడు.
నీళ్లు బాలికల బాల్యాన్ని
మన దేశంలోని చాలా చోట్ల
ఎలా ధ్వంసం చేస్తున్నాయో
ఈ డాక్యుమెంటరీ కళ్లకు కట్టనుంది.

బాలికల నెత్తిన బరువు

మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో దందిచి బరి అనే చిన్న గ్రామం ఉంది. దానికి 'భార్యలు పారిపోయే ఊరు' అనే పేరు ఉంది. ఆ ఊరికి కోడళ్లుగా వచ్చిన వారు రెండో రోజున, మూడో రోజున పుట్టింటికి పారిపోతారు. దానికి కారణం ఆ ఊళ్లో నీళ్లు ఉండవు. దూరం వెళ్లి తేవాలి. మిట్టలు పల్లాలు ఎక్కి దిగాలి. గంటల తరబడి నీరు ఊరే వరకు ఆగాలి. ఆ తర్వాత మోయాలి. ఇవన్నీ చేయడం కంటే భర్త లేకుండా బతకడం మేలు అని ఆ ఊరి భార్యలు పారిపోతుంటారు. ఇప్పుడైతే ఆ ఊరికి పిల్లనిచ్చేవారు లేరు.

నాసిక్ జిల్లాలో నీటి సమస్య అంత తీవ్రం

దీని పొరుగునే ఉన్న మరో జిల్లా థానేలో దింగన్‌మల్ అనే గ్రామం ఉంది. దీనికి 'బహు భార్యల ఊరు' అనే పేరు ఉంది. ఎందుకంటే అక్కడ ఒక్క మగాడు ఇద్దరు లేక ముగ్గురిని వివాహం చేసుకుంటాడు. ఒకరు వంట చేసేందుకు, ఒకరు నీళ్లు మోసేందుకు. ఎందుకంటే ఆ ఊరి నుంచి నీరు తెచ్చుకోవడానికి రోజులో ఆరు గంటలు వెచ్చించాలి. అంతసేపు నీళ్లకే పోతే వంటా గింటా జరిగే చాన్సు లేదు. అందుకని 'నీటి భార్యలు' ఇక్కడ ప్రతి ఇంటా ఉంటారు. పెద్ద భార్యే వెతికి 'నీటి భార్య'ను తెస్తుంది. భర్త తనకు పోషించే శక్తి లేకపోయినా ఇద్దరిని కట్టుకోవాల్సిందే. లేకుంటే బతకడం కష్టం.

పెద్దలకే ఇన్ని కష్టాలు ఉంటే మరి ఆడపిల్లల పరిస్థితి ఏమిటి? మహారాష్ట్రలో నీటి కరువు ఉన్న అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య బాధిస్తున్నది బాలికలనే. భర్త సంపాదించడానికి వెళ్లాలి కాబట్టి కొడుకులు బాగా చదువుకోవాలి కాబట్టి నీటి బాధ్యత వారికి ఉండదు. తల్లి కాని కుమార్తెగాని నీరు మోయాలి. 'బడికి వెళ్లి చదువుకోవాలనే మా కలలు కల్లలే అవుతున్నాయి' అని అక్కడి ఆడపిల్లలు అంటారు. స్కూళ్లలో పేర్లు నమోదు చేసుకున్నా వీరు రోజూ స్కూలుకి వెళ్లడం సాధ్యం కాదు. అరగంట దూరంలో ఉండే బావి నుంచి ఒక బిందెను మోసుకు వస్తారు. అలా నాలుగు బిందెలు తేవాలంటే రెండు గంటల సమయం గడిచిపోతుంది. ఆరు బిందెలకు మూడు గంటలు.


దొర్లించే నీళ్ల డ్రమ్ముతో బాలిక

వెల్స్ ఆన్ వీల్స్

యు.కెలో డెంటల్ రంగంలో పని చేస్తున్న వ్యాపారవేత్త షాజ్ మెమెన్ మహారాష్ట్రలో బాలికల నీటి కష్టాలను తగ్గించి వారిని చదువుకు దగ్గర చేర్చాలని నిశ్చయించుకున్నాను. నాకు కూతురు పుట్టాక హటాత్తుగా నాకు ఈ విషయం గుర్తుకు వచ్చింది. నా కూతురు ఉదయాన్నే లేచి నీళ్లకోసం కష్టపడాల్సిన పని లేదు. నేరుగా స్కూల్‌కి వెళ్లిపోయేంత నీటి సౌకర్యం ఇక్కడ ఉంది. కాని భారత్‌లో అలా కాదు. ఆడపిల్లలు నీటి బరువు కింద నలిగిపోతున్నాడు. వారి కోసం 'వెల్స్ ఆన్ వీల్స్' అనే సంస్థను స్థాపించాను' అంటాడు షాజ్ మెమెన్. ఇతను నేల మీద దొర్లించుకుంటూ (లాక్కుంటూ) వచ్చే నీళ్ల డ్రమ్ముల సరఫరా మహారాష్ట్రలో మొదలెట్టాడు. ఒక్కో డ్రమ్ములో 45 లీటర్ల నీళ్లు పడతాయి. హై క్వాలిటీ ప్లాస్టిక్ డ్రమ్ములు కనుక (అవి 7000 కిలోమీటర్ల దూరం లాగినా పాడు కావు) వీటిని సులువుగా లాక్కుంటూ రావచ్చు. మూడు బిందెల నీళ్లు ఈ ఒక్క డ్రమ్ములో పడతాయి కనుక మూడు ట్రిప్పుల కాలం మిగిలి ఆడపిల్లలు ఇప్పుడు స్కూళ్లకు వెళుతున్నారు. నాసిక్‌లోని ఐదు ఊళ్లలో వెల్స్ ఆన్ వీల్స్ పేరుతో నీళ్ల డ్రమ్ముల సరఫరా జరిగింది.

నిత్య నరకం

7 సంవత్సరాల బాలికల నుంచి 18 సంవత్సరాల యువతుల వరకు ఈ నీటి మోతకు బానిసలుగా మార్చబడతారు. తల్లిదండ్రులకు వేరే మార్గం కూడా ఉండదు. ముఖ్యంగా వేసవిలో బాలికల కష్టాలు చెప్పనలవి కావు. 'తల మీద మోయడం వల్ల తల దిమ్ముగా ఉంటుంది. భుజాలు నొప్పి పెడతాయి. ఛాతీలో బరువు. కాళ్లు లాగుతాయి' అని ఇక్కడి ఆడపిల్లలు చెబుతారు. వేసవిలో ఈ ప్రాంతంలో 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. 'ఆ ఎండలో వెళ్లి నీళ్లు తేవాలంటే చాలాసార్లు ఆడపిల్లలు స్పృహ తప్పి పడిపోతుంటారు. హాస్పిటల్‌లో చేరిస్తే అదో ఖర్చు' అని తల్లిదండ్రులు వాపోతుంటారు. ఏ సంవత్సరం తీసుకున్నా కనీసం 2000 మంది ఆడపిల్లలు మహారాష్ట్రలో నీళ్లు లేని జిల్లాల్లో స్కూళ్లకు నాగా పెడుతుంటారు. వీరి చదువు ఇలా ఒడిదుడుకుల్లో పడటం వీరి భవిష్యత్తుగా పెద్ద విఘాతంగా మారుతోంది.

డాక్యుమెంటరీ

అయితే తను ఒక్కడే ఈ పని చేస్తే నీటి సమస్య తీరదు. దేశంలో ఎక్కడెక్కడ నీళ్ల వల్ల ఆడపిల్లలు చదువుకు దూరం అవుతున్నారో ఆ ప్రాంతాలన్నిటినీ గుర్తించి తరుణోపాయాలు ఆలోచించాలని పిలుపునిస్తాడు షాజ్. అందుకే 'నో వాటర్ ల్యాండ్' అనే డాక్యుమెంటరీ నిర్మించాడు. దీనికి గతంలో నసీరుద్దీన్ షాతో షార్ట్ ఫిల్మ్ తీసి అవార్డు పొందిన సౌమిత్రా సింగ్ దర్శకత్వం వహించాడు. త్వరలో ఈ డాక్యుమెంటరీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

కృషి


షేక్ రజియా

పల్లెకు–పట్టణానికి వారధి

'రాష్ట్రంలో ఎక్కడ ప్రాజెక్ట్‌కి అనుకూలంగా ఉందనుకుంటే అక్కడకు మా యూనిట్ కూడా మారుతూ ఉంటుంది. నా టీమ్ మెంబర్స్ పది మంది ఎప్పుడూ నాతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉంటారు. మెట్రో సిటీస్‌లో ప్రమోషన్స్ కోసం చురుగ్గా ఉండాలి. అందరికీ పల్లె ఉత్పత్తులు ఇష్టమే. కానీ, అందరికీ అవి లభించేదెలా? అందుకే, నేను పల్లెకు–పట్టణానికి వారధిగా మారాను. నేను చేసే ఈ ప్రాజెక్ట్ వల్ల యుఎస్ వెళ్లడానికి ఫెలోషిప్ కూడా వచ్చింది. పెద్ద పెద్ద వ్యాపారవేత్తలతో కలిసి పని చేశాను. అక్కడి నుంచి వచ్చిన తర్వాత మా ఉత్పత్తులకు మరింత ఎక్స్‌పోజర్ పెరిగింది. మంచి పేరు వచ్చింది.'

ఇప్పపూల లడ్డు పసుపు మసాలా పానీయం

**అడవి నుంచి దూరమయ్యాం
పల్లె నుంచి పట్టణవాసంలో
కరెన్సీ కోసం నిత్యం కసరత్తులు చేస్తున్నాం.
కానీ, అడవి పంచే ఔషధం.. పల్లె ఇచ్చే పట్టెడన్నమే
మనకు అమ్మ చేతి గోరుముద్దంత ప్రేమను అందిస్తుంది.
అలాంటి ప్రేమకు వారధిగా నిలుస్తున్నారు
గుంటూరు వాసి షేక్ రజియా.
ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతాల్లో
గిరిజనుల స్థావరాలను వెతుక్కుంటూ వెళ్లి
వారి ఆహారపు అలవాట్లు తెలుసుకుని,
'బస్తర్ ఫుడ్ ఫర్మ్ అండ్ కన్సల్టెన్సీ
సర్వీసెస్' పేరుతో సంస్థను నెలకొల్పి
అక్కడి మహిళల చేత ఆరోగ్యకరమైన
ఉత్పత్తులను తయారు చేయిస్తున్నారు.
వాటికి పట్టణాల్లోనే కాదు
అంతర్జాతీయ మార్కెట్‌లోనూ విలువనూ..
అక్కడి మహిళలకు ఉపాధి అవకాశాలనూ
పెంచుతున్నారు. ఆరేళ్లుగా రజియా చేస్తున్న ఈ కృషి
గురించి అడిగితే ఆమె ఎన్నో అడవి ముచ్చట్లను
ఆనందంగా పంచుకున్నారు.**

''జగ్దల్‌పూర్‌లో 'బస్తర్ ఫుడ్ ఫర్మ్' మెయిన్ ప్రాజెక్ట్ ఉంది. ఇక్కడ నుంచి దంతెవాడ, బస్తర్‌లోనూ మా ప్రాజెక్ట్స్ ఉన్నాయి. రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో ఆదివాసీలున్న చోటును వెతుక్కుంటూ వెళ్లి, అక్కడ కొంతమంది మహిళలతో మాట్లాడి ఒక యూనిట్‌ని తయారు చేస్తాను. అలా ఇప్పటివరకు పదికి పైగా యూనిట్స్ ఉన్నాయి. ఇక్కడి నుంచి ఆదివాసీల ఆహార ఉత్పత్తులను నాణ్యంగా తయారు చేయిస్తుంటాను. వాటిని పట్టణవాసులకు మార్కెటింగ్ చేస్తుంటాను. వీటిలో.. మహువా (ఇప్పపూల) లడ్డూ, టీ పొడి, కుకీస్, పసుపు మసాలా, చింతపండు సాస్, ఇన్‌స్టంట్ చింతపండు రసం పౌడర్, చాక్లెట్స్, తేనె, సేంద్రియ బియ్యం, కారం, బెల్లం.. ఇలా 22 ఉత్పత్తులు ఉన్నాయి.

ఆంధ్రా నుంచి ఛత్తీస్‌గఢ్

మా నాన్నగారు గుంటూరులో ఉండేవారు. వ్యాపారరీత్యా ఛత్తీస్‌గఢ్‌లో స్థిరపడ్డారు. అమ్మ, ఇద్దరు తమ్ములు, బాబాయ్ కుటుంబ సభ్యులు ..అందరం కలిసే ఉంటాం. అలా నా చదువు అంతా అక్కడే సాగింది. మైక్రోబయాలజీలో డిగ్రీ చేశాను. స్వచ్ఛమైన అడవి సౌందర్యం గురించి నాకు తెలుసు. అందుకే ఎప్పుడూ అడవి బిడ్డల జీవనశైలి మీద నా చూపు ఉండేది. నా చదువులో భాగంగా మొక్కల పరిశోధనకు రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు వెళ్లి, గిరిజనులను కలిశాను. అప్పుడు అక్కడి గ్రామాల్లో కొంతమంది మహిళలు మహువా (ఇప్పపూల) లడ్డూలను తయారుచేస్తున్నారు. నాకు చాలా ఆసక్తి అనిపించింది. ఇప్పపూలలో ఉండే పోషకాలను అడిగి తెలుసుకున్నాను. విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండే ఇప్పపూలలో తలనొప్పి, విరేచనాలు తగ్గించే సుగుణాలు ఉన్నాయి. చర్మ, కంటి సమస్యలతో సహా చాలా వ్యాధులకు ఔషధంగా వాడచ్చు. వంటకాలకు సహజమైన తీపిని అందిస్తాయి. దీంతో పోషకాహార నిపుణులు, మరికొంత మంది సాంకేతి నిపుణులు, ఆరుగురు గిరిజన మహిళలతో కలిసి అన్ని అనుమతులతో 2017లో 'బస్తర్ ఫుడ్ ఫర్మ్' ప్రారంభించాను.

సవాళ్లను ఎదుర్కొంటూ...

ముందు ఈ బిజినెస్‌కి ఇంట్లో వాళ్లే ఒప్పుకోలేదు. 'ఎందుకు కష్టం. ఉద్యోగం చూసుకోక' అన్నారు. బ్యాంకులను సంప్రదిస్తే లోన్ ఇవ్వలేదు. మహువా లడ్డూలను రుచిగా తయారు చేయడంలోనూ సవాళ్లు ఎదురయ్యాయి. చాలా మంది 'ఎందుకు ఇదంతా వృథా... ఇది ఫెయిల్యూర్ బిజినెస్' అన్నారు. దీనికి కారణం లేకపోలేదు. చాలాకాలంగా మన దేశంలో ఇప్పపూలను మద్యం తయారీలోనే వాడతారని తెలుసు. ఆదివాసీలే వీటిని ఉపయోగిస్తారు మనకెందుకు అనే అభిప్రాయమే ఉంది. వీటిలోని సానుకూల కోణాన్ని బయట ప్రపంచానికి తెలియజేయాలనుకున్నాను. అనుమతి కోసం చాలా మంది అధికారులను సంప్రదించాను. 2018లో ఒక ఐఎఎస్ ఆఫీసర్ రెండు నెలల ప్రోగ్రామ్‌కు అనుమతి ఇచ్చారు. లడ్డూల నాణ్యత పెంచడానికి చాలా ప్రయోగాలు చేశాం. మహువా లడ్డూల తయారీ మార్కెటింగ్ చేస్తే రెండు లక్షల రూపాయల లాభం వచ్చింది. అప్పుడు కాన్ఫిడెన్స్ పెరిగింది.

సమస్యలను అధిగమిస్తూ!



'ఈ కన్సల్టెన్సీ మీద కొంత ఆదాయం వస్తుంది. దానిని పని చేస్తున్న మహిళలకే పంచుతాం. ఇక్కడి మహిళలకు పని వచ్చు కానీ మార్కెటింగ్ తెలియదు. ఊరు దాటి బయటకు వెళ్లలేరు. చదువుకున్న వారికి పట్టణ వాతావరణం గురించి తెలియదు. వారి ప్రతిభకు మేం సపోర్ట్‌గా ఉన్నాం. నక్సలైట్స్ సమస్యలూ వస్తుంటాయి. అడవుల్లోని మారుమూల పల్లెలకు వెళ్లినప్పుడు ఒక్కోసారి ఫుడ్ దొరకదు. అక్కడి ఆదివాసీలు త్వరగా అర్థం చేసుకోరు. వారి భాష మనకు రాదు. వాళ్ల భాషల్లోనే విషయం చెప్పాలన్నా కొంచెం సమస్యే. కానీ, వాటిని అధిగమిస్తేనే ఏదైనా చేయగలం. ఒక్కసారి వారికి అర్థమైతే మాత్రం మనమంటే ప్రాణం పెట్టేస్తారు. అంతబాగా చూసుకుంటారు. వాళ్లదగ్గర ఉన్న ప్రతిభను పట్టణానికి పంచే పనిని చేస్తున్నాను.'





నేర్చుకునేవారికి శిక్షణాలయం

బస్తర్ ఫుడ్ ఫర్మ్‌ని ఇన్‌స్టిట్యూట్‌లా మార్చాలని ప్రయత్నాలు చేస్తున్నాను. ఆదివాసీల ఆహారాలు ఏవున్నాయో వాటిని బయటి ప్రపంచానికి చూపించాలన్నదే నా తాపత్రయం. ప్రస్తుతం లండన్ కంపెనీతో కలిసి పని చేయబోతున్నాం. దీనివల్ల అంతర్జాతీయ మార్కెటింగ్ కూడా బాగా పెరుగుతుంది. ఈ బిజినెస్ మోడల్‌గా రాబోయే తరానికి తెలియాలి. ఈ ఆలోచనతోనే ఆసక్తి గలవారు ఒక ఏడాది పాటు ఈ కోర్సు ప్రత్యక్షంగా నేర్చుకునేలా రూపొందించాను. నేర్చుకోవాలంటే ఇక్కడ చాలా పని ఉంది. మరో రెండేళ్లలో ఇన్‌స్టిట్యూట్ సిద్ధం అవుతుంది. ఇప్పటికే స్టూడెంట్స్ గ్రూప్స్‌గా వస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఆసక్తిగలవారు నేర్చుకోవడానికి మా సంస్థను సంప్రదిస్తున్నారు'' అని ఆనందంగా వివరించారు రజియా.

పల్లెవాసుల మధ్య పని చేయాలని, కొత్త మార్గాలను అన్వేషించాలని చాలా మంది ప్రయత్నిస్తుంటారు. కానీ, అనుకున్నంతగా ఆచరణలో పెట్టలేరు. సవాళ్లను ఎదుర్కొంటూ, సమస్యలను అధిగమిస్తూ పల్లెకు–పట్టణానికి వారధిగా నిలుస్తున్న రజియా లాంటివారు యువతరానికి ప్రతీకగా నిలుస్తున్నారు.

– నిర్మలారెడ్డి

విరాళాలు సరిపోవు.. ఊతంగా నిలవాలి

ప్రేరణ



చిన్న చిన్న పదాలు, అంకెలు పలకడం, అర్థం చేసుకోవడం చిన్నారి పార్వతి నౌరియాల్‌కు చాలా కష్టమైంది. ''చిన్నపిల్ల కదా నేర్చుకోవడానికి ఇబ్బంది పడుతుంది అని అనుకోలేదు తల్లిదండ్రులు. బద్ధకస్తురాలు... ఏదీ వెంటనే నేర్చుకోదు'' అని విసుక్కునేవారు. బుడిబుడి అడుగులతో, బుజ్జిమాటలతో ఆకట్టుకునే వయసులో అమ్మానాన్నల నిరాదరణకు గురైన ఆ చిన్నారి నేడు వందల మంది పిల్లలకు చదువు చెప్పడంతోపాటు, ఎంతోమంది సెక్స్‌వర్కర్లను వేశ్యావృత్తినుంచి బయటకు తీసుకువచ్చి గౌరవంగా బతికేందుకు అవకాశాలు కల్పిస్తోంది.

మహారాష్ట్రకు చెందిన పార్వతి నౌరియాల్‌కు చిన్నతనంలో డిస్లెక్సియా సమస్య ఉండడంతో మూడేళ్లు వచ్చేంత వరకు పదాలు, అంకెలు కూడా సరిగా పలకలేక పోయేది. స్కూలుకెళ్లి చదువుకోవాల్సి వస్తుందని ఇలా చేస్తుంది అని చిరాకుపడుతుండేవారు తల్లిదండ్రులు. అయితే అదేమీ పట్టించుకోకుండా చదువుకుంటూ అతికష్టం మీద పదోతరగతి పాసయ్యింది పార్వతి. టెంత్ తరువాత పార్వతి డిస్లెక్సియాతో బాధపడుతోందని ఆమె తల్లి గుర్తించింది. అప్పటి నుంచి ఆమె వెన్నంటే ఉండి సమస్యను అధిగమించేందుకు సాయం చేసింది. పార్వతి తల్లి చదువుకోకపోయినప్పటికీ చదువు విలువ తెలియడం వల్ల తన పిల్లలతోపాటు, సమీపంలోని మురికివాడల్లోని అమ్మాయిలను చదివించమని పదేపదే చెబుతుండేది. తల్లి ప్రోత్సాహమే తనను ఇప్పుడు సమాజ సేవకురాలిగా నిలబెట్టిందని చెబుతుంది పార్వతి.

విరాళాలు కాదు ప్రేరణగా నిలవాలి

"సమాజానికి ఎంతోకొంత తిరిగిచ్చేయాలని..మన దగ్గర ఉన్న డబ్బును దానాలు, విరాళాలుగా ఇవ్వడం, లేదా ఎన్జీవోలతో కలిసి కొంతకాలం పనిచేస్తే సరిపోదు. మరణించేలోపు మనం కొంతమందికి ప్రేరణగా, నలహాదారుగా, శిక్షకులుగా నిలవాలి. అప్పుడు సమాజంలో చాలామంది మారతారు.

– పార్వతి నౌరియాల్

ట్రిప్ నుంచి తిరిగి వస్తుండగా.. చక్కగా చదువుకుని విపత్తు నిర్వహణల ఉద్యోగం చేస్తోన్న పార్వతి 2015లో ఒకసారి కర్జత్ ట్రిప్‌కు వెళ్లింది. ట్రిప్ పూర్తిచేసుకుని అక్కడి నుంచి తిరిగి వస్తుండగా ఆమెకు కొంతమంది బాలకార్మికులు కనిపించారు. బాలలతో పనిచేయించకూడదని చట్టాలు చెబుతున్నప్పటికీ అక్కడ అంత మంది బాలకార్మికులు కనిపించడం విచిత్రంగా అనిపించింది. ప్రభుత్వ అధికారులు, ఎన్జీవోలు సైతం వారిని చూసీ చూడనట్లు వదిలేయడం తనకు నచ్చలేదు. బాలకార్మికుల కష్టాలను తీర్చేందుకు అధికారులను కలిసి వారి దైన్యస్థితిని గురించి వివరించింది. నెలరోజులు తిరిగాక ఓ వ్యాపార వేత్త .. బాలకార్మికులకు వారాంతాల్లో చదువు చెప్పించడానికి టీచర్లను నియమించాడు. దీంతో కర్జత్‌లోని పిల్లలు చదువుకోవడం ప్రారంభించారు. 139 మంది బాలకార్మికులు బడిబాట పట్టడం ఎంతో సంతోషాన్నిచ్చింది.





కోవిడ్ తర్వాత కామటిపురాకు... వందకుపైగా బాలకార్మికులని విద్యార్థులుగా మార్చిన ఆనందంలో మరింత మందిని చదివించాలని నిర్ణయించుకుంది పార్వతి. అప్పుడే కోవిడ్ కారణంగా లాక్‌డౌన్ విధించడంతో పరిస్థితులన్నీ ప్రతికూలంగా మారాయి. లాక్‌డౌన్ ఎత్తివేసిన తరువాత ఉద్యోగాలు కోల్పోయిన అనేక మంది కుటుంబాలను కలిసింది. కుటుంబపోషణకు ఆధారం లేక చావే శరణ్యమంటోన్న అనేకమంది కన్నీటి బాధలు వింటోన్న సమయంలో ఓ నిరుపేద తల్లిదండ్రులు తమ కుమార్తెని పెంచే స్థోమతలేక కామటిపురాకు అమ్మేసినట్లు తెలిసింది. అప్పుడు ఆ అమ్మాయిని ఎలాగైనా రక్షించాలని నిర్ణయించుకుని కామటి పురాలో అడుగుపెట్టింది. అక్కడ ఎంత వెతికినా ఆ అమ్మాయి కనిపించలేదు కానీ, అక్కడ బాగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నలుగురు అమ్మాయిలను చేరదీసి సొంత డబ్బుతో శిక్షణ ఇప్పించి, వేశ్యావృత్తిని వదిలేలా చేసింది.

ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి వేశ్యావృత్తిలోకి బలవంతంగా వస్తోన్న వారిని బయటకు తీసుకువచ్చి, వారికి వివిధ రకాల వృత్తులలో శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఇలా ఇప్పటిదాకా వెయ్యిమందిని కామటిపురా నుంచి బయటకు తీసుకువచ్చి సమాజంలో గౌరవంగా బతికేలా చేసింది. వీరిలో ఎక్కువమంది చిన్న వయసు అమ్మాయిలు ఉన్నారు. వీరి పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దుతూ అక్కడి వారికి తన వంతు ఊతం ఇస్తోంది పార్వతి.

మానసికంగా దృఢంగా ఉండాలంటే..?



ఇటీవలి కాలంలో మానసిక వ్యాధులు అధికం అవుతున్నాయి. అతి సున్నితమైన మనస్తత్వం వల్ల, చిన్నప్పటినుంచి ఎక్కువ గారాబంగా పెరగడం వల్ల, జీవితంలో ఏదయినా అనుకోని సంఘటనలు ఎదుర్కొనవలసి రావడం వల్ల మానసిక వ్యాధులు కలుగుతాయి. అలా మానసిక వ్యాధులు రాకుండా ఉండాలంటే మానసికంగా దృఢంగా ఉండాలి.... మానసికంగా దృఢంగా ఉండాలంటే మన జీవనశైలిలో తగిన మార్పులు చేసుకోవాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. అందుకోసం ఏయే పదార్థాలు తీసుకోవాలి, ఏయే పదార్థాలు తీసుకోకూడదో చూద్దాం.

సంతోషకరమైన జీవితం ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం, ఒత్తిడి లేని జీవన శైలిని అలవరుచుకోవాలి. దీనిపై పెద్దవాళ్లు, అనుభవజ్ఞులు, ఆయుర్వేద వైద్యనిపుణులు స్పష్టమైన ఆరోగ్యసూత్రాలను ఎప్పుడో చెప్పారు. వాటిని పాటించడం వల్ల మానసిక దృఢత్వం కలుగుతుంది.

ఇవి తీసుకోవాలి

ఎక్కువ పాలిష్ చేయని బియ్యం, ముడి పెసలు, తాజా పాలు, నెయ్యి, గోధుమలు, వెన్న, బూడిద గుమ్మడికాయ, పరిశుభ్రమైన ఆహారం, సీజనల్ పండ్లు, కూరగాయలు, ద్రాక్ష, దానిమ్మ, ఉసిరి, చేపలు, కొవ్వు ఎక్కువగా ఉండని మాంసం, యాపిల్, ఆర్గానిక్ ఎగ్స్.

మానేయవలసినవి

- కలుషిత ఆహారం అంటే రోడ్డు వెంట దొరికే అపరిశుభ్రమైన ఆహారం తినడం
- రిఫైన్డ్, ప్రాసెస్డ్ ఫుడ్, ఆల్కహాల్
- కాఫీ, టీలు ఎక్కువగా తీసుకోవడం (దీనివల్ల న్యూరోట్రాన్స్‌మిటర్స్ పనితీరుపై ప్రభావం పడుతుంది)
- స్మోకింగ్, గుట్కాలు తినడం
- ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడటం
- ఊరగాయలు, కారాలు, మసాలాలు అధికంగా ఉన్న ఆహారం
- డీప్ ఫ్రీజర్‌లో నిల్వ ఉంచిన కోల్డ్ ఫుడ్
- అధికంగా పుల్లగా ఉండే పదార్థాలు (పులియబెట్టినవి, వెనిగర్ లాంటివి)
- అతి కష్టంమీద జీర్ణమయ్యే ఆహారం
- బూజు పట్టిన, పాడైన, కుళ్లిన ఆహారం తీసుకోవడం
- అధికంగా తినడం, తీసుకున్న ఆహారం అరగకముందే మళ్లీ తినడం
- పాలు–గుడ్లు లేదా చేపలు, వేడి–చల్లని పదార్థాలు కలిపి తీసుకోవడం, పండ్లు–పాలు కలిపి తీసుకోవడం
- ఆలస్యంగా నిద్ర పోవడం, ఆలస్యంగా లేవడం, అసలు నిద్ర పోకుండా ఉండడం
- పగటి నిద్ర పోవడం
- శారీరక శ్రమ, వ్యాయామం లేకుండా అధికంగా కూర్చుని ఉండే జీవన సరళి కలిగి ఉండడం
- అధికంగా ఒత్తిడి కలిగి ఉండడం
- కామం, క్రోధం, లోభం వంటి వాటిపై నియంత్రణ లేకపోవడం
- సామాజిక నిబంధనలు, నైతిక విలువలు పాటించక, అసహజ ప్రవర్తన కలిగి ఉండడం
- అతిగా ఆలోచించడం, ఏవో పాత సంఘటనలని తలచుకుని నిరంతరం బాధపడుతుండడం, ఆందోళన పడటం
- నిరంతరం టీవీ, మొబైల్ చూడటం దీనివల్ల సెన్స్ ఆర్గాన్స్‌పై ఒత్తిడి
- కోపం, భావోద్వేగాలపై నియంత్రణ లేకపోవడం
- అతిగా భయం, కామం వంటి వాటికి లోనయ్యే చర్యలకు పాల్పడడం

ఉండవలసిన దినచర్య

- యోగా చేయడం
- ఏడెనిమిది గంటలకు తగ్గకుండా మంచి నిద్ర.
- తొందరగా నిద్ర లేవడం.
- జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్, వాకింగ్, డాన్సింగ్ వంటి ఏరోబిక్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం.
- తోటివారితో కరుణతో వ్యవహరించడం, పెద్దలు, ఇతరుల పట్ల గౌరవం కలిగి ఉండడం.
- దినచర్య, రుతుచర్య పాటించడం, దయతో వ్యవహరించడం.
- పరోపకార గుణం కలిగి ఉండడం.
- ఆధ్యాత్మిక భావాలు ఉంటే పూజ చేసుకోవడం, పవిత్ర గ్రంథాలు పఠించడం
- కుటుంబంతో ఉల్లాసంగా గడపడం.
- రీడింగ్, సింగింగ్, గార్డెనింగ్, పేయింటింగ్, మ్యూజిక్ వినడం వంటి అలవాట్లతో ఒత్తిడిని దూరం చేసుకోవడం.
- అనవసర జోక్యాలు లేకుండా మనసును నియంత్రించడం

అధునిక జీవన శైలికారణంగా చాలా మంది వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ముఖ్యంగా చాలా మంది ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు సమస్యల బారిన పడుతున్నారు. అయితే ఈ సమస్యలకు ప్రధాన కారణం అనారోగ్యకరమైన ఆహారాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని రకాల కూరగాయల వల్ల కూడా ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. ఎలాంటి కూరగాయలను తీసుకోవడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయో మనం ఇప్పుడు తెలుసుకుందాం..



ఆచి చూచి తినండి

కాలీఫ్లవర్



కాలీఫ్లవర్ ఆరోగ్యకరమైన కూర అయినప్పటికీ ఇది అందరికీ పడదు. దీనిని అధికంగా తీసుకోవడం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. ముఖ్యంగా దీనివల్ల ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి. అంతేకాకుండా కాలీఫ్లవర్‌ను ఎప్పుడూ పచ్చిగా తినకూడదని నిపుణులు తెలుపుతున్నారు. దీనిని పచ్చిగా తినడం వల్ల కడుపు నొప్పి రావడంతోపాటు పొట్టలో దీర్ఘకాలిక సమస్యలకు గురయ్యే అవకాశాలున్నాయి.

పుట్టగొడుగులు




పుట్టగొడుగులు శరీరానికి మంచి పోషకాహారం అయినప్పటికీ దీనిని అతిగా తీసుకోవద్దని నిపుణులు తెలుపుతున్నారు. వీటిని ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే.. అలెర్జీ సమస్యలు వస్తాయి. అందువల్ల వీటిని తీసుకున్నప్పుడు ఏవైనా తేడాగా అనిపిస్తే దానికి దూరంగా ఉండటం మేలు. వండుకునేటప్పుడు కూడా నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

క్యారట్లు



క్యారట్లలో బాడీకి అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయి. కానీ వీటిని పచ్చిగా తింటే.. అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి వీటిని తినేముందు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వీటిని అతిగా తీసుకుంటే.. చర్మం రంగు మారే అవకాశాలు కూడా ఉన్నాయి.

బీట్‌రూట్



బీట్‌రూట్స్‌ను సలాడ్‌లలో ఎక్కువగా వినియోగిస్తారు. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరానికి మంచి ప్రయోజనాలున్నా.. అతిగా తీసుకుంటే శరీరానికి ప్రమాదకరంగా మారే అవకాశాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు వీటిని ఎక్కువగా తీసుకోకపోవడమే మంచిది. అందువల్ల ఎవరైనా సరే, వీటిని పరిమిత పరిమాణంలో తీసుకుంటే మంచిదని నిపుణులు తెలుపుతున్నారు.

● హెల్త్ టిప్స్



ప్రస్తుత కాలంలో ఎక్కువమంది ఎదుర్కొంటున్న సమస్య స్థూలకాయం. దీనికి సులభ పరిష్కారం చూద్దాం..

- గ్లాసు నీళ్లలో అల్లం ముక్క వేసి బాగా ఉడికించాలి. తరువాత వడబోసి.. అందులో కొద్దిగా నిమ్మరసం, తేనె కలుపుకుని తాగాలి లేదా అల్లం ముక్కను నలగ్గొట్టి బట్టలో వేసి పిండితే రసం వస్తుంది. ఆ రసం నేరుగా లేదా కొద్దిగా నిమ్మరసం కలుపుకుని తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తుంటే అదనపు కొవ్వు కరిగి స్లిమ్ అవుతారు.



- ఉల్లి లేని కూరలను.. ఉప్పు లేని పప్పు చారుతో పోల్చుతారు కొంతమంది. ఎందుకంటే ఉల్లి వల్ల వంట రుచికరంగా ఉండడంతో పాటు ఆరోగ్యానికీ ఎంతో మేలు. అలాగే. ఉల్లి వల్ల జుట్టుకు కూడా ఎంతో మంచిదని ఇటీవల కాలంలో ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. ఉల్లి రసాన్ని జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు ఒత్తుగా, నల్లగా పెరుగుతుంది. ముఖ్యంగా ఇది జుట్టును ఊడిపోకుండా కాపాడుతుంది. అందుకు ఏం చేయాలంటే..?




- ఉల్లిని మెత్తగా గ్రైండ్ చేసి.. దాన్నుంచి రసాన్ని తీసి.. ఒక గిన్నెలో నిల్వ చేసి కొబ్బరి నూనెలో కలిపి జుట్టుకు రాసుకుంటూ ఉండాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఈ నూనెను గోరువెచ్చగా వేడి చేసు రాసుకున్నా మంచిదే. ఈ నూనె బట్టతల సమస్యలు రాకుండా కాపాడుతుంది.

హిట్ 2



పార్ట్ వన్ హిట్... హిట్ వన్ సాధించిన జోష్‌తో హిట్ టూ మీద టార్గెట్ ఉండటం కామన్. ఇప్పుడు కమల్‌హాసన్ 'హిట్ 2' మీద టార్గెట్ పెట్టారు. అంటే... హిట్ అయిన పార్ట్ వన్‌కి కొనసాగింపుగా పార్ట్ 2లో నటించనున్నారు. వరుసగా మూడు సీక్వెల్స్ చేయనున్నారు కమల్. ఆ విశేషాల్లోకి వెళదాం.



కమల్‌హాసన్ మంచి జోష్‌లో ఉన్నారు. దానికి ఒక కారణం 'విక్రమ్' ఘనవిజయం సాధించడం. విజయాలు కమల్‌కి కొత్త కాకపోయినా ఈ కరోనా పరిస్థితుల్లో ప్రేక్షకులు థియేటర్లకు రావడానికి సంశయిస్తున్న తరుణంలో హిట్ సాధించడం అంటే చిన్న విషయం కాదు. అది కూడా దాదాపు రూ. 150 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన 'విక్రమ్' సుమారు రూ. 500 కోట్లు వసూలు చేయడం అంటే చిన్న విషయం కానే కాదు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ సేతుపతి, ఫాహద్ ఫాజిల్ కూడా నటించారు. గత జూన్‌లో విడుదలైన ఈ సినిమాకి సీక్వెల్ రూపొందించనున్నారు. అయితే ఈ సీక్వెల్ ఆరంభం కావడానికి కాస్త సమయం పడుతుంది. ఎందుకంటే కమల్ ప్రస్తుతం 'ఇండియన్' (భారతీయుడు) సీక్వెల్ మీద దృష్టి సారించారు.

22నుంచి 'ఇండియన్ 2' సెట్లోకి...

సేనాధిపతి (ఇండియన్)గా, చంద్రబోస్ (చంద్రు)గా కమల్‌హాసన్ రెండు పాత్రల్లో రూపొందిన చిత్రం 'ఇండియన్' (1996). దేశం కోసం ప్రాణాలర్పించడానికి సైతం వెనకాడని స్వాతంత్య్ర సమర యోధుడు సేనాధిపతి దేశానికి పట్టిన చీడ పురుగులాంటి కన్న కొడుకుని మట్టుబెట్టే కథతో శంకర్ తెరకెక్కించిన ఈ చిత్రం సంచలన విజయం సాధించింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' నిర్మాణంలో ఉంది. కరోనా లాక్‌డౌన్, ఈ సినిమా చిత్రీకరణలో జరిగిన ప్రమాదం, చిత్రనిర్మాణ సంస్థ లైకాతో శంకర్‌కి ఏర్పడిన వివాదం (రామ్‌చరణ్ హీరోగా శంకర్ పాన్ ఇండియా సినిమా కమిట్ అయ్యారు. అయితే 'ఇండియన్ 2'ని పూర్తి చేయకుండా శంకర్ మరో ప్రాజెక్ట్ చేయ కూడదంటూ లైకా సంస్థ కోర్టుకి వెళ్లింది).. ఇలా పలు కారణాల వల్ల ఈ చిత్రానికి బ్రేక్ పడింది. ఈ నెల 22న తిరిగి చిత్రీకరణ ప్రారంభించాలనుకుంటున్నారట. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్ కథానాయికలుగా నటిస్తున్నారు.



120 పేజీల కథతో 'రాఘవన్ 2' రెడీ

కమల్‌హాసన్ నటించిన హిట్ చిత్రాల్లో 'వేట్టయాడు విలైయాడు' (రాఘవన్) ఒకటి. 2008లో గౌతమ్ మీనన్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌కి సీక్వెల్ రానుంది. ఈ సీక్వెల్‌కి కథ కూడా రెడీ అయిందట. 120 పేజీల బౌండ్ స్క్రిప్ట్‌ని తయారు చేశారు గౌతమ్. రైట్ టైమ్‌లో షూటింగ్ ఆరంభిస్తామని కూడా పేర్కొన్నారు. పార్ట్ వన్‌లో జ్యోతిక, కమలినీ ముఖర్జీ కథానాయికలుగా నటించారు. సీక్వెల్‌లో ఓ నాయికగా కీర్తీ సురేష్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. 'ఇండియన్ 2' తర్వాత కమల్ 'రాఘవన్' సీక్వెల్ సెట్స్‌లోనే ఎంటరవుతారని చెన్నై టాక్. ఆ తర్వాత 'విక్రమ్ 2' ఆరంభమయ్యే అవకాశం ఉంది.



శభాష్ నాయుడు కూడా...

ఇలా బ్యాక్ టు బ్యాక్ సీక్వెల్స్ ప్లాన్ చేసుకోవడంతో పాటు కమల్ 'శభాష్ నాయుడు' చిత్రం కూడా చేయనున్నారు. దాదాపు మూడేళ్ల క్రితం ఈ చిత్రం ఆరంభమైంది. అయితే ఈ సినిమా షూటింగ్ అప్పుడే కమల్ ఇంట్లో జారి పడటంతో పెద్ద గాయమే అయింది. దాంతో విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత కరోనా ఎఫెక్ట్ వల్ల షూటింగ్ ఆగింది. బ్రహ్మానందం, శ్రుతీహాసన్ కీలక పాత్రల్లో రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్‌ని కూడా మళ్లీ ఆరంభించాలనుకుంటున్నారు.



● అనంత శ్రీరామ్, నాజర్, ప్రకాశ్‌రాజ్, విక్రమ్, సుహాసిని, మణిరత్నం, కార్తీ, తనికెళ్ల భరణి, 'దిల్' రాజు

రాజమౌళి వల్లే ధైర్యం వచ్చింది

– మణిరత్నం

''పొన్నియిన్ సెల్వన్' తీయడం గర్వంగా ఉంది. ఈ చిత్రాన్ని అందరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను'' అని ప్రముఖ దర్శకుడు మణిరత్నం అన్నారు. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష, ఐశ్వర్యా లక్ష్మి, శరత్‌కుమార్, విక్రమ్ ప్రభు, శోభిత ధూళిపాళ, ప్రకాశ్‌రాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'పొన్నియిన్ సెల్వన్'. మణిరత్నం దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ నిర్మించిన ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళంలో తెరకెక్కిన ఈ సినిమా తొలి భాగాన్ని 'పీయస్–1'ని సెప్టెంబర్ 30న విడుదల చేస్తున్నారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ చిత్రంలోని 'చోళ చోళ..' అనే పాటను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ వేడుకలో **మణిరత్నం మాట్లాడుతూ–** ''చిరంజీవిగారికి థ్యాంక్స్ చెప్పాలి. కానీ, అది ఎందుకనేది చెప్పను. తర్వాత మీకే తెలుస్తుంది. రాజమౌళిగారి వల్లే ఇలాంటి (పొన్నియిన్ సెల్వన్) చిత్రాలు తీయగల మనే ధైర్యం వచ్చింది. రెండు భాగాలుగా ఇలాంటి సినిమాలు తీసి మెప్పించవచ్చని నిరూపించారు. అందుకు ఆయనకు థ్యాంక్స్. నా బిడ్డలాంటి ఈ చిత్రం తెలుగులో ఇక 'దిల్' రాజుగారిదే'' అన్నారు.

'దిల్' రాజు మాట్లాడుతూ– ''మణిరత్నంగారి 'అమృత' సినిమా వల్లే నిర్మాతగా మారి, 50 చిత్రాలు నిర్మించాను. ఇప్పుడు 'పొన్నియిన్ సెల్వన్'ని రిలీజ్ చేసే చాన్స్ ఇచ్చిన మణిరత్నంగారికి థ్యాంక్స్'' అన్నారు. **విక్రమ్ మాట్లాడుతూ–** ''మణి సార్‌తో గతంలో 'రావణ్' సినిమా చేశాను. ఇప్పుడు 'పొన్నియిన్ సెల్వన్'. మణిగారితో సినిమా అంటే కల నెరవేరడం వంటిది. మణిగారు, శంకర్‌గారితో సినిమా చేస్తే ఇక రిటైర్ అవ్వొచ్చని అనుకున్నాను.. అంత అద్భుతమైన చిత్రాలు చేస్తారు'' అన్నారు. **కార్తీ మాట్లాడుతూ–** ''ఈ చిత్రంలో మంచి పాత్ర చేశాను. వెయ్యేళ్ల క్రితం జరిగిన చరిత్రను చూపించేందుకు రాబోతున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంలో దాదాపు 50 పాత్రలుంటాయి.. నేనూ భాగమైనందుకు ఆనందంగా ఉంది'' అన్నారు తనికెళ్ల భరణి. ''అన్ని భాషల్లో నటించి, పాన్ ఇండియన్ నటుడు అవడం వేరు. కానీ దక్షిణాది నుంచి తన మేకింగ్ ఆఫ్ స్టైల్‌తో పాన్ ఇండియన్ డైరెక్టర్ అయిన ఏకైక వ్యక్తి మణిరత్నంగారు'' అన్నారు ప్రకాశ్‌రాజ్. ''కల్కి రాసిన 'పొన్నియిన్ సెల్వన్' నవలను సినిమాగా తెరకెక్కించాలని ఎంజీఆర్, కమల్ వంటి వారెందరో ప్రయత్నించారు. కానీ మణిరత్నంగారి వల్లే సాధ్యం అయింది'' అన్నారు నాజర్. **సుహాసినీ మణిరత్నం మాట్లాడుతూ–** ''ఇది మీ డ్రీమ్ ప్రాజెక్టా? అంటే కాదు ఇష్టమైన చిత్రం అని మావారు (మణిరత్నం) అన్నారు. నేను ఆయన్ను ఇష్టపడ్డాను. ఆయన ఈ చిత్రాన్ని ఇష్టపడ్డారు. అంటే మీరు (ప్రేక్షకులు) కూడా ఈ చిత్రాన్ని ఇష్టపడాలి (నవ్వుతూ)'' అన్నారు.

ఏమవుతుందో..

సత్యదేవ్, అతిరా రాజీ జంటగా నటిస్తున్న చిత్రం 'కృష్ణమ్మ'. వీవీ గోపాల కృష్ణ దర్శకత్వం వహించారు. దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మలపాటి, కృష్ణమ్మ నిర్మిస్తున్నారు. కాలభైరవ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'ఏమవుతుందో మనలో..' అనే మెలోడి సాంగ్‌ను డైరెక్టర్ హరీశ్ శంకర్ రిలీజ్ చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను సిద్ శ్రీరామ్ పాడారు. ''ప్రేమలోని గాఢతను తెలిపేలా 'ఏమవుతుందో మనలో..' పాట ఉంటుంది. సన్నీ కూరపాటి విజువల్స్ పాటకు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. త్వరలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● సత్యదేవ్, అతిరా

అర్ధం నాకు ప్రత్యేకం

– శ్రద్ధా దాస్

''ఇప్పటివరకు నేను చేసిన సినిమా లన్నింటిలో 'అర్ధం' నాకు స్పెషల్. ఈ సినిమాలో మాయ అనే మానసిక వైద్య నిపుణురాలి పాత్ర చేశాను. నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఇలాంటి మంచి సినిమాలో మంచి టీమ్‌తో పని చేయడం సంతోషంగా ఉంది'' అని శ్రద్ధా దాస్ అన్నారు. ఎడిటర్, వీఎఫ్ఎక్స్ నిపుణుడిగా చేసిన మణికాంత్ తెల్లగూటి దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'అర్ధం'. శ్రద్ధా దాస్ లీడ్ రోల్‌లో నటించారు. మినర్వా పిక్చర్స్‌పై తెలుగు, తమిళ భాషల్లో రాధికా శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ చివరి వారంలో విడుదలకానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. మణికాంత్ తెల్లగూటి మాట్లాడుతూ– ''మా నాన్న ప్రొజెక్టర్ ఆపరేటర్. నేనీ వేదికపై ఉండటానికి మా నాన్నే స్ఫూర్తి. ఈ సినిమాలో మానవ సంబంధాల గురించి చూపించాం'' అన్నారు. ''సైకలాజికల్ థ్రిల్లర్ కథకు వినోదం మేళవించి ఈ సినిమా తీశాం. మలయాళ, కన్నడ భాషల్లోకి డబ్ చేసి, విడుదల చేస్తున్నాం'' అన్నారు రాధికా శ్రీనివాస్. ''నేను నిర్మించిన 'నాటకం' సినిమాకు ఫుల్ సపోర్ట్ చేశారు. 'అర్ధం' చిత్రాన్ని కూడా ఆదరించాలి'' అన్నారు మరో నిర్మాత శ్రీనివాస్. ఆమని, అజయ్, ప్రభాకర్, మహేంద్రన్, రోషిణి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కెమెరా: పవన్ చెన్నా, సహనిర్మాతలు: సాయిదీప్ చాట్ల, వెంకట రమేష్, పవన్.



● మహేంద్రన్, శ్రద్ధా దాస్

దసరాకి రెడీ



● సుమన్

సాయిచరణ్, పల్లవి జంటగా శ్రీనివాస్ జీఎల్‌బి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఐక్యూ'. కాయగూరల రాజేశ్వరి సమర్పణలో కాయగూరల లక్ష్మీపతి నిర్మిస్తున్న ఈ సినిమా దసరాకి విడుదల కానుంది. ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతోన్న చిత్రమిది. ప్రస్తుతం నటుడు సత్యప్రకాశ్‌గారిపై ఐటమ్ సాంగ్ చిత్రీకరిస్తున్నాం. ఈ 25తో షూటింగ్ పూర్తవుతుంది'' అన్నారు జీఎల్‌బీ శ్రీనివాస్. ''ఈ చిత్రంలో మా అన్న కొడుకు సాయిచరణ్ హీరోగా నటిస్తున్నాడు'' అన్నారు కాయగూరల లక్ష్మీపతి. ''మా తొలి చిత్రం 'ఐక్యూ'ని ఆదరించి, మరిన్ని సినిమాలు చేయడానికి మాకు ఎనర్జీ ఇవ్వాలని ప్రేక్షకులను కోరుకుంటున్నాను'' అన్నారు సాయిచరణ్. సుమన్, సత్యప్రకాశ్, పల్లవి మాట్లాడారు. ఈ చిత్రానికి కథ–మాటలు–సంగీతం: పోలూర్ ఘటికాచలం, కెమెరా: టి. సురేందర్‌రెడ్డి.

తిరుపతి వైభవం



● రావణ్

రావణ్ నిట్టూరు, శ్రీ నికిత జంటగా ఆనంద్ జె. దర్శకత్వం వహించిన చిత్రం 'అలిపిరికి అల్లంత దూరంలో'. రమేష్ డబ్బుగొట్టు, రెడ్డి రాజేంద్ర .పి నిర్మించారు. ఫణి కల్యాణ్ సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'జనులే తరలి చేరే కిటకిటల పర్యాటకుల పట్టణం, ఎవరూ మరిచిపోని అనుభవం ఇచ్చేటి గొప్ప పట్టణం.. మా తిరుపతి' అంటూ సాగే పాటని విడుదల చేయగా మంచి స్పందన వస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. ''తిరుపతి వైభవాన్ని వర్ణిస్తూ సాగిన ఈ పాట అందరి ఫేవరేట్ రింగ్ టోన్‌గా మారిపోయింది. ఎక్కడ చూసినా ఇదే పాట వినిపిస్తోంది. కిట్టు విస్సా ప్రగడ రాసిన ఈ పాటని శంకర్ మహదేవన్, రమ్య బెహరా పాడారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి'' అన్నారు దర్శక–నిర్మాతలు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
652	198
59,646	17,758

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	12,688	▽	278
డోజోన్స్	33,741	▽	258
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,550	△	9
డాక్స్	13,545	▽	153
షాంఘై	3,258	▽	19
నికాయ్	28,930	▽	12

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

అదానీ పవర్ చేతికి డీబీ పవర్

డీల్ విలువ రూ. 7,017 కోట్లు



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం అదానీ పవర్ ఛత్తీస్‌గఢ్‌లో బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంటు కలిగిన డీబీ పవర్‌ను కొనుగోలు చేయనుంది. రూ. 7,017 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో డీల్ కుదిరినట్లు అదానీ పవర్ వెల్లడించింది. డీబీ పవర్ జాంజ్‌గిర్ చంపా జిల్లాలోగల 600 మెగావాట్ల సామర్థ్యంగల రెండు యూనిట్లను నిర్వహిస్తోంది. 923.5 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకి మధ్య, దీర్ఘకాలిక ఒప్పందాలను కలిగి ఉంది. పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియాతో ఇంధన సరఫరా ఒప్పందాలను సైతం కలిగి ఉంది. నగదు చెల్లించేవిధంగా ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అదానీ పవర్ పేర్కొంది. దీనిలో భాగంగా డీబీ పవర్ మాతృ సంస్థ డిలిజెంట్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100 శాతం వాటాను చేజిక్కించుకోనున్నట్లు తెలియజేసింది. డీబీ పవర్‌లో డిలిజెంట్ పవర్ మొత్తం ఈక్విటీ మూలధనాన్ని కలిగి ఉన్నట్లు వివరించింది. 2022 అక్టోబర్ 31లోగా వాటాను సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. అవసరమైతే పరస్పర అంగీకారంతో గడువును పెంచుకోనున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలుతో ఛత్తీస్‌గఢ్‌లో థర్మల్ పవర్ సామర్థ్యాన్ని విస్తరించుకోనున్నట్లు పేర్కొంది. 2006లో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో రిజిస్టరైన డీబీ పవర్ గతేడాది(2021-22)లో రూ. 3,448 కోట్ల టర్నోవర్‌ను సాధించింది. అంతక్రితం ఏడాది(2020-21)లో రూ. 2,930 కోట్లు, 2019-20లో రూ. 3,126 కోట్లు చొప్పున ఆదాయం లభించింది.

వారాంతాన లాభాల స్వీకరణ

- సెన్సెక్స్ నష్టం 652 పాయింట్లు
- 198 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూలతలు
- అన్ని రంగాల షేర్లలో వెల్లువెత్తిన విక్రయాలు
- ఒక్కరోజులోనే రూ. 2.94 లక్షల కోట్లు ఆవిరి



ముంబై: దలాల్ స్ట్రీట్‌లో కొన్ని రోజులుగా సందడి చేసిన బుల్ వారాంతపు రోజైన శుక్రవారం చతికిల పడింది. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 652 పాయింట్లు నష్టపోయి 60వేల దిగువన 59,646 వద్ద స్థిరపడింది. ఈ సూచీలో 30 షేర్లలో ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. నిఫ్టీ 198 పాయింట్లు క్షీణించి 17,758 వద్ద నిలిచింది. దీంతో సెన్సెక్స్ అయిదు, నిఫ్టీ ఎనిమిది రోజుల ర్యాలీకి బ్రేక్ పడింది. బీఎస్ఈలో మిడ్, స్మాల్ సూచీలు ఒకశాతానికి పైగా నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,111 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.1,633 కోట్ల షేర్లను అమ్మారు. స్టాక్ సూచీలు ఒక శాతానికి పైగా పతనంతో ఇన్వెస్టర్లు ఒక్కరోజులోనే రూ.2.94 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.277.58 లక్షల కోట్లకు దిగివచ్చింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ రికవరీతో పాటు డాలర్ ఇండెక్స్ బలపడటంతో రూపాయి విలువ 20 పైసలు క్షీణించి 79.44 వద్ద స్థిరపడింది.

లాభాలతో మొదలై నష్టాల్లోకి: దేశీయ స్టాక్ మార్కెట్ ఉదయం లాభంతోనే మొదలైంది. జాతీయ, అంతర్జాతీయ ప్రతికూలతలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. దీంతో ఆరంభ లాభాలన్నీ ఆవిరయ్యాయి. సెన్సెక్స్ ఒక దశలో 823 పాయింట్లు పతనమై 60,298 వద్ద, నిఫ్టీ 245 పాయింట్లు నష్టపోయి 17,711 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కేంద్రం డీజిల్‌పై ఎగుమతి విండ్‌ఫాల్ లాభాల పన్నును రూ.5 నుంచి రూ.7కు పెంచడంతో రిలయన్స్ షేరు రెండుశాతం నష్టపోయి రూ.2,614 వద్ద స్థిరపడింది.
- బ్యాంకింగ్, ఆర్థిక, బీమా రంగ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనైన సూచీల పతనానికి కారణమయ్యాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, ఎస్‌బీఐ, ఇండస్ ఇండ్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు 3 నుంచి 2శాతం నష్టపోయాయి.

నష్టాలు ఎందుకంటే

జూన్ కనిష్ఠ స్థాయిల నుంచి సెన్సెక్స్, నిఫ్టీలు 18% ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు గరిష్ఠ స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ రెండేళ్ల గరిష్టానికి చేరింది. యూఎస్ ఫెడ్ రిజర్వ్ మినిట్స్, నిరుద్యోగ డేటా వెల్లడి తర్వాత కీలక వడ్డీరేట్ల పెంపు భయాలు మరో సారి తెరపైకి రావడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అవుతున్నాయి. వరుసగా 13 ట్రేడింగ్ సెషన్లో నికర కొనుగోలుదారులుగా నిలిచిన విదేశీ ఇన్వెస్టర్లు గురువారం అనూహ్యంగా రూ.1,706 కోట్ల షేర్లు అమ్మేశారు.

22 నుంచి ఐదు రోజులు కొత్త గోల్డ్ బాండ్ స్కీమ్

గ్రాముకు రూ.5,197గా నిర్ణయం



ముంబై: సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ 2022-23 రెండవ సిరీస్ సోమవారం ప్రారంభమవుతోంది. ఐదు రోజుల పాటు (ఆగస్టు 22 నుంచి 26 వరకూ) చందాదారులకు అందుబాటులో ఉండే ఈ స్కీమ్ బాండ్ ఇష్యూ ధర గ్రాముకు రూ.5,197 అని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆర్‌బీఐ తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే, రూ.50 డిస్కౌంట్‌తో రూ.5,147కే బాండ్ లభిస్తుందని ప్రకటన పేర్కొంది. కేంద్రం తరఫుల ఆర్‌బీఐ చేసే ఈ బాండ్లు స్టాక్ ఎక్స్ఛేంజీలతోపాటు నిర్దిష్ట బ్యాంకులు, పోస్టాఫీసుల్లో కూడా లభ్యమవుతాయి. దేశంలో భౌతిక పసిడికి డిమాండ్ తగ్గించి, ఇందుకు సంబంధించిన డబ్బును పొదుపు పథకాల్లోకి మళ్లించడానికి 2015 నవంబర్‌లో కేంద్రం ఈ పథకాన్ని తీసుకువచ్చిన సంగతి తెలిసిందే.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	51,010
బంగారం (22 క్యారెట్లు)	48,580
వెండి (కిలో)	62,000

మన డేటాతో రైల్వే వ్యాపారం!

- రూ. 1,000 కోట్ల ఆదాయంపై ఐఆర్‌సీటీసీ కన్ను
- కన్సల్టెంట్ల నియామకానికి టెండర్లు



న్యూఢిల్లీ: ఆదాయం పెంచుకునేందుకు వివిధ మార్గాలు అన్వేషిస్తున్న ఇండియన్ రైల్వేస్ కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తాజాగా ప్రయాణికుల డేటాపై దృష్టి సారించింది. వివిధ ప్రైవేట్, ప్రభుత్వ రంగ కంపెనీలకు ఈ డేటాను అందించే వ్యాపారం ద్వారా రూ. 1,000 కోట్ల వరకూ ఆదాయం సమకూర్చుకోవచ్చని (మానిటైజేషన్) అంచనా వేస్తోంది. అలాగే కస్టమర్లకు సదుపాయాలను, సర్వీసులను మరింత మెరుగుపర్చేందుకు కూడా ఇది తోడ్పడగలదని భావిస్తోంది. ఈ ప్రతిపాదన అమలుకు విధి విధానాలను రూపొందించడానికి కన్సల్టెంట్ సర్వీసులను ఐఆర్‌సీటీసీ వినియోగించుకోనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా టెండరు ప్రకటన జారీ చేసింది. ఆతిథ్య, ఇంధన, మౌలిక, వైద్య తదితర రంగాల సంస్థలకు ఈ తరహా డేటా ఉపయోగకరంగా ఉండగలదని భావిస్తున్నట్లు టెండరు ప్రకటనలో పేర్కొంది. ఉదాహరణకు ట్రావెల్ సంస్థలతో ఈ డేటాను పంచుకుంటే.. ఆయా సంస్థలు తమ సర్వీసులు వినియోగించుకోవాలంటూ ప్రయాణికులకు వివరాలను పంపే అవకాశముంది. "భారతీయ రైల్వేస్ తన కస్టమర్/వెండార్ యాప్‌లు, అంతర్గత యాప్‌లలో ఉండే డేటాను ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలోని హోటల్, ట్రావెల్, బీమా, వైద్యం, ఏవియేషన్ తదితర విభాగాల సంస్థలతో వ్యాపార లావాదేవీలు నిర్వహించడం ద్వారా మానిటైజ్ చేయదల్చుకుంది. తద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చని .. అలాగే కస్టమర్లకు సదుపాయాలను, సేవలను మరింత మెరుగుపర్చవచ్చని భావిస్తోంది" అని వివరించింది. దీనికోసం ఎంపికైన కన్సల్టెన్సీ సంస్థ .. వినియోగదారు డేటాను ఈ విధంగా ఉపయోగించుకోవడంలో గోప్యతా నిబంధనలపరంగా ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించవచ్చనే అంశంపై తగు సూచనలు చేయాల్సి ఉంటుంది. డేటా ప్రైవసీ విషయంలో చట్టాలు, సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈ ప్రణాళికను అమలు చేసేందుకు నిబంధనలను క్షుణ్నంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ప్రయాణికులు, రవాణా సేవలు ఉపయోగించుకునే కస్టమర్లు మొదలైన వర్గాల ప్రాథమిక డేటాను విశ్లేషించాలి. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, అయితే దీన్ని అమలు చేయాలంటూ రైల్వే బోర్డు నుంచి ఒత్తిడి ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ప్రైవసీకి రిస్కులపై సందేహాలు...

ప్రయాణికుల వ్యక్తిగత డేటాను ఇలా ఎవరికిపడితే వారికి ఇవ్వడమనేది వినియోగదారుల హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లయ్యే అవకాశాలు ఉన్నాయని సీయూటీఎస్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ అమోల్ కులకర్ణి అభిప్రాయపడ్డారు. సాధారణంగా డేటాను క్రోడీకరించి, ఏ వివరాలు ఎవరివి అనేది బైటపడకుండా గోప్యంగాను, భద్రంగానూ ఉంచాలని ఆయన చెప్పారు. అయితే, గోప్యనీయతను పాటించకుండా ఐఆర్‌సీటీసీ గానీ ఇతర సర్వీస్ ప్రొవైడర్లకు డేటాను ఇచ్చిన పక్షంలో ప్రైవసీ హక్కులకు భంగం కలగడంతో పాటు సదరు డేటా దుర్వినియోగానికి అవకాశాలు ఉన్నాయని కులకర్ణి పేర్కొన్నారు. అయితే, ఇలా డేటాను షేర్ చేసుకోవడం అక్రమం అనేందుకు తగిన చట్టాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో ఒకవేళ డేటాను షేర్ చేసుకుంటే దాన్ని తాను భద్రంగా ఉంచడంతో పాటు థర్డ్ పార్టీలు కూడా పటిష్టమైన ప్రమణాలు పాటించేలా ఐఆర్‌సీటీసీ చూడాల్సి ఉంటుందని కులకర్ణి చెప్పారు.

రోజుకు 11 లక్షలకు పైగా టికెట్లు..

రైల్వే టికెట్లను బుక్ చేసుకునేందుకు ఏకైక మార్గంగా ఈ విషయంలో ఐఆర్‌సీటీసీకి గుత్తాధిపత్యం ఉంది. కంపెనీ గణాంకాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో ఐఆర్‌సీటీసీ ప్లాట్‌ఫాం ద్వారా 43 కోట్ల పైచిలుకు టికెట్లు బుక్ అయ్యాయి. రోజువారీ దాదాపు 63 లక్షల లాగిన్స్ నమోదయ్యాయి. 8 కోట్ల మంది పైగా యూజర్లు ఐఆర్‌సీటీసీ ఆన్‌లైన్ సేవలు వినియోగించుకుంటున్నారు. టికెట్ల బుకింగ్స్‌లో దాదాపు 46 శాతం వాటా మొబైల్ యాప్‌దే ఉంటోంది. ఈ నేపథ్యంలో కంపెనీ దగ్గర భారీ స్థాయిలో ప్రయాణికుల డేటా ఉంటోంది.

మొబైల్ డిస్‌ప్లే దిగుమతులపై 15 శాతం సుంకాలు



న్యూఢిల్లీ: స్పీకర్లు, సిమ్ ట్రే వంటివి అమర్చిన మొబైల్ ఫోన్ డిస్‌ప్లే యూనిట్ల దిగుమతులపై 15 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ) వర్తిస్తుందని కేంద్రీయ పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) వెల్లడించింది. డిస్‌ప్లే అసెంబ్లీని దిగుమతి చేసుకునేటప్పుడు, సుంకాల ఎగవేత కోసం తప్పుడు డిక్లరేషన్లను ఇవ్వకుండా నిరోధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సాధారణంగా మొబైల్ ఫోన్ డిస్‌ప్లే అసెంబ్లీలో టచ్ పానెల్, కవర్ గ్లాస్, ఎల్ఈడీ బ్యాక్‌లైట్ వంటివి ఉంటాయి. వీటి దిగుమతులపై ప్రస్తుతం 10% సుంకం ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-8-2022	
విశాఖ	430-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	430-00
విజయవాడ	430-00
రిటైల్ ధర (డజను)	66.00
19-8-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

జులన్ గోస్వామి పునరాగమనం

ఇంగ్లండ్ గడ్డపై 3 టి20లు, 3 వన్డేల్లో తలపడే భారత మహిళల జట్టును సెలక్టర్లు గురువారం ప్రకటించారు. గత శ్రీలంక సిరీస్‌కు దూరంగా ఉండి రిటైర్మెంట్‌పై అనుమానాలు పెంచిన సీనియర్ పేసర్ జులన్ గోస్వామి ఇప్పుడు జట్టులోకి పునరాగమనం చేయడం విశేషం. ఏడాది తర్వాత వన్డే టీమ్‌లో జెమీమా రోడ్రిగ్స్‌కు చోటు దక్కగా, దేశవాళీ క్రికెట్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లతో సత్తా చాటిన నాగాలాండ్ బ్యాటర్ కిరణ్ ప్రభు నవ్‌గిరేకు తొలిసారి భారత టి20 జట్టులో చోటు లభించింది. రెండేళ్ల తర్వాత హేమలత మళ్లీ వన్డే టీమ్‌కు ఎంపిక కాగా, లెగ్‌స్పిన్నర్ పూనమ్ యాదవ్‌కు రెండు టీమ్‌లలోనూ స్థానం లభించలేదు. ఆంధ్ర క్రికెటర్ సబ్బినేని మేఘన వన్డే, టి20 టీమ్‌లలోనూ అవకాశం దక్కించుకోగలిగింది.



మనీషా కిక్ కొడితే...

- అరుదైన ఘనత సాధించిన ఫుట్‌బాలర్
- మహిళల చాంపియన్స్ లీగ్‌లో ఆడిన తొలి భారతీయురాలిగా గుర్తింపు



పంజాబ్ రాష్ట్రం హొషియార్‌పూర్ జిల్లాలోని ముగొవాల్ గ్రామం...ఆ ఊర్లో ఒక రోజు ఒక టీనేజ్ అమ్మాయి ఫుట్‌బాల్‌తో డ్రిబ్లింగ్ చేస్తూ మైదానంలో కనిపించింది. సుమారు నాలుగు వేల జనాభా ఉన్న ఆ గ్రామానికి ఇది కూడా ఒక వార్తగా మారింది! అమ్మాయిలు ఆటలు ఆడటమే ఎక్కువ అనుకుంటే అందులోనూ ఫుట్‌బాల్ ఆడటం వారిని సహజంగానే ఆశ్చర్యానికి గురి చేసింది. ఊహించినట్లుగానే అందరినుంచీ విమర్శలూ వచ్చాయి. అయితే ఆ అమ్మాయి ఎవ్వరీ మాటా వినలేదు, తన ఆటనూ మార్చుకోలేదు. ఆ తర్వాత మైదానంలోనే సత్తా చాటి అనూహ్య వేగంతో దూసుకుపోయింది. ఇప్పుడు భారత్ తరఫున చాంపియన్స్ లీగ్ బరిలోకి దిగిన తొలి మహిళగా ఘనతకెక్కింది. 21 ఏళ్ల ఆ ప్లేయర్ పేరే మనీషా కల్యాణ్. -సాక్షి క్రీడా విభాగం

పాఠశాలలో ఉన్నప్పుడు చాలా మందిలాగే మనీషా రన్నింగ్ రేస్‌లలో పాల్గొంది. స్కూల్‌లోనే కాబట్టి ఆ విషయంలో ఎప్పుడూ పెద్దగా అభ్యంతరాలు రాలేదు. కానీ ఒక రోజు మనీషాలోని వేగాన్ని, ఆమె కాళ్ల కదలికలను గుర్తించిన కోచ్ ఆమె ఫుట్‌బాల్‌కైతే సరిగ్గా సరిపోతుందని భావించాడు. ఇదే విషయాన్ని ఆమెకు చెప్పాడు. మనీషాకు కూడా వ్యక్తిగత క్రీడలకంటే టీమ్ గేమ్‌లంటే ఎక్కువ ఇష్టం ఉండటంతో వెంటనే ఓకే అనేసింది. అయితే వీరిద్దరు కూడా ఊర్లో వచ్చే అభ్యంతరాల గురించి అసలు ఆలోచించలేకపోయారు. చిన్న పాటి దుకాణం నడుపుకునే తండ్రికి ఆటలపై ఎలాంటి అవగాహన లేకపోగా, అసలు మనకెందుకీ తంటా అన్నట్లుగా పెద్దగా ప్రోత్సహించే ప్రయత్నం కూడా చేయలేదు. అయితే కోచ్ అన్ని విషయాల్లో సరైన మార్గదర్శిగా నిలవడం మనీషాను ముందుకు వెళ్లేలా చేయగలిగింది. అటాకింగ్ మిడ్‌ఫీల్డర్ / ఫార్వర్డ్‌గా మైదానంలో మనీషా తన ముద్ర చూపించగలిగింది. 2021-22లో భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఎమర్జింగ్ ఫుట్‌బాలర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు కూడా ఆమెకే దక్కింది.

వేగంగా దూసుకెళ్లి...

13 ఏళ్ల వయసులో ఫుట్‌బాల్ వైపు మళ్లిన ఈ అమ్మాయి నాలుగేళ్లు తిరిగే సరికే భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. వేర్వేరు వయో విభాగాల సెలక్షన్స్‌లో రాణించడంతో మనీషాకు వరుసగా అవకాశాలు వచ్చాయి. 2018లో దక్షిణాఫ్రికాలో జరిగిన 'బ్రిక్స్' దేశాల అండర్-17 ఫుట్‌బాల్ కప్‌తో తొలిసారి దేశానికి ప్రాతినిధ్యం వహించాలనే మనీషా కల నెరవేరింది. ఆ తర్వాత 2019 ఏఎఫ్‌సీ అండర్-19 చాంపియన్‌షిప్ ఆమె కెరీర్‌లో మరో మలుపు. భారత జట్టు పాకిస్తాన్‌ను 18-0తో చిత్తు చేసిన మ్యాచ్‌లో 'హ్యాట్రిక్'తో చెలరేగిన మనీషా థాయిలాండ్‌పై భారత్ విజయం సాధించడంలోనూ ప్రధాన పాత్ర పోషించింది. ఆ తర్వాత 17 ఏళ్ల వయసులోనే సీనియర్ టీమ్‌కు కూడా ఎంపికై మనీషా సంచలనం సృష్టించింది. 2019 'శాఫ్' చాంపియన్‌షిప్‌లో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో మనీషా అరంగేట్రం చేసింది. గత ఏడాది ఇంటర్నేషనల్ ఉమెన్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో బ్రెజిల్‌పై సాధించిన గోల్ ఆమెను అందరికంటే ప్రత్యేకంగా నిలబెట్టింది.

క్లబ్ తరఫున ఆడుతూ...

ఫుట్‌బాల్‌లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు లీగ్‌లలో క్లబ్‌లకు ఆడే అవకాశం రావడం కూడా ఆటగాళ్లకు వరంలాంటిదే. మనీషా ప్రతిభను గుర్తించిన ఇండియన్ ఉమెన్స్ లీగ్ క్లబ్ 'గోకులమ్ కేరళ' ఆమెను జట్టులోకి తీసుకుంది. ఆ జట్టు వరుస విజయాలతో టైటిల్ గెలవడంలో భాగం కావడంతో పాటు ప్రతిష్టాత్మక ఏఎఫ్‌సీ ఉమెన్స్ క్లబ్ చాంపియన్‌షిప్‌లో గోకులమ్ టీమ్ తరఫున ఆడుతూ ఉజ్బెకిస్తాన్ క్లబ్ బున్యోడ్కర్ ఎఫ్‌సీపై చేసిన గోల్‌తో మనీషా అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ టోర్నీలో 'ఎమర్జింగ్ ప్లేయర్' అవార్డు కూడా గెలుచుకుంది. ఇప్పుడే అదే ఆమెకు యూఈఎఫ్ఏ మహిళల చాంపియన్స్ లీగ్‌లో ఆడే అవకాశం కల్పించింది. భారత మహిళల ఫుట్‌బాల్‌లో దిగ్గజం లాంటి బాలాదేవిని అభిమానించే మనీషా ఆమె తరహాలో మరింత పైకి ఎదగాలని పట్టుదలగా ఉంది.

యూఈఎఫ్ఏ మహిళల చాంపియన్స్ లీగ్‌లో ఆడిన తొలి భారత మహిళగా మనీషా నిలిచింది. 'అపోలాన్ లేడీస్ ఎఫ్‌సీ' టీమ్ తరఫున గురువారం ఆమె అరంగేట్రం చేసింది. ఎస్ఎఫ్‌కే రిగాతో జరిగిన తొలి మ్యాచ్‌లో 60వ నిమిషంలో మరిలెనా జార్జియాకు సబ్‌స్టిట్యూట్‌గా మనీషా మైదానంలోకి దిగింది. అపోలాన్ టీమ్‌తో ఆమె రెండేళ్ల కాలానికి ఒప్పందం కుదుర్చుకుంది.

భారత్ జోరుకు తిరుగుండా!

- నేడు జింబాబ్వేతో రెండో వన్డే
- గెలిస్తే టీమిండియా ఖాతాలో మరో సిరీస్
- మ.గం.12.45 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



హరారే: జింబాబ్వే గడ్డపై అలవోక విజయంతో శుభారంభం చేసిన టీమిండియా ఇప్పుడు అదే జోరుతో సిరీస్‌పై కన్నేసింది. మరో మ్యాచ్ మిగిలుండగానే ఇక్కడే కప్ గెలవాలనే పట్టుదలతో రాహుల్ సేన బరిలోకి దిగుతోంది. బంగ్లాదేశ్‌తో భారీ స్కోర్లను ఛేదించి మరీ గెలిచిన ఆతిథ్య జింబాబ్వే జట్టు... వారాల వ్యవధిలోనే భారత్ ఆల్‌రౌండ్ దెబ్బకు విలవిల్లాడింది. ఇప్పుడు సిరీస్‌లో నిలిచేందుకో, ఈ మ్యాచ్ గెలిచేందుకో కాదు... భారత్ ధాటిని ఎదుర్కోవాలని లక్ష్యంతోనే జింబాబ్వే రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. టీమిండియా సీమర్లను ఆరంభ ఓవర్లలో ఎదుర్కొంటే... గెలుపు, భారీస్కోరు సంగతి అటుంచి కనీసం 50 ఓవర్ల కోటా అయినా ఆడుకోవచ్చని జింబాబ్వే ఆశిస్తోంది.

ఆకాశమే హద్దుగా భారత్

భారత్ జోరుకు ఆకాశమే హద్దు! ముఖ్యంగా ఓపెనింగ్ జోడి. ధావన్-శుబ్‌మన్ గిల్ కొన్నాళ్లుగా తమకెదురైన ప్రతీ ప్రత్యర్థిని, ప్రతీ బౌలర్‌ను అలవోకగా ఎదుర్కొంటున్నారు. సులువుగా పరుగులు, భారీ భాగస్వామ్యాలు నమోదు చేస్తున్నారు. మిడిలార్డర్‌లో రాహుల్ తన పునరాగమనాన్ని చాటాలని ఉవ్విళ్లూరుతుండగా, సంజు సామ్సన్, దీపక్ హుడా సీనియర్ల గైర్హాజరీలో సత్తా చాటుకుంటున్నారు. బౌలింగ్ విభాగం కూడా ఆతిథ్య జట్టు కంటే పటిష్టంగా ఉంది. బరిలోకి దిగి చాన్నాళ్లయినా... దీపక్ చహర్ తొలి ఓవర్‌నుంచే లయ అందుకున్నాడు. గత మ్యాచ్‌లో అతను టాపార్డర్‌ను కూల్చిన తీరు అద్భుతం. స్పిన్నర్ అక్షర్, సీమర్ ప్రసిధ్ కూడా వైవిధ్యమైన బంతులతో బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెడుతున్నారు.

ఒత్తిడిలో జింబాబ్వే

పటిష్టమైన ప్రత్యర్థిని ఎదుర్కొనేందుకు జింబాబ్వే ఆపసోపాలు పడుతోంది. అటు బ్యాటింగ్‌లో, ఇటు బౌలింగ్‌లో తేలిపోతోంది. తొలి వన్డే ఫలితాన్ని పరిశీలిస్తే ఆతిథ్య జట్టు సిరీస్‌ను ఆఖరి దాకా తీసుకొచ్చే అవకాశమైతే లేదనేది స్పష్టంగా అర్థమవుతుంది. ఎటొచ్చీ ఓటమి అంతరాన్ని తగ్గించడం, లేదంటే పరువు నిలుపుకొనే పోరాటంపైనే జింబాబ్వే దృష్టి పెట్టింది. ఇన్నోసెంట్ కైయా, మరుమని, వెస్లీ బాధ్యత కనబరిస్తే మంచి స్కోరు చేయవచ్చు.

పిచ్-వాతావరణం

తొలి వన్డే ఆడిన పిచే! మ్యాచ్ ఆరంభంలో కొత్తబంతి సీమర్లు చెలరేగొచ్చు. తర్వాత బ్యాటింగ్‌కు స్వర్గధామం. ఆటకు అనుకూల వాతవరణం ఉంది. వాన ముప్పే లేదు.

జట్లు (అంచనా)

భారత్: కేఎల్ రాహుల్ (కెప్టెన్), ధావన్, గిల్, ఇషాన్ కిషన్, దీపక్ హుడా, సంజూ సామ్సన్, అక్షర్ పటేల్, దీపక్ చహర్, కుల్దీప్, ప్రసిధ్ కృష్ణ, సిరాజ్.

జింబాబ్వే: రెగిస్ చకాబ్వా (కెప్టెన్), కైయా, మరుమని, సియాన్ విలియమ్స్, వెస్లీ మధెవెర్, సికందర్ రజా, రియాన్ బర్ల్, ల్యూక్ జాంగ్వే, ఇవాన్స్, విక్టర్, రిచర్డ్.

దక్షిణాఫ్రికా ఘన విజయం

ఇన్నింగ్స్, 12 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు


రబడ

లండన్: సొంతగడ్డపై ఇంగ్లండ్‌కు ఘోర పరాభవం... ప్రత్యర్థిపై అన్ని రంగాల్లో ఆధిపత్యం ప్రదర్శించిన దక్షిణాఫ్రికా జట్టు లార్డ్స్ మైదానంలో జరిగిన తొలి టెస్టులో ఇన్నింగ్స్, 12 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు రోజుల్లోపే ఈ మ్యాచ్ ముగియడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో 161 పరుగుల ఆధిక్యం కోల్పోయిన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్ వైఫల్యాన్ని కొనసాగించింది. సఫారీ బౌలర్ల ధాటికి ఆ జట్టు 37.4 ఓవర్లలోనే 149 పరుగులకు కుప్పకూలింది. స్టువర్ట్ బ్రాడ్ (35), అలెక్స్ లీస్ (35) మినహా మిగతావారంతా కనీస పోరాటం కూడా చేయలేకపోయారు. నోర్జే 3 వికెట్లు పడగొట్టగా...జాన్సెన్, కేశవ్ మహరాజ్, రబడ తలా 2 వికెట్లు తీశారు. మ్యాచ్‌లో 7 కీలక వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ పతనాన్ని శాసించిన రబడ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

భారత జట్టులో ప్రీతమ్‌రెడ్డి



కుత్బుల్లాపూర్: 'ఫిబా' అండర్-18 ఆసియా చాంపియన్‌షిప్‌లో తలపడే భారత జట్టులో హైదరాబాద్‌కు చెందిన ఏలేటి ప్రీతమ్ రెడ్డికి చోటు దక్కింది. గత ఐదేళ్లుగా తెలంగాణకు జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన ప్రీతమ్ ఇటీవలి సెలక్షన్ ట్రయల్స్ ద్వారా భారత జట్టులోకి ఎంపికయ్యాడు. అమెరికాలోని ప్రతిష్టాత్మక ఐఎంజీ అకాడమీలో అతను మూడేళ్ల పాటు శిక్షణ తీసుకున్నాడు. టోర్నీలో పాల్గొనేందుకు 12 మంది సభ్యుల భారత బృందం శుక్రవారం ఇరాన్ దేశ రాజధాని టెహ్రాన్‌కు బయల్దేరింది. ఈ టోర్నీ గ్రూప్ దశలో ఆది, సోమవారాల్లో భారత్ వరుసగా చైనా, కొరియాలతో తలపడుతుంది.

ప్రజ్ఞానంద జైత్రయాత్ర



మయామి: భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద ఎఫ్‌టీఎక్స్ క్రిప్టో కప్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో వరుస విజయాలతో ఎదురు లేకుండా దూసుకెళ్తున్నాడు. తాజాగా మరో మేటి ర్యాంకర్ లెవాన్ అరోనియన్ అతని ఎత్తులకు చిత్తయ్యాడు. శుక్రవారం జరిగిన నాలుగో రౌండ్ పోరులో 17 ఏళ్ల ప్రజ్ఞానంద 3-1తో ప్రపంచ ఆరో ర్యాంక్ గ్రాండ్‌మాస్టర్ అరోనియన్ (ఆర్మేనియా)ను కంగు తినిపించాడు. తొలి రెండు గేముల్లో ఇద్దరు పోటాపోటీగా తలపడ్డారు. దీంతో చెరో విజయంతో 1-1తో సమంగా నిలిచారు. అయితే మూడు, నాలుగు గేముల్లో ఆర్మేనియన్ ఎత్తులేవీ భారత ఆటగాడి ముందు పారలేదు. నాలుగు రౌండ్లు ముగిసే సరికి భారత టీనేజర్ 12 పాయింట్లతో ప్రపంచ నంబర్‌వన్, చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

క్లుప్తంగా

పాలి సెట్‌లో 35,735 సీట్ల భర్తీ

- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి

సాక్షి అమరావతి: ఏపీ పాలిసెట్-2022 తొలి విడత అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో భాగంగా కన్వీనర్ కోటాలో 35,735 మందికి సీట్లు కేటాయించినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలిసెట్‌కు 1,31,608 మంది హాజరుకాగా 1,20,867 మంది క్వాలిఫై అయ్యారన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు 37,812 మంది రాగా వారిలో 37,040 మంది కౌన్సెలింగ్‌లో ఆప్షన్లను నమోదు చేసినట్లు తెలిపారు. వీరిలో 35,735 మందికి సీట్లు కేటాయించినట్లు వివరించారు. కాగా, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 16,904 సీట్లకుగాను 10,714, ఎయిడెడ్ పాలిటెక్నిక్‌లలో 94 సీట్లకుగాను 83, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 57,362 సీట్లలో 24,932 సీట్లు భర్తీ అయినట్లు చెప్పారు. ప్రైవేటు పాలిటెక్నిక్‌లలోని వొకేషనల్ డిప్లొమా కోర్సులకు సంబంధించి 131 సీట్లకుగాను 6 భర్తీ అయ్యాయన్నారు. మొత్తంగా కన్వీనర్ కోటాలో 74,491 సీట్లకుగాను 35,735 సీట్లు భర్తీ కాగా 38,756 సీట్లు మిగిలి ఉన్నట్లు నాగరాణి వివరించారు.

పలు మార్గాల్లో ద.మ.రైల్వే ప్రత్యేక రైళ్లు



సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రూట్‌లలో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విశాఖ-సికింద్రాబాద్ (08579/08580) స్పెషల్ ట్రైన్ ఈనెల 24 నుంచి సెప్టెంబర్ 28 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 7 గంటలకు విశాఖ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.20 గంటలకి సికింద్రాబాద్‌కు చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 29 వరకు ప్రతి గురువారం సాయంత్రం 7.40 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.40 గంటలకి విశాఖ చేరుకోనుంది. విశాఖపట్నం-మహబూబ్ నగర్ (08585/08586) స్పెషల్ ట్రైన్ ఈనెల 23 నుంచి సెప్టెంబర్ 27 వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 5.35 గంటలకు విశాఖ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 24 నుంచి 28 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 6.20 గంటలకి మహబూబ్‌నగర్ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.50 గంటలకి విశాఖ చేరుకుంటుంది. విశాఖపట్నం-తిరుపతి (08583/08584) స్పెషల్ ట్రైన్ ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 26 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 7 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 27 వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.55 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10.15 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

ప్రేమించలేదని గొంతు కోసుకున్నాడు

- అనంతపురంలో ఘటన



చికిత్స పొందుతున్న బాలాజీనాయక్

అనంతపురం క్రైం: 'పెళ్లయినా ఫర్వాలేదు. కానీ నన్ను ప్రేమించాలి. చిన్ననాటి నుంచి నిన్నే ప్రేమిస్తున్నా. నువ్వు నాతో మాట్లాడడం మానేస్తే ఎలా? ప్రేమించకపోతే కత్తితో గొంతు కోసుకుంటా' అని ఓ వివాహితను బెదిరిస్తున్న యువకుడు చివరకు అన్నంత పనీ చేశాడు. కత్తితో తన గొంతు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ ఘటన శుక్రవారం అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డు పాపంపేటలో చోటు చేసుకుంది. అనంతపురం రూరల్ పరిధిలోని ఎల్‌బీ నగర్‌కు చెందిన గోపాల్‌నాయక్ కుమారుడు బాలాజీ నాయక్ డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పూర్తి చేశాడు. అతని చిన్ననాటి స్నేహితురాలు పాపంపేటలో ఉంటోంది. ఆమెకు నాలుగేళ్ల క్రితమే వివాహమైంది. కానీ, బాలాజీ నాయక్ ప్రేమ పేరుతో ఆమెను వేధించేవాడు. విసిగిపోయిన ఆమె రెండు నెలల నుంచి మాట్లాడడం మానేసింది. బాలాజీనాయక్ శుక్రవారం పాపంపేట చేరుకుని ఆమె స్నేహితురాలి భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లగానే లోపలికి వెళ్లి తనను ప్రేమించాలని మరోసారి వేధించాడు. తనకు వివాహమైందని, వేధించడం మానుకోవాలని చెప్పినా వినలేదు. చివరకు అదే ఇంట్లోని కత్తి తీసుకుని గొంతు కోసుకున్నాడు. భయాందోళనలకు గురైన ఆమె విషయాన్ని బాలాజీ నాయక్ సోదరులు ఎం.రవీంద్ర నాయక్, మని నాయక్‌కు తెలియజేసింది. వారు వెళ్లి చూడగా బాలాజీ నాయక్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. పోలీసుల సహాయంతో ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'తాతా... నాకు వ్యవసాయం నేర్పుతావా?'
- మహర్షి సినిమాలో రుషి పాత్రధారి మహేష్‌బాబు ప్రశ్న
'ఒకరు నేర్పేదేంటి బాబూ...? ఈ నేలపైన కాలు పెడితే ఆ భూమి తల్లే నిన్ను లాగేసుకుంటది'
- ఓ తాత సమాధానం

నాడు వ్యవసాయం దండగని పాలకులు చిన్నచూపు చూస్తే నేడు పండుగలా మార్చి అన్నదాతకు అండగా నిలుస్తోంది ప్రభుత్వం. రైతన్నలకు మేలు చేయడంతోపాటు ఆరోగ్యకరమైన సమాజం దిశగా చర్యలు చేపట్టింది. పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు, బయో పెస్టిసైడ్స్ వాడకాన్ని ప్రోత్సహిస్తోంది.



'ప్రకృతి'కి ప్రణామం

సేంద్రియ సేద్యానికి ప్రభుత్వం ప్రోత్సాహం.. రైతులకు పెద్ద ఎత్తున శిక్షణ, సహకారం

భారీగా తగ్గిన పురుగు మందుల వినియోగం.. మేము సైతం అంటున్న విద్యాధికులు

(బీవీ రాఘవరెడ్డి)



రైతులకు అవగాహన కలిగించేందుకు రాష్ట్ర స్థాయిలో రైతు సాధికారత సంస్థ పర్యవేక్షిస్తుండగా జిల్లాల్లో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు పనిచేస్తోంది. ఇందులో నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్స్ (ఎన్ఎఫ్ఏ) మాస్టర్ ట్రైనర్స్, యూనిట్ ఇన్‌చార్జిలు, గ్రామ స్థాయిలో ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (ఐసీఆర్‌సీ) పని చేస్తున్నారు. ఒక్కో ఐసీఆర్‌సీ 50-100 మంది రైతులను గుర్తించి ప్రకృతి వ్యవసాయంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా దగ్గరుండి సహకారం అందిస్తోంది. ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేసి దేశీ విత్తనాలు, 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లను సమకూరుస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోంది. ప్రభుత్వం అందిస్తోన్న ప్రోత్సాహంతో రైతులతో పాటు ఉద్యోగులు సైతం సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు.

రాష్ట్రంలో సహజ వ్యవసాయం ఇలా..

- 2021-22లో ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్) 3,720 గ్రామ పంచాయతీల్లో అమలు చేశారు.
- 2,68,263 హెక్టార్ల విస్తీర్ణంలో 5,92,089 మంది రైతులు సహజ వ్యవసాయం చేశారు.
- 3,70,124 మంది రైతులు ప్రస్తుత ఖరీఫ్‌లో నాట్లు వేశారు.
- 45,201 మంది గ్రీన్ కవర్ మోడల్‌లో సాగు చేసి ఏడాది పొడవునా ఆదాయాన్ని పొందారు.
- 1,70,848 గృహాల్లో ఏపీసీఎన్ఎఫ్ పద్ధతుల్లో కిచెన్ గార్డెన్‌లను పెంచారు.
- గ్రామాల్లో 3,909 బయో ఇన్‌పుట్ షాపులను ఏర్పాటు చేశారు.

తగ్గిన పురుగుమందుల వినియోగం..

2020-21 ఖరీఫ్ (1,388.48 మెట్రిక్ టన్నులు)తో పోలిస్తే 2021-22 (1,018 మెట్రిక్ టన్నులు) ఖరీఫ్‌లో పురుగు మందుల వినియోగం 370.48 మెట్రిక్ టన్నులు తగ్గింది. రాష్ట్ర ప్రభుత్వం పంటల విధానంలో మార్పు, సమగ్ర తెగుళ్ల నిర్వహణ పద్ధతులు, బయో పెస్టిసైడ్‌ల వాడకం, సేంద్రియ వ్యవసాయం తదితర విధానాలను ప్రోత్సహించటం దీనికి కారణం. 2014-15లో 4,050 మెట్రిక్ టన్నుల పురుగు మందులు వినియోగించగా 2020-21 నాటికి 2,342.86 మెట్రిక్ టన్నులకు తగ్గడం గమనార్హం.

ప్రత్యేక యూనివర్సిటీ..

ప్రకృతి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు చేపట్టే పరిశోధనలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పులివెందుల ఐజీ కార్ల్ ప్రాంగణంలో ఇండో-జర్మన్ ప్రపంచ వ్యవసాయ విజ్ఞాన పరిశోధన-శిక్షణా అకాడమీ (ఐజీజీఏఏఆర్ఎల్)ని ఏర్పాటు చేస్తోంది. ఈ యూనివర్సిటీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూలై 7వ తేదీన శంకుస్థాపన చేశారు. జర్మనీ గ్రాంట్‌తో రూ.222 కోట్ల వ్యయంతో యూనివర్సిటీని రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పుతోంది.

గుంటూరు టెక్కీ.. హైటెక్ వ్యవసాయం



గుంటూరుకు చెందిన బీటెక్ గ్రాడ్యుయేట్ మెండా నిశ్చల్‌కుమార్ లండన్‌లో ఉన్నత విద్య చదివాడు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ కంపెనీలో ప్రాజెక్టు మేనేజర్‌గా కొన్నేళ్లు పనిచేశాడు. ఆయన తండ్రి డాక్టర్ ఫణికుమార్ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో కంటి విభాగం హెచ్‌వోడీగా పదవీ విరమణ చేయగా తల్లి కె.విజయకుమారి గుంటూరు మెడికల్ కళాశాలలో బయోకెమిస్ట్రీ విభాగం హెచ్‌వోడీగా ఉన్నారు. ఉద్యోగంతో సంతృప్తి చెందని నిశ్చల్ స్వదేశానికి తిరిగి వచ్చి నరసరావుపేటకు సమీపంలోని కోటప్పకొండకు 8 కి.మీ. దూరంలో 'ఎన్‌సీ ఎకోఫార్మ్స్' ఏర్పాటు చేశారు. ఇక్కడ 60 ఎకరాల్లో 11 రకాల పంటలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. గొర్రెలు, ముర్రా గేదెలు, గిరి, సహివాల్, ఒంగోలు జాతి ఆవులను పోషిస్తున్నారు. నాటు, గిరిరాజ, అశీల క్రాస్, గిన్నె, టర్కీ కోళ్లను పెంచుతున్నారు.

అమెరికాలో ఉద్యోగం.. స్వగ్రామంలో సేద్యం



అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కర్నూలు జిల్లా దేవనకొండ మండలం తువ్వదొడ్డి గ్రామానికి చెందిన మధు కేశవరెడ్డి ఏటా రెండు నెలలు గ్రామంలోనే ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. ఆయన సోదరులు మద్దిలేటిరెడ్డి, మహేశ్వరరెడ్డి సహకారంతో 40 ఎకరాల్లో దానిమ్మ, 25 ఎకరాల్లో మామిడి తోటల పెంపకం చేపట్టారు. ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సలహాలు తీసుకుంటూ అమెరికా నుంచే వీడియో కాల్ ద్వారా సోదరులకు సాగులో మెళకువలు సూచిస్తున్నారు. సేంద్రియ పద్ధతుల్లో తోటలు సాగు చేసేందుకు పది ఆవులను ప్రత్యేకంగా పెంచుతున్నారు. గ్రామంలో రైతులకు సైతం సూచనలు అందిస్తూ ప్రకృతి వ్యవసాయంలో పాలు పంచుకుంటున్నారు.

ఉద్యోగాన్ని వీడి..



వైఎస్సార్ జిల్లా చెన్నూరు మండలం ఉప్పరపల్లె గ్రామానికి చెందిన గాజులపల్లి జగన్‌మోహన్‌రెడ్డి మహీంద్ర అండ్ మహీంద్ర డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తితో ఉద్యోగాన్ని వదిలేసి 16 ఎకరాల్లో పండ్ల తోటలు, మరో 10 ఎకరాల్లో దేశీయ వరి పంట సాగు చేస్తున్నారు. ప్రభుత్వ సహకారం, అధికారుల సూచనలతో ఇబ్బందులను అధిగమిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాస్తవాలను కప్పిపుచ్చడమంటే కోర్టును తప్పుదోవ పట్టించడమే

- ఇలాంటి చర్యలను ఉక్కుపాదంతో అణచివేయాలి
- తేల్చిచెప్పిన హైకోర్టు
- పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా



సాక్షి, అమరావతి: వాస్తవాలను కప్పిపుచ్చి పిటిషన్ దాఖలు చేయడమంటే కోర్టును తప్పుదోవ పట్టించడమే అవుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఇలా వాస్తవాలను కప్పిపుచ్చి కోర్టు నుంచి సానుకూల ఉత్తర్వులు పొందేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిపై హైకోర్టు మండిపడింది. ఇలాంటి చర్యలను ఉక్కుపాదంతో అణచివేయాలంది. తద్వారా న్యాయ ప్రక్రియ స్వచ్ఛతను కాపాడేందుకు ఆస్కారం ఉంటుందని స్పష్టం చేసింది. వాస్తవాలను దాచిపెట్టినందుకు విజయవాడకు చెందిన మునగాల రమేశ్ అనే వ్యక్తికి రూ.50 వేల జరిమానా విధించింది. ఆ మొత్తాన్ని 15 రోజుల్లో న్యాయసేవాధికార సంస్థకు జమ చేయాలని అతడిని ఆదేశించింది. జమ చేయడంలో విఫలమైతే.. ఆ మొత్తాన్ని అతడి నుంచి రాబట్టేందుకు చర్యలు ప్రారంభించాలని రిజిస్ట్రీకి సూచించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారీ ఇటీవల తీర్పు వెలువరించారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, చట్టవిరుద్ధంగా విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు తన ఇంటిని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ మునగాల రమేశ్ అనే వ్యక్తి ఈ నెల 11న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మునిసిపల్ కార్పొరేషన్ తరపు న్యాయవాది మలసాని మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు కార్పొరేషన్ అధికారులు ఆగస్టు 3నే నోటీసు ఇచ్చారని తెలిపారు. దీంతో న్యాయమూర్తి పిటిషనర్ రమేశ్‌ను హైకోర్టుకు పిలిపించి నోటీసు గురించి అడిగారు. అధికారులు తన సంతకం తీసుకున్నారని ఓసారి, సంతకం తీసుకుని నోటీసు ఇవ్వలేదని మరోసారి పిటిషనర్ చెప్పారు. ఆ నోటీసుపై సంతకం తనదేనని అంగీకరించారు. అయితే ఈ విషయాలను రమేశ్ తన న్యాయవాదికి తెలియచేయలేదు. దీంతో పిటిషనర్ తీరుపై న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసు ఇచ్చినప్పటికీ ఇవ్వలేదంటూ కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. ఇది వాస్తవాలను కప్పిపుచ్చడమేనన్నారు.

ఆస్ట్రేలియాతో విన్యాసాల్లో ఐఎన్ఎస్ సుమేధ



భారత్, ఆస్ట్రేలియా నౌకాదళాల మధ్య సముద్ర భాగస్వామ్య ప్రదర్శనలో దేశ యుద్ధనౌక ఐఎన్ఎస్ సుమేధ పాల్గొంది. రాయల్ ఆస్ట్రేలియన్ నేవీకి చెందిన హెచ్ఎంఏఎస్ అంజాక్-క్లాస్ యుద్ధ నౌకతో కలిసి హెలికాప్టర్ల క్రాస్ డెక్ ల్యాండింగ్ తదితర విన్యాసాలు చేసింది. ఇరుదేశాల నావికాదళ సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పరస్పర సాంకేతిక పరిజ్ఞాన మార్పిడికి ఈ భాగస్వామ్య ప్రదర్శనలు తోడ్పడతాయని భావిస్తున్నారు. - దొండపర్తి(విశాఖ దక్షిణ)

రెండు రోజుల్లో 823 సీఏఎస్ పోస్టుల తుది జాబితా

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలో సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్) పోస్టుల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. రెండు రోజుల్లో అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించి, ఆ మరుసటి రోజే కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల 823 సీఏఎస్ పోస్టుల భర్తీకి వైద్య శాఖ నోటిఫికేషన్ విడుదల చేయగా, దరఖాస్తు చేసుకున్నవారిలో నాలుగు వేల మందికి పైగా అభ్యర్థులతో ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల చేశారు. దీనిపై అభ్యంతరాల స్వీకరణ పూర్తయింది. వాటిని పరిశీలించి, తుది మెరిట్ జాబితా, సెలక్షన్ జాబితా ఆదివారంలోపు విడుదల చేయాలని అధికారులు ప్రణాళిక రచించారు. పోస్టింగ్‌ల కోసం సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించాలని భావిస్తున్నారు.

26 వరకు సీఏఎస్ స్పెషలిస్ట్ పోస్టుల దరఖాస్తుకు గడువు

వైద్య విధాన పరిషత్‌లో 351 సీఏఎస్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈ నెల 26వ తేదీ దరఖాస్తులను స్వీకరిస్తారు. వైద్య, ఆరోగ్య శాఖలో మానవ వనరుల కొరత లేకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మూడేళ్లలో 42 వేలకు పైగా పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ప్రస్తుతం 823 సీఏఎస్, 351 సీఏఎస్ స్పెషలిస్ట్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. మరోవైపు వైద్య శాఖలో ఖాళీ అయిన పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది.

స్కూళ్లలో బాలలపై లైంగిక వేధింపులకు చెక్

- పాఠశాల విద్యా శాఖ చర్యలు
- స్కూళ్లలో పిల్లలకు పోక్సో చట్టంపై అవగాహన
- పోస్టర్లు, ఫిర్యాదు పెట్టెల ఏర్పాటు
- 15 రోజులకొకసారి ఫిర్యాదులు చదివే ఏర్పాటు
- తదుపరి చర్యలకు సిఫారసులు
- పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు

సాక్షి అమరావతి: సుప్రీంకోర్టు, హైకోర్టు జువెనైల్ జస్టిస్ కమిటీ ఆదేశాల మేరకు స్కూళ్లలో పిల్లలపై లైంగిక వేధింపుల నివారణకు పాఠశాల విద్యాశాఖ కఠిన చర్యలు చేపట్టింది. లైంగిక వేధింపులు, పోక్సో చట్టం గురించి పిల్లల్లో అవగాహన కల్పించాలని ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, జిల్లా విద్యా శాఖాధికారులను ఆదేశించింది. రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో పోస్టర్లు, ఫిర్యాదు పెట్టెలు ఉంచాలని తెలిపింది. విద్యార్థులందరికీ కనిపించేలా పోస్టర్లు ఉంచాలని, తగిన పరిమాణంలో తగిన మెటీరియల్‌తో కూడిన ఫిర్యాదు పెట్టె హెడ్‌మాస్టర్ గది వెలుపల ఉంచాలని సూచించింది. ఫిర్యాదులను ఈ పెట్టెలో వేయవచ్చు.

ఇతర ప్రధాన సూచనలు

- పోస్టర్లలో ఏకరూపత ఉండాలి. పోస్టర్ల ముద్రణ, ఫిర్యాదు పెట్టె కోసం పాఠశాల నిర్వహణ గ్రాంట్ నుండి నిధులు తీసుకోవచ్చు.
- తాళం ఉండే ఏదైనా చిన్న పెట్టెను ఫిర్యాదు పెట్టెగా ఉపయోగించవచ్చు
- మండల విద్యాధికారి, ఇతర విభాగాల అధికారుల సమక్షంలో సమీపంలోని పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్, ఏఎన్ఎం 15 రోజులకు ఒకసారి ఫిర్యాదు పెట్టెను తెరిచి, అందులో ఉన్న ఫిర్యాదులను చదవాలి
- ఫిర్యాదుపై అవసరమైన చర్యలకు వారు సంబంధిత శాఖకు తెలపాలి
- ఏ విధంగానూ, ఏ సమయంలోనూ ఫిర్యాదుదారు వివరాలను బహిర్గతం చేయకూడదు. అత్యంత గోప్యంగా ఉంచాలి. ఎంఈవోలు డీఈవోలకు రెగ్యులర్ రిపోర్టును పంపాలి
- డీఈవో ప్రతి నెలా 1, 15 తేదీల్లో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌కి నివేదిక పంపాలి

మంకీపాక్స్ నిర్ధారణ కిట్ విడుదల

- మొట్టమొదటి స్వదేశీ కిట్ ఇదే
- విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో తయారీ



కిట్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ ప్రొఫెసర్ అజయ్‌కుమార్ సూద్

దొండపర్తి (విశాఖ దక్షిణ): ప్రపంచాన్ని కలవరపెడుతున్న మంకీపాక్స్ వైరస్‌ను నిర్ధారించే కిట్ అందుబాటులోకి వచ్చింది. విశాఖలోని మెడ్ టెక్ జోన్‌లో ట్రాన్సాసియా బయో-మెడికల్స్ సంస్థ ఆర్టీపీసీఆర్ విధానంలో ఈ కిట్‌ను అభివృద్ధి చేసింది. స్వదేశంలో తయారైన మొట్టమొదటి మంకీపాక్స్ నిర్ధారణ కిట్ ఇదే కావడం విశేషం. ట్రాన్సాసియా-ఎర్బా పేరుతో తయారు చేసిన ఈ కిట్‌ను కేంద్రంలోని ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ ప్రొఫెసర్ అజయ్‌కుమార్ సూద్ శుక్రవారం మెడ్‌టెక్ జోన్‌లో ఆవిష్కరించారు. అత్యంత సున్నితమైన, కచ్చితమైన ఫలితం కోసం ఈ కిట్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు సంస్థ పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న మంకీపాక్స్ కేసులను ముందస్తుగా గుర్తించడం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ కిట్ ఉపయోగపడుతుందని ట్రాన్సాసియా వ్యవస్థాపక చైర్మన్ సురేష్ వాజిరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సైంటిఫిక్ సెక్రటరీ అరబింద మిత్ర, ఐసీఎంఆర్ మాజీ డైరెక్టర్ బలరాం భార్గవ, బయోటెక్నాలజీ విభాగం సలహాదారుడు అల్కా శర్మ తదితరులు పాల్గొన్నారు.

'డిజిటల్' ఫిష్!

'ఫిష్ ఆంధ్ర'కు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం

- వినియోగదారుల కోసం కాల్ సెంటర్
- రిటైల్ అవుట్‌లెట్‌లకు పీఓఎస్ మిషన్లు
- ఆప్కాఫ్-పేటీఎం సంస్థల మధ్య ఒప్పందం
- ఈ నెలాఖరులోగా అందుబాటులోకి సేవలు



సాక్షి, అమరావతి: పోషక విలువలతో కూడిన తాజా మత్స్య ఉత్పత్తుల విక్రయాలకు 'ఫిష్ ఆంధ్ర' డిజిటల్ మార్కెటింగ్ ద్వారా విస్తృత ప్రచారం కల్పించి ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం డిజిటల్ మార్కెటింగ్ అండ్ కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (డీఎం-సీఆర్ఎం)ను అందుబాటులోకి తెస్తోంది. తలసరి వినియోగం పెంచడమే లక్ష్యంగా ఆక్వా హబ్‌లు, రిటైల్ అవుట్‌లెట్ల ద్వారా సర్కిపై చేసిన మత్స్య ఉత్పత్తులకు శ్రీకారం చుట్టారు. లైవ్ ఫిష్‌లే కాకుండా ఐస్‌లో భద్రపర్చిన వ్యాక్యూమ్ ప్యాక్ ఫిష్‌లను దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తెస్తున్నారు.

వంద ఆక్వాహబ్‌లు లక్ష్యం

దాదాపు 48.13 లక్షల టన్నుల మత్స్య దిగుబడులతో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో వీటి తలసరి వినియోగం కేవలం 8.07 కిలోలు మాత్రమే ఉంది. స్థానిక వినియోగం పెంచడమే లక్ష్యంగా రాష్ట్రంలో వంద ఆక్వా హబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. తొలి విడతగా డిసెంబర్ నెలాఖరులోగా రూ.325.15 కోట్ల అంచనాతో 25 హబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పులివెందుల, పెనమలూరు ఆక్వా హబ్‌లు అందుబాటులోకి రాగా తిరుపతి, కర్నూలు, శ్రీకాకుళం, చిత్తూరులలో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. విజయనగరం, పార్వతీపురం, అమలాపురం, తాడేపల్లిగూడెం, మంగళగిరి, గుంటూరులో ఆక్వాహబ్‌ల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. మిగిలిన జిల్లాల్లో ప్రాథమిక దశలో ఉన్నాయి.

వారానికి 50 వేల కిలోల విక్రయాలు

హబ్‌ల పరిధిలో రిటైల్ అవుట్‌లెట్స్ కోసం 10,427 మంది దరఖాస్తు చేయగా, 2724 మంది అర్హులను గుర్తించారు. ఇప్పటి వరకు 398 రిటైల్ అవుట్‌లెట్స్ గ్రౌండింగ్ చేయగా 355 అవుట్‌లెట్స్ ట్రయిల్‌రన్ ప్రారంభించాయి. మరోవైపు అందుబాటులో ఉన్న 81 ఫిష్‌మార్ట్ తరహా దుకాణాలను రిటైల్ అవుట్‌లెట్స్‌గా ఆధునికీకరిస్తున్నారు. పులివెందుల, విశాఖపట్నం, వినుకొండల్లో సూపర్ ఫార్మట్‌స్టోర్స్ (రూ.20 లక్షల యూనిట్) అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో రిటైల్ అవుట్‌లెట్ పరిధిలో 138 కిలోల చొప్పున వారానికి 50 వేల కిలోల మత్స్య విక్రయాలు జరుగుతున్నాయి. ప్రతి అవుట్‌లెట్‌లో పీవోఎస్ మిషన్లను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇందుకోసం పేటీఎం సంస్థతో ఆప్కాఫ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. తొలి విడతగా 2 వేల రిటైల్ షాపులకు పేటీఎం డివైజ్‌లు సరఫరా చేయనున్నారు. పీఓఎస్‌తో పాటు రూ.22 వేల విలువైన ఇతర సపోర్టింగ్ పరికరాలను రిటైల్ అవుట్‌లెట్స్‌కు సమకూర్చనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 2వేల రిటైల్ అవుట్‌లెట్స్‌లో పేటీఎం, ఇతర డిజిటల్ పరికరాలను ఆగస్టు నాలుగో వారం నుంచి అందుబాటులోకి తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు కంటైనర్ తరహా రిటైల్ అవుట్‌లెట్స్ ఏర్పాటు కోసం గ్రామీణ ప్రాంతాల్లో 150, అర్బన్ ప్రాంతాల్లో 191 చోట్ల స్థలాలను గుర్తించారు. త్వరలో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు జరుగుతోంది.

డిజిటల్ మార్కెటింగ్

రిటైల్ అవుట్‌లెట్స్ ద్వారా నాణ్యమైన సేవలు అందుబాటులోకి తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. డిజిటల్ మార్కెటింగ్ వ్యవస్థ ద్వారా ఫిష్ ఆంధ్రను ప్రమోట్ చేయాలని సంకల్పించాం. ఇందుకోసం ప్రత్యేకంగా యూట్యూబ్ చానల్‌తో పాటు కాల్ సెంటర్ ఏర్పాటు యోచనలో ఉన్నాం. వినియోగదారుల ఫీడ్ బ్యాక్ తీసుకుంటూ తాజా ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తాం.

– కె.కన్నబాబు, మత్స్యశాఖ కమిషనర్

ఫిష్ ఆంధ్ర బ్రాండింగ్

హబ్‌ల పరిధిలో ఏర్పాటు చేస్తున్న రిటైల్ అవుట్‌లెట్స్, కియోస్క్‌లు, సూపర్‌ఫార్మెట్, వాల్యూ యాడెడ్ యూనిట్ల ద్వారా మత్స్య ఉత్పత్తుల అమ్మకాలను ఫిష్ ఆంధ్ర పేరిట బ్రాండింగ్ చేస్తున్నారు. హోర్డింగ్‌లు, పేపర్లలో ప్రకటనల కంటే ప్రజలు ఎక్కువగా డిజిటల్ మార్కెటింగ్ వైపు ఆకర్షితులవుతున్నారు. వారికి మరింత చేరువయ్యేలా ఫిష్ ఆంధ్ర పేరిట యూట్యూబ్ చానల్‌తో పాటు గూగుల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ప్రచారం చేయనున్నారు. ఆక్వా, మత్స్య ఉత్పత్తులు తీసుకోవడం ద్వారా చేకూరే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ద్వారా వినియోగదారుల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తూ ముందుకెళ్లనున్నారు. ఇందుకోసం కాల్ సెంటర్ ఏర్పాటు యోచన కూడా ఉంది. వినియోగదారుల నుంచి రోజూ ఫీడ్ బ్యాక్ తీసుకొని వారు కోరుకునే తాజా మత్స్య ఉత్పత్తులను అందుబాటులో ఉంచనున్నారు. ఏపీ డిజిటల్ కంటెంట్ కార్పొరేషన్ సహకారం తీసుకుంటూ ఇతర మార్గాలను అందిపుచ్చుకొని ఫిష్ ఆంధ్రను ప్రమోట్ చేస్తారు. ప్రత్యేకంగా రూపొందించే యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే డోర్ డెలివరీ ఏర్పాటు కూడా చేస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.